RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers



27.04.2024 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:19 | సంచిక:279


## గన్‌పార్క్‌కు చేరిన రుణమాఫీ రాజకీయం-

## రాజీనామాకు రావాలని రేవంత్‌కు హరీష్ సవాల్



హైదరాబాద్, ఏప్రిల్ 26 తెలంగాణలో ఓ వైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అస్త్రంగా మలుచుకొని లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నాయి.

ఆరు హామీలతోపాటు రైతు రుణమాఫీ, రైతు బంధు పథకాల అమలు తీరుపై విమర్శలు చేస్తున్నాయి. కేవలం తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నమ్ముతున్న బీఆర్ఎస్... వాటిపైనే ఫోకస్ పెట్టంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి వాటిపైనే ప్రశ్నలు సంధిస్తోంది.

అందులో ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. అధినేత నుంచి సోషల్ మీడియా ఫాలోవర్ వరకు రైతుల సమస్యలనే ప్రధాన అస్త్రంగా చేసుకొని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి సభలో చెప్పినట్టు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తూ వచ్చారు. ఈ మధ్య జరిగిన ఓ సభలో వీటికి సమాధానంగా రేవంత్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆగస్టు కచ్చితంగా రుణ మాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. అలా చేస్తే బీఆర్ఎస్ నేతలు ముఖ్యంగా హరీష్ రాజకీయల నుంచి తప్పుకుంటాలా అని సవాల్ చేశారు. ఇలా మొదలైన యుద్ధం ఇప్పుడు పీక్‌కు చేరుకుంది. ఒకేసారి రుణ మాఫీ చేస్తే తాను రాజీనామా చేయడమే కాకుండా రాజకీయాల నుంచే తప్పుకుంటానని హరీష్ సవాల్ చేశారు అలాగనే గన్‌పార్క్ వద్ద ప్రమాణ చేస్తానని... రేవంత్ కూడా రావాలని పిలుపునిచ్చారు. అన్నట్టుగానే ఈ ఉదయం హరీష్ రావు గన్ పార్క్ వద్దకు రాజీనామా పత్రంతో వచ్చారు. రాజీనామా పత్రంతో గన్ పార్క్ వద్దకు హరీష్‌రావు తన అనుచర గణంతో చేరుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు కూడా అక్కడకు చేరుకున్నాయి. అయితే ఆయన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన్ని తప్పి పంపించారు. పోలీసుల జోక్యం చేసుకోవడంతో కాసేపు గన్ పార్క్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్ పార్క్ వద్ద మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు... రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని అన్నారు. రేవంత్ రాలేని పక్షంలో తన సిబ్బందితోనైనా రాజీనామా పత్రాన్ని పంపించాలని సూచించారు. అందరి ముందు ఇద్దరి రాజీనామా పత్రాలను పెడతామని... అన్న మాట ప్రకారం ఆగస్టు 15 లోపు ఏక కాలంలో ప్రతి రైతుకి ఉన్న రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేయాలన్నారు.

లేకుంటే రాజీనామాలు ఆమోదించుకొని రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందని ఇప్పుడు రుణ మాఫీ అంటూ మరో కొత్త మోసానికి తెరలేపిందన్నారు హరీష్. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తమకు రాజీనామాలు లెక్క కాదన్నారు. ఆ రైతుల రుణమాఫీ కోసం రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని... రేవంత్ రెడ్డి సిద్ధమా కాదా అనేది తేలాలన్నారు.

## హరీష్ సవాల్ స్వీకరిస్తున్న




హైదరాబాద్, ఏప్రిల్ 26ఆగస్టు15న రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రాజీనామా అంటున్న హరీష్‌రావు స్పీకర్ ఫార్మాట్‌లో రిజైన్ లెటర్ రెడీ చేసుకోమని సవాల్ చేశారు. ప్రజలను మోసం చేయాలనుకునే ప్రతిసారీ హరీష్‌రావుకు అమరవీరు స్థూపం గుర్తుకు వస్తుందని ఎద్దేవా చేశారు రేవంత్. ఉదయం నుంచి గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరు స్థూపం వద్ద హరీష్‌రావు చేసిన హడావుడిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ ఉదయం కాంగ్రెస్ సోషల్ మీడియా సిబ్బందితో సమావేశమైన రేవంత్... బీఆర్ఎస్ బీజేపీ నేతలపై విమర్శలు చేశారు. హరీష్‌రావు మోసానికి అరవీరుల స్థూపం ముసుగు మాత్రమే అన్నారు. మోసం చేయాలనుకునే ప్రతిసారీ అక్కడకే వచ్చి ఇలాంటి హడావుడి చేస్తుంటారన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా అమరుల స్థూపం వద్దకు వెళ్లారా హరీష్‌రావును రేవంత్ ప్రశ్నించారు. చాంతాడంత లేఖ రాసుకొచ్చి రాజీనామా లేఖ అంటున్నారని ఎద్దేవా చేశారు. రాజీనామా లేఖ అలా ఉండదన్నారు. తన మామ చెప్పిన సీస పద్యమంతా లేఖలో రాసుకొచ్చారని సెటైర్లు వేశారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా లేఖ చెల్లదని హరీష్‌కు సూచించారు రేవంత్. ఏదో లేఖను తీసుకొచ్చి హరీష్‌రావు తెలివి ప్రదర్శిస్తున్నారన్నారు. హరీష్ తెలివి మోకాళ్లలో కాదు.. అరికాళ్లలోకి జారినట్టుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీష్ ఇచ్చిన సవాల్‌పై రేవంత్ ఇంకా ఏమన్నారంటే... "హరీష్ ఇప్పటికీ చెబుతున్నా నీ సవాల్‌ను కచ్చితంగా స్వీకరిస్తున్నాం. పంద్రాగస్టులోగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం. నీ రాజీనామా రెడీగా పెట్టుకో. అని అన్నారు.

## జాంబాగ్ డివిజన్‌లో

## గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాదయాత్ర









హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని గోషామహల్ నియోజకవర్గం జంబాగ్ డివిజన్ పాదయాత్రలో భాగంగా ఇంటింటికి బీఆర్ఎస్ గడప గడపకు శ్రీనివాస్ యాదవ్ అనే నినాదంతో తులజా భవాని టెంపుల్ శంకర్ బాగ్, తోఫ్కానా,బాలయ్య బడా, గోషామహల్ పోలీస్ ఔటర్స్ స్వర్మ ట్రాన్స్ పోర్ట్, హిందీ నగర్ వాటర్ ట్యాంక్.. హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గారు మెయిన్ రోడ్, కాలనీలల్లో, వాడ వాడళ్ళలో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తు ప్రతి ఒకరిని కలుస్తూ బిఆర్ఎస్ పార్టీ కి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని కోరడం జరిగింది..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనీయర్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ , శ్రీనివాస్ గౌడ్, జైశంకర్, విజయ్‌ముదిరాజ్,భజన్‌సింగ్,నరేష్‌గౌడ్, ఆకాశ్ వాల్మీకీ,యోగేష్‌యాదవ్,నరేందర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ బస్తీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు...

## నేడే పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయాల్లో

## జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు - కేటీఆర్



బీ.ఆర్.ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కార్యక్రమాలలో పార్టీ యావత్తు పూర్తిగా నిమగ్నమైన నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను జిల్లా కార్యాలయ కేంద్రంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా పార్టీ కార్యవర్గంతో పాటు, పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పార్టీ తరపున ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏప్రిల్ 27, 2001 నాడు తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పుట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పార్టీ అహర్నిశలు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి, భారత రాష్ట్ర సమితిగా పరిణతి చెంది రైతుల కోసం, శ్రామికుల కోసం, కర్షకుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం, పేద వర్గాల కోసం, వారి అభివృద్ధి కోసం.. పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్లో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా%ా% వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే శ్రీ కె.టి రామారావు గారు పార్టీ జెండాను రేపు శనివారం ఉదయం 9 గంటలకు ఆవిష్కరించనున్నారు.

## మల్కాజ్ గిరిలో నువ్వు గెలుస్తావ్

హైదరాబాద్, ఏప్రిల్ 26 బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. తరచూ నోరు జారి లేదా తనదైన శైలిలో కామెంట్లు చేసి హైలైట్ అయ్యే ఆయన తాజాగా మరోసారి కూడా అలాగే వ్యవహరించారు. ఈసారి పార్టీ లైన్ దాటి వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. మల్కాజ్ గిరిలో బీజేపీ అభ్యర్థి గెలుస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున అభ్యర్థిగా ఈటల రాజెందర్ ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మల్కాజ్ గిరిలో ఈటల రాజేందర్ గెలుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ఒక ఫంక్షన్ లో ఈ ఆసక్తికర పరిణామం జరిగింది. అదే ఫంక్షన్ కు మల్కాజ్ గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా హాజరయ్యారు. అలా ఆ ఫంక్షన్ లో మల్లారెడ్డి, ఈటల రాజేందర్ కలుసుకున్నారు. ఆప్యాయంగా ఒకరితో మరొకరు ఫోటో దిగారు. అడిగి మరీ ఈటలతో ఫోటో దిగారు.. మల్లారెడ్డి. మల్కాజ్ గిరిలో ఈసారి నువ్వే గెలుస్తున్నవ్ అన్నా.. అంటూ మాట్లాడారు. "మల్కాజిగిరిలో ఇంకెవరు గెలుస్తారు. నువ్వే గెలుస్తున్నవ్" అంటూ ఈటల రాజేందర్ ను గట్టిగా హత్తుకున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్ వర్గాలను షాక్ కు గురి చేసినట్లు అయింది. ఓవైపు పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక సీట్లు కోసం బీఆర్ఎస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తూ ఉంది. స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగి రోడ్ షోల ద్వారా జనాల్లోకి వెళ్తున్నారు. బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు సాధించుకోవడం కోసం కష్టపడుతుంటే.. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈటల రాజేందర్ తో ఇలా వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది.మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గంలోనే మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మల్కాజ్ గిరిలో మొతం ఏడు సీట్లు బీఆర్ఎస్ గెలుచుకుంది. అలాంటి చోట బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తారని స్వయంగా మల్లారెడ్డి బహిరంగంగా ప్రకటించడం చర్చనీయాంశమైంది.

## ఫోన్ ట్యాపింగ్ లో మాజీ ఐజీ

హైద్రాబాద్, ఏప్రిల్ 26 ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన నిందితులు సమాజం మొత్తానికి హాని కలిగించేలా ప్రవర్తించారన్నారు హైదరాబాద్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి. ఇప్పటి వరకు ఫోన్ టాపింగ్ కేసులో నలుగురు అరెస్ట్ అయ్యారు. ప్రణీత్ రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధా కిషన్ రావులను ఈ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల విచారణకు వచ్చిన వీరు ఎలాంటి ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడ్డారని పోలీస్ కమిషనర్ తెలిపారు. అన్ని ఆధారాలు సేకరించిన తర్వాతే వీరిని అరెస్టు చేసినట్టు స్పష్టం చేశారు. త్వరలో రిటైర్డ్ ఐజిని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐజి ప్రస్తుతం హైదరాబాదులో లేరని, ఆయన ఎక్కడున్నా సరే త్వరలో రప్పించే ప్రయత్నం చేస్తున్నామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రిటైర్డ్ ఐజిపై ఇప్పటివరకు ఎలాంటి రెడ్ కార్నర్ నోటీస్ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే ఆ ప్రక్రియ సైతం జరుగుతుందని చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారం అన్ని కేసుల లాగా కాదని అన్నారు. ఇప్పటివరకు ఈ వ్యవహారంపై అరడజన్ ప్రెస్?నోట్?లు ఇచ్చామని, ప్రస్తుతం ఈ కేసు గురించి లోతుగా దర్యాప్తు కొనసాగుతుందని నిందితులు ఎవరైనా సరే తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు.రెడ్ కార్నర్ నోటీసు అంశంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ క్లారిటీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి రెడ్ కార్నర్ నోటీస్ ఇవ్వలేదని ఆయన తెలిపారు. కొంతమంది ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీస్ ఇచ్చారని ప్రచారం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. అలా ప్రచారం చేస్తే నిందితులు అలర్ట్ అయ్యి రెమెడీస్?ను కనుగొనే అవకాశం ఉందని శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు.

ప్రజాబలం

27.04.2024 శనివారం

# ఫెయిల్ జీవితం ముగిసినట్టు కాదు...!

తెలంగాణలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలు ఇలా వెలుబడ్డాయో లేదో క్షణాల్లోనే ఆరుగురు ఆత్మహత్యలకు పాల్పడగా, మరొకరు ఫలితాలకు కొన్ని గంటల ముందు.. ఫెయిల్ అవుతానన్న భయంతో మరో విద్యార్థిని ఫలితాలకు ముందు రోజు ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఫలితాలు వెలువడగా తీరా చూస్తే ఆమె 401 మార్కులతో పాస్ అయింది. విద్యార్థుల ఆత్మహత్యలు. ప్రభుత్వాలు అంగీకరించవలసిన భారీ సంక్షోభం.. ఈ పసికూనల ఆత్మహత్యలు విద్యార్థి లోకంలో మరొకసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గడచిన దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల్లోనూ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా సంభవిస్తున్న ఆత్మహత్యల్లో ఎనిమిది శాతం విద్యార్థులవే ఉండటం ఆందోళన కలిగించే అంశం. చక్కగా చదువుకుని వివిధ వృత్తుల్లో స్థిరపడి దేశానికి మానవ వనరుల సంపదగా మారాల్సిన విద్యార్థులు అర్థాంతరంగా ప్రాణాలు తీసుకోవడంపై సమాజంలోని అన్ని వర్గాలు ఆలోచించాల్సిన తరుణం...గతంలో సావిత్రీబాయి మరియు జ్యోతిరావ్ ఫూలే, భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్, పెరియార్, నారాయణ్ గురు వంటి సంఘ సంస్కర్తలు ప్రజలను అణచివేత నుండి విముక్తి చేయడానికి విద్యను ఒక సాధనంగా ఉపయోగించుకోగా, నేడు సమాజం తరువాతి తరాన్ని పౌరులుగా తయారు చేసేందుకు, రాష్ట్రాలు తమ భావజాలాన్ని నిలబెట్టుకోవడానికి విద్యను ఒక సాధనంగా వాడుతున్నాయే తప్ప భవిష్యత్తులో జరిగే భారీ ముప్పును గుర్తించలేకపోతున్నాయి. ప్రభుత్వాలు, పౌర సమాజం విద్యార్థుల ఆత్మహత్యలను దేశ విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభానికి సూచికగా చూడటం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

భారతదేశ జనాభాలో 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు 53-54 % మంది ఉన్నారు. మరో ముఖ్యమైన ఆందోళన ఏమిటంటే నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం భారతదేశంలో ప్రమాద మరణాలు, ఆత్మహత్యలు (ఏడీఎస్ఐ) నివేదిక, 2020 ప్రకారం, దేశంలో సుమారు 8.2% మంది విద్యార్థులు ఆత్మహత్యలకు బలవుతున్నారు ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు, అంటే ప్రతిరోజూ 34 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒక అంచనా ప్రకారం, ఒక ఆత్మహత్య కారణంగా మన దేశంలో 60-90 మంది ఇతరులు ప్రభావితమవుతారు. దీన్ని తీవ్ర సంక్షోభంగా సామాజిక సమస్యగా గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గుర్తించడానికి ఈ గణాంకాలు సరిపోవా?

భారత్‌లో రైతుల ఆత్మహత్యలు ఎక్కువ అనే విషయం తెలిసిందే. అయితే రైతుల కంటే ఎక్కువగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.2020లో రైతుల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఆత్మహత్యలతో చనిపోయారు, 2020లో ఆత్మహత్య చేసుకున్న వారిలో 8.2% మంది విద్యార్థులు ఉండగా, 7% మంది రైతులు, ఉన్నారు, అయినప్పటికీ భారతదేశంలో రైతుల ఆత్మహత్యలు సంక్షోభంగా విస్తృతంగా గుర్తించబడుతున్నప్పటికీ, విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా కబ్జాకు గురవుతున్నయి. ఈ వ్యవహారంపై కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడ సీరియస్‌గా దృష్టిపెట్టాలని పార్లమెంట్ స్థాయీ సంఘం కోరింది. రైతుల మరణాలను జాతీయ సంక్షోభంగా భావిస్తున్నామని, విద్యార్థుల మరణాలపై కూడా ఆ స్థాయిలో కలవరపడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపినప్పటికీ ప్రభుత్వాలలో చలనం లేకపోవడం బాధాకరం. 19 నుంచి 29 ఏళ్ల లోపు వయస్సు వారిలో ప్రాణాలు తీసుకోవాలనే ఆలోచనలు ఎక్కువగా ఉండటం భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు సూచిస్తున్నాయి. మేధావులు, ప్రభుత్వాలు దీర్ఘకాలంగా రైతుల ఆత్మహత్యలను భారతదేశ వ్యవసాయ సంక్షోభంతో ముడిపెట్టారు, కానీ ముక్కు పచ్చలారని విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో మాత్రం అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు తప్ప నిశితంగా పరిశీలించడం లేదు.

నేటి సమాజంలో విద్యార్థులు చిన్న తప్పిదాలకు, అపజయాలకు, అతిగా ఊహించుకొని పరీక్షల్లో ఫెయిల్ అయితే ఇక జీవితమే లేదన్నట్టుగా భయపడి మంచి భవిష్యత్తు ఉన్న జీవితాన్ని మధ్యంతరంగానే ముగించేస్తున్నారు, నవ మాసాలు మోసి, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కాదనుకొని, క్షణికావేశంలో తీసుకుంటున్న ఈ అపరిపక్వ నిర్ణయాలు తల్లిదండ్రులను జీవిత కాలం పాటు బాధిస్తుంటాయనే విషయాన్ని పిల్లలు ఆలోచించాలి, ఈ ప్రపంచంలో నూటికి 60 శాతం మంది తమ జీవిత కాలంలో ఏదో ఒక పరీక్షల్లో ఫెయిల్ అయిన వాళ్లేనన్న విషయం తెలుసుకోండి, ముఖ్యంగా అకాడమిక్‌లో సక్సెస్ అయిన వాళ్ళు జీవితంలో సక్సెస్ కాలేకపోతున్నారు, విద్యాపరంగా ఫెయిల్ అయిన వాళ్లు జీవితంలో ఎక్కువగా రాణిస్తున్నట్లు మనందరికీ తెలిసిందే, అలాగే విద్యాపరంగా ఎదురుదెబ్బలు తిని విజయవంతమైన ప్రసిద్ధ వ్యక్తులలో థామస్ ఎడిసన్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఓప్రా విన్ఫ్రే, వాల్ట్ డిస్నీ ఉన్నారు. ఈ వ్యక్తులలో ప్రతి ఒక్కరు విద్యాపరమైన సవాళ్లు లేదా వైఫల్యాలను ఎదుర్కొన్నారు, కానీ చివరికి కృషి, సృజనాత్మకత ద్వారా వారి సంబంధిత రంగాలలో విజయం సాధించారు. మన పిల్లలకోసం స్వర్గం లాంటి విద్యాసంస్థలను తయారు చేయలేకపోయినా.. కనీసం వాటిని మృత్యు కేంద్రాలుగా మార్చకుండా ప్రభుత్వాలు చేయాలి, విద్యా వ్యవస్థ నిర్మాణాత్మక అంశాలపై లోతైన ఆత్మపరిశీలన అవసరం. విద్యా వ్యవస్థని సంస్కరిస్తూ విద్యార్థుల ఆత్మహత్యలు ఒక సంక్షోభమని గుర్తించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం మన సమిష్టి బాధ్యత. అలా చేయడంలో విఫలమైతే, విద్యావ్యవస్థ వారిని విఫలం చేసినందున, వారి జ్ఞాపకాలను పాతాళంలోకి నెట్టివేసి, విద్యార్థుల మృతదేహాలపై భారతీయ సమాజం నిర్మిస్తున్నామనే చేదు విషయాన్ని జీర్ణించుకోక తప్పదు..

## ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జయప్రదం చేయండి

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు కార్మిక వర్గానికి పిలుపు

కోరుట్ల 138 వ ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే) ను కార్మిక వర్గ శ్రేణులు జిల్లాలో కార్మిక అడ్డాల వద్ద ఘనంగా అరుణ పతాకం ఎగురవేసి ఉత్సాహం జరపాలని ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపు నిచ్చారు.శుక్రవారం రోజున కొరుట్ల డివిజన్ కేంద్రంలో కార్మికులతో మేడే ఉత్సవ గోడ పత్రికలు, కరపత్రాలుఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (ఏఐటీయూసీ)1920లో పురుడు పోసుకోని కార్మిక చట్టాల కోసం నిరంతరం పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు .. ఫలితమే 8 గంటల పని దినమైనదని అన్నారు.. బ్రిటిష్ పరిపాలన నుండి దేశ స్వతంత్రం కోసం పోరాడిందన్నారు. త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించిన బిజెపి ప్రభుత్వ ను గద్దె దింపాలన్నారు.. 2024 పార్లమెంటు ఎన్నికలలో కార్మిక సంఘాలు ప్రజలను చైతన్య పరిచి ఇండియా కూటమిని గెలిపించాలని అన్నారు... అనేకసార్లు దేశవ్యాప్త సమ్మెలు చేసిన కార్మిక వర్గానికి మేలు జరిగింది లేదని ప్రధాన కార్మిక చట్టాలను పునరుద్ధించాలని కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఈఎస్ఐ, పిఎఫ్ బీమా పెన్షన్ సౌకర్యంతో పాటు పేదలకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు..ఈ సమావేశంలో హమాలీ మున్సిపల్ బీడీ వర్కర్స్ ,వంశీ, చాంద్ పాషా, గంగారం, రవి , శ్రీనివాస్ , సాయిలు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పై మళ్లీ గందరగోళం

హైదరాబాద్, ఏప్రిల్ 26 తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ 2024) ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన తేదీలు కూడా ఇప్పటికే విద్యాశాఖ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈసారి ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ పేర్కొంది. ఇక జూన్ 12న టెట్ 2024 ఫలితాలు కూడా ప్రకటిస్తామని షెడ్యూల్‌లో పేర్కొంది. దీంతో నిరుద్యోగులు టెట్ ప్రిపరేషన్‌లో మునిగిపోయారు. అయితే సార్వత్రిక ఎన్నికల గండం గడిచినా.. మ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం టెట్ పరీక్షపై పడుతుందేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.ముఖ్యంగా రాష్ట్రంలోని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం (ఏప్రిల్ 25) విడుదలైంది. మే 27న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నట్లు షెడ్యూల్ పేర్కొంది. ఈ క్రమంలో మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ప్రకటించడంతో అసలు ఆయా తేదీల్లో పరీక్షలు ఇంటాయో.. లేదోనని అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు.మే 27న పోలింగ్ కాబట్టి ఆ రోజు ఆయా జిల్లాల్లో సాధారణ సెలవుగా ప్రకటిస్తారు. టెట్ పరీక్షకు హాజరయ్యేవారంతా పట్టభద్రులు కావడంతో వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే టెట్ పరీక్షల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పాఠశాల విద్యాశాఖ తర్జనభర్జనలు పడుతుంది. తెలంగాణ టెట్ పరీక్షలు మే 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తామని చెప్పినప్పటికీ ఏ తేదీన ఏ పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తామనే విషయం మాత్రం ఇప్పటివరకు విద్యాశాఖ వెల్లడించలేదు. ఉప ఎన్నికల నేపథ్యంలో పేపర్ల వారీగా పరీక్షల నిర్వహణ తేదీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఆ ప్రకారంగా పోలింగ్ రోజున పరీక్షలు జరపకుండా మిగతా రోజుల్లో యథావిధిగా జరిగేలా షెడ్యూల్ రూపొందించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# 2 వేల నోట్లకు మోక్షం

తిరుమల, ఏప్రిల్ 26 తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు రద్దీ భారీగా పెరుగుతోంది. కానుకల రూపంలో భారీ స్థాయిలో మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఆదాయం కూడా సమకూరుతోంది. ఈ నేపథ్యంలోనే తిరుమల శ్రీవారి హుండీ ఆదాయంలో వచ్చిన రూ.2 వేల నోట్లకు మోక్షం లభించింది. రూ.2 వేల నోట్ల మార్పిడిలో ఎట్టకేలకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రయత్నం ఫలించింది. ఎట్టకేలకు రూ.2 వేల నోట్లను తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ అంగీకరించింది.2023 అక్టోబర్ 7 నుంచి రూ. 2 వేల నోట్ల మార్పిడి రద్దు చేసింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. అయితే ఆ తరువాత కూడా భక్తులు తిరుమల శ్రీవారి హుండీలో రూ. 2 వేల నోట్లను కానుకగా సమర్పించారు. ఆ నోట్లు తీసుకునేందుకు బ్యాంకులు, ముఖ్యంగా రిజర్వ్ బ్యాంక్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ అధికార్లతో సంప్రదించి నోట్ల మార్పిడికి విజ్ఞప్తి చేసింది టీటీడీ. ఏడాది పైగా ఆర్బీఐ అధికారులను ఒప్పించిన టీటీడీ అధికారులు రూ.2 వేల నోట్లను తీసుకునేలా చేసింది.2023 అక్టోబరు 7 నుంచి రూ.2 వేల నోట్ల మార్పిడిని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన సంగతి తెలిసిందే..! అయితే.. కొందరు భక్తులు ఆ తరువాత కూడా తిరుమల శ్రీవారికి హుండీలో వాటిని సమర్పించారు. దీంతో ఆ నోట్ల మార్పిడికి అవకాశం కల్పించాలంటూ టీటీడీ అధికారులు పలుమార్లు ఆర్‌బీఐని కోరారు. ఎట్టకేలకు టీటీడీ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధులు నోట్లును తీసుకునేందుకు అంగీకరించారు. 2023 అక్టోబర్ 8 నుండి 2024 మార్చి 22 వరకు 5 విడతలో 3 కోట్ల 20 లక్షల విలువ చేసే 2 వేల నోట్లను మార్పిడి చేసుకుంది టీటీడీ.ఇదిలావుంటే, 2016లో జరిగిన నోట్ల రద్దు సమయంలో టీటీడీ హుండీ ద్వారా వచ్చిన సుమారు రూ.50 కోట్ల నోట్లను రిజర్వు బ్యాంక్ తీసుకోలేదు. దీనిపై టీటీడీ పాలక మండలి కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

# ఇంటి యజమానినే దోచేశారు

వరంగల్, ఏప్రిల్ 26 ప్రియుడు.. అక్కతో కలిసి యజమాని ఇంటికి కన్నం వేసిన పని మనిషి ఉదంతం తాజాగా వెలుగు చూసింది. ఆమె పని చేస్తున్న యజమాని ఇంట్లోనే పని మనిషి కళ్యాణి చోరీకి పాల్పడిందని.. ఆమెకు ప్రియుడు చంటి, అక్క సునీత సహకరించారని వరంగల్ కమిషనరేట్ పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. పని మనిషి సహా ఆమె ప్రియుడు, అక్క నుంచి రూ.38 లక్షల విలువ చేసే బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ మండలం బిల్యానాయక్ తండాకు చెందిన కళ్యాణి హనుమకొండ లోని సంతోష్ నగర్ లో నివాసం ఉంటున్న డాక్టర్ కీసర విక్రమ్ రెడ్డి ఇంట్లో కొంత కాలంగా పని మనిషిగా పని చేస్తుంది. ఇదే సమయంలో నిందితురాలు తన యజమాని ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ఉన్నట్లుగా గుర్తించింది. కళ్యాణికి యజమాని ఇంట్లోని బంగారం పై ఆశ కలిగింది. ఎలాగైనా బంగారాన్ని దొంగిలించాలని ప్రియుడు చంటి, కళ్యాణి అక్క సునితతో కలిసి ప్లాన్ ప్రకారం యజమాని కళ్లు కప్పి 650 గ్రాముల బంగారు అభారణాలను నాలుగు దఫాలుగా చోరీ చేసినట్లుగా వరంగల్ కమిషనర్ తెలిపారు. ఇంట్లో బంగారం మాయం అవుతుండడంతో యజమాని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పని మనిషిపై అనుమానంతో ఆమెను విచారణ చేయగా.. చోరికి పాల్పడినట్లు తేలిందని సీపీ చెప్పారు. ఈ చోరీ మార్చి నెలలో జరిగిందని అన్నారు. దొంగిలించిన బంగారు అభరణాల్లో కొంత భాగం బంగారాన్ని తాకట్టులో పెట్టి కారు కొన్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ముగ్గురు నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా మీడియాకు చెప్పారు.

## గణితం అవగాహనతో సులభం

### టీ బీ సీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్

జగిత్యాల :గణిత భోదనలో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులు భోదకులు నేర్పించినప్పుడే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని టీ బీసీ జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేతాజీ వృత్తి విద్యా కాలేజీ సమావేశ మందిరంలో ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతి వేడుకలను నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హరి ఆశోక్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణిత భోదనలో నిష్ణాతులైన అధ్యాపకులను హరి ఆశోక్ కుమార్ చేతుల మీదుగా కాలేజీ యాజమాన్యం సన్మానించారు.అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ గణిత సమస్యలను సులభంగా చేసేందుకు నేతాజీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.గంగాధర్ రూపొందించిన భోదన పద్ధతులను అభినందించారు.ప్రస్తుత పోటీని తట్టుకోవడానికి కొత్త విధానాలను అన్వేషించి గణిత అధ్యాపకులు అమలు చేసినప్పుడే విద్యార్థులు తమ ప్రతిభను చాటుకొనే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నేతాజీ కాలేజీ కాలేజీ కరెస్పాండెంట్ సింగం భాస్కర్,ప్రిన్సిపాల్ గంగాధర్,టీ బీసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్,మహిళా జేఏసి జిల్లాఅధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, ఉపాధ్యక్షుడు వెలుముల ప్రకాష్ ,సీనియర్ సిటీజేన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, అధ్యాపకులు శ్రీనివాస్ ,వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా విద్యార్థి జేఏసీఅధ్యక్షుడు ధోనూరి భూమాచారి, తదితరులు పాల్గొన్నారు.

## అట్లూరు మండలంలో కూటమి పార్టీల సుడిగాలి ప్రచారాలు

### ఇంటింటికి వెళ్లి ఓట్లు అడుగుతున్న నాయకులు కార్యకర్తలు

### ప్రచారంలో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బిజెపి అభ్యర్థి బొజ్జ రోశయ్య తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ కుమార్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకుడు రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు గెలుపే లక్ష్యంగా కూటమి పార్టీలు తీవ్రంగా ప్రయత్నం చేస్తుంది అందులో భాగంగా బద్వేలు అసెంబ్లీ బిజెపి అభ్యర్థి బొజ్జ రోశయ్యతో కలిసి తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలు సుడిగాలి ప్రచారాలు చేస్తున్నాయి అందులో భాగంగా బద్వేల్ పట్టణం అట్లూరు మండలంలో ప్రచారాలు ముమ్మరంగా జరుగుతున్నాయి ప్రచారంలో బిజెపి అభ్యర్థి బొజ్జ రోశయ్య బద్వేలు తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ కుమార్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకుడు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి మనోహర్ రెడ్డి స్థానిక నాయకులు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారుబద్వేలు నియోజకవర్గం, అట్లూరు మండల పరిధిలోని కామసముద్రం, కామసముద్రంమిట్ట, అరుంధతి నగర్, వరధారాజుపల్లె గ్రామాలలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో ని ప్రజలకు వివరిస్తూ, మోదీ – చంద్రబాబు సహాయం తో బద్వేలు సంపూర్ణ అభివృద్ధి జరగాలంటే, బద్వేలు నియోజకవర్గ బీజేపీ – టీడీపీ – జనసేన ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న గారి కమలం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరినమాజీ ఎమ్మెల్యే విజయమ్మ , యువనేత రితేష్ రెడ్డి కోరారు ఇంటింటి ప్రచారంలో భాగంగా యువనేత రితేష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మతో ప్రజలు వారి ఇబ్బందులను, సమస్యలను, విన్నవించుకోగా ×అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మీ ప్రతీ సమస్యలను పరిష్కరిస్తామని మాట ఇచ్చిన యువనేత రితేష్ రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్నప్రచారంలో యువనేత రితేష్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న తెలుగుదేశం పార్టీ, బీజేపీ పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

## టీడీపీకి భారీ షాక్

తుని మాజీమంత్రి యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు టిడిపికి రాజీనామా చేసారు. తుని సీటు విషయంపై అన్నదమ్ముల మధ్య కొంతకాలంగా పార్టీకి దూరంగా యనమల కృష్ణుడు ఉంటున్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరుతున్నట్లు

## నేను చచ్చే దాకా కాంగ్రెస్ లో ఉంటా

హైదరాబాద్ నేను చ్చే దాకా కాంగ్రెస్ లో వుంటానని మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు.శుక్రవారం అయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతది. ఉద్యోగాలు రావాలన్నా, ప్రమోషన్లు కావాలన్న రాహుల్ గాంధీ ప్రదాని కావాలి. దేశంలో బీసీలు ఎక్కువగా ఉన్నారు. మోడీ బీసీలకు ఎలాంటి న్యాయం చేయలేదు. మోడీకి ఓటు వేస్తే ఆదాని, అంబానీ లకు ఓటు వేసినట్లే. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేయించే భాధ్యత బీసీలు తీసుకోవాలనిఅన్నారు.

## బీఆర్ఎస్ బిగ్ షాక్

### గాంధీ భవన్ లో బీఆర్ఎస్ నుండి భారీగా చేరికలు

హైదరాబాద్ చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సంభాని చంద్ర శేఖర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు,యడవెల్లి కృష్ణ, రామచంద్ర నాయక్, ఖమ్మం జిల్లా కామేపల్లి జెడ్పిటిసి బాణోత్ ప్రవీణ్ కుమార్ నాయక్,ఎంపీటీసీ శంకర్ నాయక్ తదితరులు పాల్గోన్నారు. వారికి కండువా కప్పి పార్టీలోకి జగ్గారెడ్డి, కోదండ రెడ్డి ఆహ్వానించారు.

## ఎమ్మిగనూరు పట్టణంలోని "శుక్రవారం అబూబక్కర్ మజీద్ లో సల్ఫియా మసీదు లో నందు వైఎస్ఆర్సీపీ నాయకులు "మైనార్టీ నాయకులు" ప్రచారం

ఎమ్మిగనూరు ఏప్రిల్ 26 శుక్రవారం సమన్వయకర్త బుట్టా రేణుక ఫ్యాను గుర్తుకి ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరడమైనది.×ఈ కార్యక్రమంలో జిల్లా వర్క్ బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్ . జామియా మజీద్ ప్రెసిడెంట్ ఖాసీం బేగ్ సొసైటీ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ 16 వార్డు కౌన్సిలర్ వహీద్ 15 వార్డు కౌన్సిలర్ ఇసాక్ 12 వార్డు ఇన్చార్జి షాబుద్దీన్ మున్సిపల్ కోఆప్షన్ గట్టు కాజా జిల్లా ప్రచార కార్యదర్శి చంద్ మెకానిక్ బాషా జగన్ రఫీ పాల్గొన్నారు.

## గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామం లో ఈరోజు డాక్టర్ స్టెల్లా సతీష్ శుక్రవారం ప్రచారం

గూడూర్ ఏప్రిల్ 26 శుక్రవారం గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో ప్రచార కార్యక్రమం సతీష్ కనుక ప్రజలు స్పందించడం జరిగింది అలాగే జగనన్నకే మన ఓటు ఫ్యాన్ గుర్తుకే మన ఓటు మన డాక్టర్ సతీష్ గారిని మనం గెలిపించుకున్నాము మన ధైర్యం నువ్వే అన్న జగనన్నప్రజలకు అన్ని పథకాలు ప్రజలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు ఇవ్వడం జరిగింది గుడిపాడు కృష్ణారెడ్డి రంగారెడ్డి మరియు వెంకటేశ్వర్ రెడ్డి కన్వీనర్లో కౌన్సిలర్లు మరియు కార్యకర్తలు అందరూ పాల్గొన ప్రజలు పాల్గొనడం జరిగింది

## 22 నామినేషన్లకు ఆమోదం

పిఠాపురం రాష్ట్ర అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పిఠాపురంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని పిఠాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పిఠాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రామ సుందరరెడ్డి చేపట్టారు.పోటీలో ఉన్న అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి రామసుందరరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ.,జాతీయ,ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు,ఇండిపెండెంట్ అభ్యర్థులతో సహా మొత్తం 22మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించడం జరిగిందని తెలిపారు..

# విశాఖ ఉక్కు ఉద్యమం నేపథ్యం

విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి మూడేళ్లు అయింది.విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు 57ఏళ్లు దాటినా తెలుగు ప్రజల హృదయాలలో మరచి పోలేని జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తించే అలాంటి నినాదాన్ని అమృత తుల్యం చేసి, శాశ్వతం చేసిన మహనీయుడు తమనంపల్లి అమృతరావు. విశాఖలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిందేనని ఎలుగెత్తి అరచి ఒకే ఒక గొంతు అమృతరావుదే. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు అకుంఠిత దీక్ష చేపట్టి, అమరణ దీక్షలోనే అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు బాటను నడచి, చరిత్ర గర్వించిన మరో గొప్ప ఉద్యమానికి ఆవిష్కరణ జరిగిన రోజు. అదే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదంతో అమృతరావు చేపట్టిన పోరు. అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో తెన్నేటి విశ్వనాథం, యం.వి.భద్రం, రావిశాస్త్రి, చౌదరి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అమృతరావు దీక్షకు మద్దతుగా జనసంఘ్ పార్టీ నాయకులు, ప్రజాపార్టీ నాయకులు దీక్ష చేశారు.

అమృతరావు దీక్ష విరమింప జేయాలని నాటి పీసీసీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, అప్పుడు దొర, భాట్టం శ్రీరామ్మూర్తి కొందరు కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాటు, ఎంపీలు, మంత్రులు అంతా కూడా ఆయనను దీక్ష నుంచి విరమించు కోమని కోరారు. అదేం కుదరదు కచ్చితమైన ప్రకటన రావాల్సిందే, లేదా నా చావును అంతా చూడాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. కొత్తగా ప్రధానమంత్రి అయిన శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిలో విశాఖ ఉక్కు ఉద్యమం పడింది. అమృతరావు మొండితనాన్ని గురించి ఆమె తెలుసుకున్నారు. విశాఖలోనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖకు నేరుగా వచ్చి, కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉన్న అమృతరావుకు కేంద్రం ప్రకటనను వినిపించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆ విధంగా విశాఖలో 1971లో ఉక్కు కర్మాగారం ఏర్పడింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళి కలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది.

1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ ఒ కో సమగ్ర నివేదిక సమర్పిం చింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్థుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థఉండి విడివడి =×చీా గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది.

1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్త య్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998–2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలి యా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు.

మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిడ్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేక పోతున్నారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఎసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి మూడేళ్లు పూర్తి అయింది.

# సంకట హర చతుర్థి

కృష్ణ పక్ష చతుర్థిని సంకష్ట హర చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి మంగళవారం నాడు వస్తే అంగారక సంకష్ట చతుర్థి అంటారు. వినాయకుని ఆరాధకులు సంకట వినాయక వ్రతం అనేది అత్యంత ప్రాముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. ఆ రోజు అంతా ఉపవాసం వుండి సంకట గణేష పూజ సాయంకాలం జరిపి, చంద్రదర్శనం అయినాక వారి ఉపవాసంకు ముగింపు పలికి ఏదన్నా తింటారు. సంకట చతుర్థి ప్రాముఖ్యత భవిష్య పురాణంలోనూ నరసింహ పురాణంలోనూ చెప్పబడింది. సంకట చతుర్థి మహత్యం శ్రీ కృష్ణుడు యుధిష్టరునికి వివరించాడు. సంకట అంటే కష్టములు, ఇబ్బందులు, సమస్యలను హర అంటే హరించేది అని అర్థం. ఋగ్వేదంలో గణపతి వేదాలు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వవ్యాపక భక్తుల ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వా హ్లాదకరుడని, సర్వులకు జ్యేష్టుడని, అధినాయ కుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని కీర్తించబడ్డాడు. గణపత్యథర్వ శీర్షోపనిషత్తులో గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూపమని సృష్టి స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యము లకు సృష్టికి కర్త హర్త అని ఆనందమయుడని చిమ్మయుడని, లంబోదరుదని, శూర్పకర్ణుడు రక్తంగుడిగా అభివర్ణించారు. అటువంటి గణపతి సంకటాలను దూరం చేసేవాడని సంకట హరుడుగా పూజించడం అనాదిగా వస్తున్నదే. సంకటహరుని పూజించడానికి కృష్ణ పక్ష చతుర్థి ప్రసిద్ధి.

సంకట హర చతుర్థి గురించి శ్రీకృష్ణుడు, ధర్మరాజుకు వివరించినట్లు పురాణ కథనం. భవిష్య, నరసింహ పురాణాల ప్రకారం, ఒక సారి ఇంద్రుడు, గణేశ ఉపాసకుడైన భృషుండి అనే మహాముని ఆశ్రమం నుండి, విమానంపై ఇంద్ర లోకానికి తిరిగి వెళుతూ, శూరసేన మహారాజు రాజ్యం మీదుగా వెళ్ళే సమయాన మహా పాపాత్ముడొకడు, విమానాన్ని చూసినంతనే విమానం నేలపై దిగి పోతుంది. తేజో విరాజితమైన విమానాన్ని శూరసేనుడు చూడబోయి, ఇంద్రుడిదని తెలుసుకుని, ఆగి పోవడానికి కారణమడిగి ఇంద్రుని ద్వారా విని, మళ్ళీ లేచే ఉపాయం ఏదని అడుగుతాడు. ఆనాడు బహుళ పంచమి ఐనందున, గత దినం చతుర్థినాడు ఉపవసించిన భక్తులు ఉపవాస ఫలాన్ని దారబోస్తేనే, విమానం మళ్ళీ లేవగలదని ఇంద్రుడు వివరిస్తాడు. శూరసేనుని ఆజ్ఞానువర్తులైన సైనికులు రాజ్యమంతా వడబోసినా అట్టి భక్తులు దొరకనిస్థితిలో నిరాశకు లోనుకాగా, ఆసమయం లోనే మృతి చెందిన ఒక స్త్రీని గణపతి దూత తీసుకెళు తుండడం చూసి ఇదేమిటని సైనికులు అడుగుతారు. ఆమె గతదినం నిద్రలో ఉపవాసంతో ఉండి, రాత్రి చాలాసేపైనాక మెలకువ వచ్చి భోజనం చేసిందని, తెల్లవారి మృతి చెందినదని, అలాగే జీవితంలో ఒకసారైనా సంకటహర చతుర్థి ఆచరిస్తే గణపతి లోక ప్రాప్తి లభించగలదని చెప్పారు. ఆమె శరీరాన్ని తమకు ఇవ్వాలని సైనికులు కోరగా, గణపతి దూత నిరాకరిస్తాడు. అదే సమయంలో ఆమె శరీరం నుండి వీచిన పెనుగాలి ఇంద్రుని విమానాన్ని స్పృశించిన వెంటనే అది పైకి లేస్తుంది.

కృష్ణ పక్ష చతుర్థి సంకష్టహర, సంకటహర చతుర్థి అంటారు. ఈరోజు దినమంతా ఉపవాస ముండి, సాయంత్రం, నిశి పూజ, చంద్రదర్శనానంతరం భోజనాలు చేయడం, నిర్దేశిత ఆచారం. ఇలా చేస్తే సకల కష్టాలు, సంకటాలు తొలగి పోయి, సంకట నాశకుడైన విఘ్న నాయకుని కృపకు పాత్రులు, జన్మరాహిత్యం . మోక్షం సిద్ధించి, సప్త జన్మలు అవసరం లేకనే శాశ్వత గణేశ ప్రాప్తి కలుగనున్నట్లు పురాణాలు వివరిస్తున్నాయి. తలపెట్టిన పనులకు విఘ్నాలు కలుగుతూ అశాంతి, మానసిక, శారీరిక రుగ్మతలు, రుణ బాధలు, అనేక కష్టాలు కలుగుతున్నప్పుడు దుష్టగ్రహ పీడన నివారణ కొరకై ప్రతి నెలా సంకష్టహర చవితి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుని పూజలు జరపడం సంప్రదాయం. కృష్ణపక్ష చవితి తిథి మంగళవారం తో కూడి వస్తే అంగారక చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి నాడు కలశ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా గణపతి అధర్వ శీర్ష పూజలు, అభిషేకం, అష్టోత్తర అర్చనలు, నివేదన, హారతి, మంత్రపుష్పం, నీరాజన, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయక క్రతువులను నిర్వహించడం, భక్తుల గోత్రనామాదులతో ప్రత్యేక అర్చనలు, గణపతి ఉపనిషత్ యుక్త అభిషేకాదులను నిర్వహించు కోవడం, భక్తులు తమ స్వగృహాలలోనూ గణపతి పూజ లొనరించి రాత్రి చంద్ర దర్శనానంతరం అరగించడం సనాతన సంప్రదాయం. వినాయకుని అనుగ్రహ ప్రాప్తికై, కుజుడు చేసిన తపస్సు ఫలితంగా, మాఘ కృష్ణ చతుర్థి దినాన చంద్రోదయ వేళలో పది భుజాలు కలిగిన బాలుని రూపంలో ప్రత్యక్షమై ఆ నాడు మంగళవారం కనుక కుజుని పేరు మంగళుడని నామకరణం చేసి, అంగారక సంకష్ట చతుర్థి నాడు వినాయక వ్రతాచరణ ద్వారా కుజ దోష సమస్యలు తొలగి పోగలవని, సంకటాలన్ని తొలిగి సఫలత లభించగలదని వరం ప్రసాదించారని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

# జల సంక్షోభం..

మన దేశంలో ఎన్నికల పండుగ వచ్చింది. పార్టీల నాయకులు ఓట్లు, సీట్లు అధికార దాహంలో బిజీ బిజీగా ఉన్నారు. ప్రజలు ఐదేళ్లకోసారి వారి అధికార దాహార్తిని క్రమం తప్పకుండా తీర్చుతున్నారు. కానీ ప్రజలకిచ్చిన హామీలు, సురక్షిత జల దాహార్తిని తీర్చడంలో మూడు అడుగులు ముందుకేస్తే! ముప్పైఅడుగులు వెనక్కేసినట్లు తాగు నీటి కొరతతో విలవిలలాడుతున్నారు జనం. వేసవి ప్రారంభంలోనే నీటి కొరత భయపెడుతుంది. దేశవ్యాప్తంగా 150 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిలువలు వాటి పూర్తి నిలువ సామర్థ్యంలో 38 శాతానికి పడిపోయాయి. ఇది గత దశాబ్ద కాలపు సగటు కంటే తక్కువ కావడం ఆందోళన కలిగిస్తుంది. అధికార దాహం.. తీరని జల దాహం!

నేడు మన దేశంలో ఎన్నికల పండుగ పార్టీ(నాయకు)లు ఓట్లు, సీట్లు అధికార దాహంలో బిజీ బిజీగా ఉన్నారు. ప్రజలు ఐదేళ్లకోసారి వారి అధికార దాహార్తిని క్రమం తప్పకుండా తీర్చుతున్నారు. కానీ ప్రజలకిచ్చిన హామీలు, సురక్షిత జల దాహార్తిని తీర్చక పోవడంతో తాగు నీటి కొరతతో జనం విలవిలలాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులతో కూడిన దక్షిణాదిలో 42 ప్రధాన రిజర్వాయర్ల నిలువ సామర్థ్యం 53.334 బీసీఎం. కానీ ప్రస్తుతం 12.287బీసీఎం ల నీరు ఉంది. వాటి పూర్తి సామర్థ్యంలో ఇది 23% మాత్రమే. నిరుడు ఇదే సమయంలో( 39% ), పదేళ్ల సగటులో( 32) శాతం పోలిస్తే ఈ ఏడాది వాటిలో జలాలు తగ్గినాయి. కర్ణాటక రాజధాని బెంగళూరు నేడు నీటి కొరతతో అల్లాడిపోతుంది. తాగునీటి ఎద్దడి మూలంగా ఎన్నికల ప్రచారానికి వెళ్తే ప్రజలు నిలదీస్తారని భయంలో పార్టీలు ప్రచారానికి వెళ్లడం లేదు.

తెలంగాణ రాష్ట్రంలో.. చుట్టూ జీవనదులు ప్రవహిస్తున్నా గొంతు తడుపుకోవడానికి కష్టాలు పడుతున్నారు.సుదూర ప్రాంతాల్లోని పట్టణాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నా కృష్ణా నది పక్కనే ఉంటున్న వేలాది మంది ప్రజల గొంతు మాత్రం తడవడం లేదు. కృష్ణా నది ఎగువ ప్రాంతమైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులలో సరిపడా నీళ్లు ఉన్నా.. దిగువ ప్రాంతాల ప్రజలు తాగునీటి కొరకు ఇబ్బందులుపడుతున్నారు. వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కూత వేటు దూరంలో ఉన్న కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలకు తాగునీరు అందడం లేదు. నది సమీప ప్రజలకు ఆందోళనలో ఉన్నారు. బోరు బావులు, జలాశయాలు అడుగంటి పోతున్నాయి. ప్రాజెక్టులలో నీటి కొరత, వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల పరిధిలోని జిల్లాలో జూరాల ప్రాజెక్టు కింద గద్వాల, వనపర్తి, శ్రీశైలం కింద నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్ నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో మే లో తాగునీటి సమస్య రానుంది. నాగార్జున్ సాగర్ నుంచి హైదరాబాద్, నల్గొండకు ఇబ్బంది రానుంది. పాలేరు కింద మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు జల సమస్య రానుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ఇబ్బందులు తప్పకపోవచ్చు. వర్షాలు పడకపోవటమే నీటి ఎద్దడికి కారణం.

ఇలా ఉండగా మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలో 23 వేల 900వందల ప్రదేశాలకు ప్రస్తుతం తాగునీటి సరఫరా జరుగుతున్నది. నిర్వహణ ఇబ్బందుల నేపథ్యంలో ప్రతిరోజు 600 నుంచి 800 గ్రామాలకు తాగు నీటికి ఇక్కట్లుపడచున్నారు. రాష్ట్రంలో సురక్షిత జలాల నిర్వహణకు కేంద్ర బిందువైన "మిషన్ భగీరథ" పథకానికి ప్రధానంగా లీకేజీ, పైప్లైన్ల నిర్మాణం, నిర్వాహణ నాణ్యంగా లేకపోవటం, నల్లాల ఏర్పాటు సైతం సరిగా జరగకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. వీటిని సరి చేసి తక్షణమే ఆయా జిల్లాలలో ఎద్దడి తగ్గించడానికి ప్రయత్నం చేయాలి. ఈ వర్షాభావ స్థితిలో ఆదిలాబాద్, ములుగు, ఖమ్మం, కొమరం భీం, నారాయణపేట, నాగర్ కర్నూల్ తదితర జిల్లాలలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మిషన్ భగీరథ ఇంజనీర్లకు, ఉద్యోగులకు రెండు నెలల పాటు సెలవులు రద్దు చేసింది. సమస్య ఉన్న చోట వెంటనే పరిష్కరించాలి.

ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాలను అవసరాలకు మించి మితిమీరి వాడు కుంటున్న జాబితాలో భారత్ అగ్రస్థానంలో ఉంది. జలవినియోగంలో తగు జాగ్రత్తలు, పొదుపు పాటించకపోతే భవిష్యత్తులో పెనుముప్పు పొంచి ఉంది. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి. సగటు నీటి లభ్యత గణనీయంగా తగ్గుతున్నందున సమగ్ర సమాచారంతో జలవనరుల సంరక్షణకు పూనుకుంటేనే భావితరాలకు మంచిది. లేకుంటే ముందు తరాల జీవనం ప్రశ్నార్థకమవుతుంది. నీరు సకల జీవరాశులకు ప్రాణాధారం. ప్రతి నీటి చుక్కను నిల్వ చేసుకుంటూ, వర్షపు నీరు వృథా కాకుండా చూడాలి. చెక్ డ్యామ్ నిర్మించి, భూగర్భ జలాలను పెంచాలి. సహజ సిద్ధ జలవనరులైన సరస్సులు, చెరువులు, నదులు వర్షం నీటితో కలకల్లాడేలా చూసుకోవాలి. వర్షపు నీటిని వృథాగా వదిలితే.. అవి ఉప్పుసముద్రం పాలే అనే సోయితో పాలకులు తక్షణమే తగు చర్యలు తీసుకోండి..

## కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు

పెద్దపల్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది అన్నీ ఆగినయి. నీళ్ళు లేక కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పొలాలు మొత్తం ఎండిపోయాయమని పెద్దపల్లి బీ ఆర్ ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గతేడాది ఈ మండలంలో ఒక్క ఎకరా కూడా ఎండిపోలేదు. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కాంగ్రెస్ 120 రోజుల పాలనలో ప్రజలు విసుగు చెందారు. మళ్ళీ బీ ఆర్ ఎస్ రావాలని ప్రతి గ్రామగ్రామాన కోరుకుంటున్నారు. పెద్దపల్లి కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు స్థానికులు కారు. జూలపల్లి మండలం కుమ్మరి కుంటలో నేను పుట్టాను. బిజెపి కాంగ్రెస్ అభ్యర్థులది పెద్దపల్లి కాదు హైదారాబాద్. వేల కోట్లున్న వివేక్ కుటుంబం పెద్దపల్లి కి చేసింది ఏమి లేదు . వేల కొట్లున్న వివేక్ ఇక్కడ ఒక్క ఫ్యాక్టరీ పెట్టారా. వీకెండ్ నాయకులకు ఓటు వేయవద్దని అన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడు ఆత్మహత్య

సిరిసిల్ల ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తంగళ్ళపల్లి మండలం ఇంద్రనగర్ గ్రామానికి చెందిన అంకారపు మల్లేశం (54) అనే వ్యక్తి అత్మహత్య చేసుకున్నాడు. గత కొద్ది చేనేత వస్త్ర రంగంలో సంక్షోభం ఏర్పడడంతో చేతినిండా ఉపాధి లేక తీవ్ర మనోవేదన చెంది గ్రామ శివారు ప్రాంతంలో చింత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య భారతి, కొడుకు మహేందర్, కూతురు మనిషా ఉన్నారు.

## కృష్ణ జిల్లాలో 237 నామినేషన్లు

మచిలీపట్నం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది.జిల్లాలో మొత్తం 237 నామినేషన్లు దాఖలయ్యాయి.మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 37 నామినేషన్లు దాఖలవ్వగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 200 నామినేషన్లు పడ్డాయి.చివరి రోజైన గురువారం ఒక్క రోజే 95 నామినేషన్లు దాఖలయ్యాయి.ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన జరగనుంది.29 తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఉపసంహరణల అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. జిల్లాలో మొత్తంగా దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే అత్యధికంగా గుడివాడ నియోజకవర్గానికి 40 నామినేషన్లు రాగా అత్యల్పంగా పామర్రు నియోజకవర్గానికి 17 నామినేషన్లు వచ్చాయి. మచిలీపట్నంకు 36, గన్నవరం 34, పెనమలూరుకు 26, పెడనకు 24, అవనిగడ్డకు 23 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార వైసీపీ, కూటమి అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా పోటీలో నిలిచింది.

# జనసేనకు బకెట్ టెన్షన్

కాకినాడ, ఏప్రిల్ 26 ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఒక ఎత్తైతే... పిఠాపురంలో జరిగే ఎన్నికలు మరో ఎత్తు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అక్కడ పోటీ చేస్తుండటంతో ఎక్కడలేని ఉత్కంఠ నెలకొంది. గతంలో రెండు చోట్ల పోటీ చేసి ఓటమి పాలైన పవన్... ఈసారి ఏం చేస్తారో అన్న ఆసక్తి అందరిలో కనిపిస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్ రెండు చోట్ల కూడా ఓటమి పాలయ్యారు. అదే ప్రత్యర్థులకు అస్త్రంగా మారింది. ఆయనే గెలవలేని పరిస్థితుల్లో పార్టీని ఎలా నడుపుతారు... అభ్యర్థులను ఎలా గెలిపించుకుంటారనే విమర్శలు వినిపించాయి. అందుకే ఈసారి కచ్చితంగా విజయం సాధించాలన్న కసితో ఉన్న పవన్ కల్యాణ్... పిఠాపురాన్ని బాటిల్ గ్రౌండ్‌గా ఎంచుకున్నారు. కాపులు అధిక సంఖ్యలో ఉన్న పిఠాపురంలో పోటీ చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తామన్న ధీమాతో పవన్ కల్యాణ్ అక్కడ పోటీకి సిద్ధపడ్డారు. నామినేషన్ కూడా వేశారు. ఆయనపై వైసీపీ తరపున ఎంపీ వంగ గీత పోటీ చేస్తున్నారు. పవన్‌ను ఈసారి కూడా ఓడించి ఆయన్ని మరింత దెబ్బ తీయాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. దీని కోసం ఉన్న అవకాశాలన్నింటినీ వాడుకుంటోంది. అన్ని బలాలను ప్రయోగిస్తోంది. నామినేషన్ల గడువు నేటితో ముగియనుంది. మరి రెండు రోజుల్లో పోటీలో ఉన్న వారి జాబితా కూడా వెలువడనుంది. అయితే ఇప్పటికే నామినేషన్లు వేసిన వారి పేర్లు, వారు ఎంచుకున్న గుర్తులు ఆధారాంగా మోడల్ బ్యాలెట్ వైరల్‌గా మారుతోంది. అది చూసిన జనసైనికులు, నేతలు కాస్త టెన్షన్ పడుతున్నారు.

మూడు పేర్లతో సోషల్ మీడియాలో తిరుగుతున్న ఆ మోడల్ బ్యాలెట్‌లో ఉన్న పేర్లు అన్ని కూడా పవన్ కల్యాణ్‌వే. ఇంటి పేరు కూడా దరిదాపుల్లోనే ఉంది. గుర్తులు కూడా గ్లాస్ గుర్తునే పోలి ఉన్నాయి. ఐదో నెంబర్‌లో ఉన్న కోనేటి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి గుర్తు బకెట్, ఆరో నెంబర్‌లో కొణిదెల పవన్ కల్యాణ్ ఆయనకు కేటాయించిన గుర్తు గ్లాస్, ఏడో నెంబర్‌లో కూడా కనుమూరి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి నామినేషన్ వేసి ఉన్నాడు. ఆయన కూడా ఓ గ్లాస్ గుర్తును పోలి ఉన్న గుర్తునే తీసుకున్నాడు. ఏడో నెంబర్‌లో ఉన్న జనసేన గ్లాస్ గుర్తును మిగిలిన రెండు గుర్తులు డామినేట్ చేస్తున్నాయి. ఇదే ఓటింగ్ సమయంలో అయోమయానికి గురి చేస్తుందని జనసైనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటు వేసేందుకు వెళ్లే ఓటర్లు గ్లాస్ గుర్తు వెతికేందుకు టైం పడుతుందని అలాంటి సమయంలో వేరే గుర్తుపై ఓటు వేసే ఛాన్స్ ఉందంటున్నారు. పూర్తి స్థాయి జాబితా వస్తే దీనిపై ఫిర్యాదు చేయాలని జనసేన భావిస్తోంది. ఇప్పటికే ఈ గుర్తులపై సోషల్ మీడియో జనసైనికులు విరుచుకుపడుతున్నారు అధికార పార్టీ కుట్రల్లో బాగంగా ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఈ గుర్తుల కన్ఫ్యూజన్ ఇప్పటి చాలా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు నష్టపోయాయి. మొన్న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తును పోలి ఉన్న గుర్తులు ఎవరికీ కేటాయించ వద్దని బీఆర్ఎస్ లీడర్లు ఎన్నికల సంఘంతో ఫైట్ చేశారు. ఇదే కాదు... గుర్తు ఒకే కనీసం పేరు చూసైనా ఓటు వేస్తారు అనుకుంటే ఒకటే ఇంటిపేరు... మనిషి పేరుతో ఎక్కువ మందితో ప్రత్యర్థులు ప్రయోగాలు చేస్తుంటారు. దీన్ని కూడా నిలువరించలేని పరిస్థితి ఉంటుంది. అందుకే గుర్తులపై పార్టీలు పోరాటం చేస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో తిరుగుతున్న ఈ పోస్ట్ ఎంత వరకు నిజమో తెలియదు. కానీ జనసైనికుల్లో మాత్రం కాక రాజేస్తోంది.

పవన్ పేరుతో ముగ్గురు

తాజాగా సోషల్ మీడియాలో మరో ప్రచారానికి తెర తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పేరుతో మరికొంతమంది పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. జనసేన అధినేత తో పాటు కోనేటి పవన్ కళ్యాణ్, కనుమూరి పవన్ కళ్యాణ్ అనే వ్యక్తులు నామినేషన్ వేసినట్లు ఓ వార్త వైరల్ అవుతోంది. అయితే అందులో ఎంత మాత్రం నిజం లేదని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఈసీ వెబ్సైట్ ప్రకారం పిఠాపురం బరిలో పవన్ కళ్యాణ్ పేరుతో ఒక్కరే పోటీలో ఉన్నారు. నామినేషన్ గడువు ముగిసే సమయానికి 11 మంది పోటీ చేస్తున్నట్లు తేలింది. కేవలం పవన్ కళ్యాణ్ ను పిఠాపురంలో ఓడించేందుకు జరగని ప్రయత్నం అంటూ లేదు. అయితే దీనిని ముందుగానే పసిగట్టిన జనసేన పార్టీ శ్రేణులను అలెర్ట్ చేసింది. అటువంటి పుకార్లను నమ్మవద్దని పార్టీ శ్రేణులకు అంతర్గతంగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

# కూటమిలో కావలి, ఉండి టెన్షన్

విజయవాడ, ఏప్రిల్ 26 ఏపీ, తెలంగాణలో నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు కావడంతో అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్లు వేశారు. ఇక రేపటినుంచి నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈనెల 29 వరకు నామినేషన్లు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది. కానీ పశ్చిమగోదావరి జిల్లా ఉండి టీడీపీలో రాజకీయ ఉక్కపోత మాత్రం అలాగే కంటిన్యూ అవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో సీన్ మళ్లీ మొదటికొచ్చింది. టీడీపీ అధినేత బుజ్జగించినా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. బరిలో ఉంటానని క్లారిటీ ఇచ్చి మరీ నామినేషన్ వేయడంతో టీడీపీ కేడర్‌లో గుబులు మొదలైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శివరామరాజుకి ముందుగానే సీటు కేటాయించింది అధిష్ఠానం. దీంతో టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే రామరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. అయినప్పటికీ శివరామరాజు నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే రఘురామ కృష్ణం రాజు ఎంట్రీ ఇచ్చారు. చంద్రబాబుతో భేటీ కావడం.. ఉండి టికెట్ ఆయనకు ఖరారు చేయడం చకచకా జరిగిపోయాయి. దీంతో శివరామరాజు డైలమాలో పడిపోయారు. చంద్రబాబు సర్దిచెప్పినా.. రఘురామ కృష్ణంరాజు ప్రాధేయపడ్డా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. ఇవాళ స్వతంత్ర అభ్యర్థిగా భారీ ర్యాలీ మధ్య నామినేషన్ వేశారు. అంతేకాదూ.. విజయంపై ధీమా వ్యక్తం చేశారాయన. శివరామరాజు నామినేషన్‌తో రఘురామ కృష్ణంరాజు ఝలక్ తగిలినట్టయింది. ఎవరేం చేసినా విజయం నాదేనని కాన్ఫిడెంట్‌గా ఉన్నారాయన. ఉండి టిడీపీ టికెట్ ఆశించిన రామరాజు ఇప్పటికే రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. లేటెస్ట్‌గా శివరామరాజు ఇండిపెండెంట్‌గా పోటీలోకొచ్చారు. టీడీపీ తరపున రఘురామకృష్ణంరాజు అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఫైనల్‌గా ఏం జరగబోతుంది? టీడీపీ ఓటు చీలిపోతుందా? గంపగుత్తగా ఒక్కరికే పడుతుందా? ఈ టెన్షన్ ముగ్గురు అభ్యర్థుల్ని కంగారుపెడుతోంది. ప్రస్తుతం ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ వేస్తున్న అభ్యర్థుల నుంచి పార్టీలకు రెబల్స్ బెడత వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా కూటమిలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నేతలు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం నుంచే కాకుండా.. మరోవైపు నెల్లూరు జిల్లా కావలి టికెట్ పొలిటికల్ హీట్ పెంచుతోంది. టీడీపీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డి బరిలో దిగుతుండగా.. కూటమిని నుంచి ఆమెకు సపోర్ట్ కరువయ్యింది. ఆమెకు సీటు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్న బీజేపీ నేత పసుపులేటి సుధాకర్ రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీని వీడి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన.. చంద్రబాబు మోసం చేశారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు జోరుగా ప్రచారం నిర్వహిస్తూ దూకుడు మీదున్నారు. అయితే నామినేషన్ల ప్రక్రియ నేటితో ముగియనుండటంతో రేపటి నంచి వాటిని పరిశీలించనున్నారు అధికారులు. ఏప్రిల్ 29 వరకు నామినేషన్లు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో రెబల్ గా బరిలో దిగిన వారితో మంతనాలు జరుపుతున్నారు నిజమైన అభ్యర్థులు, ఆయా పార్టీల అధినేతలు. ఇది ఎంతవరకు సర్దుమణుగుతుందో వేచి చూడాలి

# అవనిగడ్డ నుంచి బరిలో ఐదుగురు

విజయవాడ, ఏప్రిల్ 26 ఎన్నికల పుణ్యమా అని ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల విశిష్టతలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలోనే అందర్నీ ఆకర్షించింది కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఓ గ్రామం. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు అయినా ఆ గ్రామం ఎంతోమంది నాయకులను ఈ రాష్ట్రానికి అందించింది. ఆ గ్రామమే బందల రాయి చెరువు. చిన్నపాటి గ్రామమే అయినా.. ఈ ఎన్నికల్లో మాత్రం హైలెట్ గా నిలుస్తోంది. నేతల పుట్టినిల్లుగా గుర్తింపు సాధించింది. అవనిగడ్డకు సుదీర్ఘకాలం సింహాద్రి సత్యనారాయణ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మంత్రిగా కూడా వ్యవహరించారు. ఆయన ఈ గ్రామానికి చెందిన వారే కావడం విశేషం. ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు ఇదే గ్రామానికి చెందినవారు. సింహాద్రి సత్యనారాయణ కుమారుడు కూడా. ప్రస్తుతం అవనిగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింహాద్రి రమేష్ బాబుది కూడా ఇదే ఊరు కావడం గమనార్హం. మరోవైపు సింహాద్రి తమన్నా అనే ట్రాన్స్ జెండర్ ఏకంగా పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ పై పోటీ చేస్తున్నారు. తమన్నాది కూడా బందల రాయి చెరువు కావడం గమనార్హం. ఇలా ఆ గ్రామానికి చెందిన ముగ్గురు నేతలు ఎన్నికల్లో పోటీ చేస్తుండడం విశేషం. ఈ గ్రామంతో మంత్రి అంబటి రాంబాబుకు విడదీయరాని బంధం. రాంబాబు అమ్మమ్మ ఊరు కూడా ఇదే. బాల్యంతో పాటు ప్రాథమిక విద్య కూడా రాంబాబు ఆ గ్రామం నుంచే పూర్తి చేశారు. ఇప్పటికీ ఆ గ్రామానికి తరచూ రాంబాబు వెళ్తుంటారు. మరోవైపు అంబటి రాంబాబు తమ్ముడు మురళీకృష్ణ పొన్నూరు నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. అన్నతో పాటు మురళీకృష్ణ సైతం ఈ గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీ ఎన్జీవోల సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించి.. తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్మెల్సీ ని సొంతం చేసుకున్నారు పరుచూరి అశోక్ బాబు. ఆయనది సైతం ఇదే గ్రామం కావడం గమనార్హం. ఇలా ఎలా చూసుకున్నా నేతలను అందించిన గ్రామంగా బందల రాయి చెరువు ప్రత్యేక గుర్తింపు పొందింది.

# రాజీనామా రెడీగా పెట్టుకో

హైదరాబాద్ హరీష్ రావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మోసం చేయాలనుకునే ప్రతీ సారి హరీష్ కు అమరవీరుల స్థూపం గుర్తొస్తది. హరీష్ మోసానికి ముసుగు అమరవీరుల స్థూపం. ఇన్నాళ్లు ఎప్పుడైనా అమరుల స్థూపం దగ్గరకు వెళ్లారా? చాంతాడంత లేఖ రాసుకొచ్చి రాజీనామా లేఖ అంటుండు. రాజీనామా లేఖ అలా ఉండదు. హరీష్ తన మామ చెప్పిన సీస పద్యమంతా లేఖలో రాసుకొచ్చారు. స్పీకర్ ఫార్మాట్ లో లేకుంటే రాజీనామా లేఖ చెల్లదు. హరీష్ రావు తెలివి ప్రదర్శిస్తున్నారు. హరీష్ తెలివి మోకాళ్లలో కాదు.. అరికాళ్లలోకి జారినట్టుంది. హరీష్..ఇప్పటికీ చెబుతున్నా.. నీ సవాల్ ను ఖచ్చితంగా స్వీకరిస్తున్నాం. పంద్రాగస్టులోగా రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం...నీ రాజీనామా రెడీగా పెట్టుకోఅని

# తమ్ముడి కోసం రంగంలోకి అన్నయ్య

విజయవాడ, ఏప్రిల్ 26 న్నయ్య రంగంలోకి దిగుతున్నారు. తమ్ముడి కోసం ప్రచారం చేయాలని డిసైడ్ అయ్యారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ కు మద్దతుగా మెగా కాంపౌండ్ వాల్ హీరోలంతా రంగంలోకి దిగనున్నారు. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. అయితే అందరికంటే చిరంజీవి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని తెలియడంతో మెగా అభిమానుల్లో సందడి నెలకొంది. పొలిటికల్ సర్కిల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. అయితే నాడు ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి అయిన వంగా గీతకు మద్దతుగా చిరంజీవి పిఠాపురంలో ప్రచారం చేశారు. ఆమె ఎమ్మెల్యేగా కూడా గెలిచింది. ఇప్పుడు అదే వంగా గీతకు వ్యతిరేకంగా, పవన్ కు అనుకూలంగా చిరంజీవి ప్రచారానికి రానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కు నిరాశే ఎదురయ్యింది. ఆయన రెండు చోట్ల ఓడిపోయారు. ఈసారి మాత్రం ఆ పరిస్థితి రాకూడదని గట్టిగానే డిసైడ్ అయ్యారు. తనను ఓడించేందుకు వైసిపి ఎంతకైనా తెగిస్తుందన్న అంచనాకు వచ్చారు. అందుకే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అశేష జనవాహిని నడుమ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే పవన్ కు మద్దతుగా బుల్లితెర నటులు ప్రచారం చేస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లు రంగంలోకి దిగారు. ఇప్పుడు మెగా హీరోలంతా వస్తుండడంతో పిఠాపురంలో వార్ వన్ సైడ్ అవుతుందని జనసైనికులు భావిస్తున్నారు. కొద్దిరోజుల కిందట చిరంజీవి జనసేనకు ఐదు కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. పవన్ కళ్యాణ్ కు అందజేశారు. జనసేనకు ఓటు వేయాలని మెగా అభిమానులకు స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. అయితే అనకాపల్లి నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్, పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్ బాబు చిరంజీవిని కలిశారు. మద్దతు కోరారు. వారిని ఆశీర్వదించిన చిరంజీవి కూ టమి అభ్యర్థులను గెలిపించాలని ఒక వీడియో బయటకు విడుదల చేశారు. దీనిపై వైసీపీ నేతలు ఎంత రచ్చ చేయాలో.. అంతలా చేశారు. పిఠాపురం నియోజకవర్గానికి, మెగా కుటుంబానికి మంచి సంబంధం ఉంది. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి వంగా గీత పోటీ చేశారు. నాడు ఆమె కోసం చిరంజీవి ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో గీత విజయం సాధించారు. ఇప్పుడు అదే నియోజకవర్గాన్ని పవన్ ఎంచుకున్నారు. వంగా గీత ఇప్పుడు ప్రత్యర్థిగా మారారు. ఇప్పుడు పవన్ కు మద్దతుగా చిరంజీవి ప్రచారం చేయనున్నారు. మే 5 ఇందుకు ముహూర్తం గా నిర్ణయించారు. చిరంజీవితో పాటు మెగా హీరో రామ్ చరణ్ వస్తున్నట్లు తెలుస్తోంది. బాబాయ్ కోసం ఈ కుర్ర హీరో రంగంలో దిగనున్నట్లు సమాచారం.

చిరంజీవితో పాటు నాగబాబు, రామ్ చరణ్ కలిసి పిఠాపురంలో భారీ రోడ్ షో నిర్వహిస్తారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత రాజకీయ వేదికలపైకి చిరంజీవి వస్తుండడంతో మెగా ఫాన్స్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఎదురుచూస్తున్నారు. సమకాలీన రాజకీయ అంశాలపై మాట్లాడతారా? మాట్లాడితే జగన్ పై ఎటువంటి కామెంట్స్ చేస్తారు? చంద్రబాబు గురించి ఏమైనా వ్యాఖ్యానిస్తారా? లేకుంటే పవన్ ను గెలిపించాలని మాత్రమే అడుగుతారా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.

# ఉత్తరాంధ్ర ఎవరి పక్షం

విశాఖపట్టణం, ఏప్రిల్ 26 ఉత్తరాంధ్ర పై అన్ని పార్టీలు కన్నేశాయి. మెజారిటీ సీట్లు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా చంద్రబాబుతో పాటు జగన్ ఉత్తరాంధ్ర పైనే ఫోకస్ పెట్టారు. చంద్రబాబు ప్రజాగళం పేరిట సభలు నిర్వహిస్తుండగా.. జగన్ బస్సు యాత్రలో భాగంగా అన్ని నియోజకవర్గాలను టచ్ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో పాటు పవన్ పాల్గొన్నారు. ఉత్తరాంధ్రలో 34 నియోజకవర్గాల్లో మెజారిటీ సీట్లను దక్కించుకునేందుకు అధికార విపక్షాలు ప్రయత్నించడం విశేషం. అందుకోసమే అటు చంద్రబాబుతో పాటు ఇటు జగన్ ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఉత్తరాంధ్ర ఆ పార్టీని ఆదరిస్తూ వచ్చింది. ఒకవేళ రాష్ట్రంలో అధికారంలోకి రాకపోయినప్పటికీ.. ఉత్తరాంధ్రలో మాత్రం టిడిపి తన ప్రాబల్యాన్ని నిలుపుకునేది. కానీ గత ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర ఓటమి చవిచూసింది. 34 నియోజకవర్గాలకు గాను.. కేవలం ఆరు చోట్ల మాత్రమే గెలుపొందింది. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో రెండు స్థానాలతో సరిపుచ్చుకుంది. విజయనగరంలో వైసిపి వైట్ వాష్ చేసింది. అందుకే ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. పొత్తుల్లో భాగంగా జనసేనకు నాలుగు అసెంబ్లీ సీట్లను, బిజెపికి రెండు స్థానాలను కేటాయించారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఈనెల 22 నుంచి ఏకంగా నాలుగు రోజులపాటు ఉత్తరాంధ్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు చంద్రబాబు. మరోవైపు పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపు విషయంలో తలెత్తిన అసంతృప్తులను చల్లార్చే ప్రయత్నం చేశారు. అందులో కొంత వరకు సక్సెస్ అయ్యారు. జగన్ తన బస్సు యాత్రను ఉత్తరాంధ్రలో ముగించారు. రాష్ట్రవ్యాప్తంగా మేమంతా సిద్ధం పేరిట నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర.. ఉత్తరాంధ్రలో అడుగుపెట్టేసరికి రూపు మార్చింది. ప్రధానంగా ఉత్తరాంధ్ర వెనుకబాటు, రాజధాని అంశాన్ని ప్రస్తావిస్తూ జగన్ ప్రజలను చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఉత్తరాంధ్రలో 28 స్థానాలు దక్కాయి. ఈసారి కూడా మెజారిటీ స్థానాలు దక్కించుకోవాలన్న ప్రయత్నంలో జగన్ ఉన్నారు. అందుకే ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలతో పాటు అధికారంలోకి వస్తే తామేం చేయగలమో.. చెప్పుకొస్తున్నారు. విపక్షాల ట్రాప్ లో పడొద్దని ప్రజలకు పిలుపునిస్తున్నారు. మరోవైపు ఎక్కడైతే పార్టీ వెనుకబడి ఉందో అక్కడ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నేతల మధ్య విభేదాలకు ఫుల్ స్టాప్ పెట్టేలా పావులు కదిపారు. 34 నియోజకవర్గాల్లో ఫైట్ నడుస్తోంది. విశాఖ జిల్లాలో కూటమికి అనుకూల పరిస్థితులు కల్పిస్తుండగా.. విజయనగరంలో వైసీపీ ఆశాజనకంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలో అయితే నువ్వా నేనా అన్న పరిస్థితి ఉంది.

జనసేన గెలుపోటములను ప్రభావితం చేయనుంది. గత ఎన్నికల్లో దాదాపు మత్స్యకార ప్రాంతాల్లో జనసేనకు గణనీయంగా ఓట్లు పడ్డాయి. అక్కడ వైసీపీకి గెలుపునకు కారణమయ్యాయి. అందుకేఈసారి జనసేన ఓటు బ్యాంకు కలిసి వస్తుందని టిడిపి అంచనా వేస్తోంది. సంక్షేమ పథకాలే తమకు కలిసి వస్తాయని వైసిపి నమ్మకంగా ఉంది. మరి ఎవరు సక్సెస్ అవుతారో చూడాలి.

# ఓ వైపు కేసులు... మరో వైపు బదిలీలు

విజయవాడ, ఏప్రిల్ 26 ఏపీలో అధికార వైసీపీని ఎలక్షన్ కమిషన్ టార్గెట్ చేసుకుందా? అధికారుల బదిలీలు అందులో భాగమేనా? కీలక అధికారులను లూప్ హోల్స్ లో పెట్టడం అందుకేనా? ఇప్పుడు వైసీపీ అభ్యర్థులపై పడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి ప్రధాన కారణం ఎన్నికల నిర్వహణ. ఇప్పటికే నాలుగో విడత పోలింగ్ ఏపీలో జరగడం వెనుక చంద్రబాబు పాత్ర ఉందని ప్రచారం జరుగుతుంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అధికారుల బదిలీలు, అధికార వైసిపి అభ్యర్థులపై ఎన్నికల కోడ్ కేసులు నమోదవుతుండడం విశేషం. కొద్దిరోజుల కిందట చాలామంది అధికారులను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే అవన్నీ తెలుగుదేశం పార్టీ చేసిన ఒత్తిడితోనే చేసినవన్న ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఇంటలిజెన్స్ చీఫ్ తో పాటు విజయవాడ పోలీస్ కమిషనర్ పై బదిలీ వేటు పడింది. ఈ ఇద్దరు వైసీపీకి అనుకూలమైన అధికారులేనన్న ఆరోపణలు ఉన్నాయి. వీరికి ఎన్నికలతో సంబంధం లేని విధులకు బదిలీ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు డిజిపి పై కూడా వేటు తప్పదన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థుల విషయంలో సైతం యంత్రాంగం వాయిస్ మారుతోంది. ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే.. వైసిపి వారికే నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కు ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. ఈసీ ఆదేశాలతో ఆయనపై కేసు నమోదయింది. ఈనెల 13న ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి ఆయన ధర్నా చేశారు. దీనిపై టిడిపి ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేయడంతో ఈసీ స్పందించింది. నివేదిక ఇవ్వాల్సిందిగా గుంటూరు కలెక్టర్ ను ఆదేశించింది. కలెక్టర్ ఇచ్చిన నివేదికతో ఎలక్షన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తక్షణం ఆయన పై కేసు నమోదు చేయాలని పోలీసులకు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే పోలింగ్ సమీపిస్తున్న కొలది ఒకవైపు అధికారులపై వేటు, మరోవైపు వైసీపీ అభ్యర్థులపై కేసులు చూస్తుంటే.. ముస్ముందు పరిస్థితులు మరింత తీవ్రతరం కానున్నట్లు తెలుస్తోంది.

## అంతు పట్టని కిరణ్ వ్యూహం...

తిరుపతి, ఏప్రిల్ 26 మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ధైర్యం ఏంటి? రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి ఆయన గట్టెక్కగలరా? ఆయన ఏరి కోరి అక్కడే బరిలో దిగారు ఎందుకు? తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేస్తున్నారా? లేకుంటే చిరకాల ప్రత్యర్థిని మట్టి కరిపించాలని చూస్తున్నారా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఉమ్మడి రాష్ట్రానికి మూడు సంవత్సరాల సీఎం గా పని చేసిన నేత.. ఇప్పుడు ఎంపీగా బరిలో దిగడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావాలనుకుంటున్నారా? లేకుంటే పెద్దిరెడ్డి ఆధిపత్యానికి గండి కొట్టాలని చూస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంది. చిత్తూరు జిల్లాలో నల్లారి అమర్నాథ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి రాజకీయంగా విభేదాలు ఉన్నాయి. ఈ రెండు కుటుంబాలు పీలేరు కేంద్రంగా చేసుకొని రాజకీయాలు నడిపాయి. ఈ రెండు కుటుంబాలు ఒకే పార్టీలో ఉన్నా.. వీరికి అస్సలు పడేది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో అనూహ్యంగా కిరణ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కింది. వైసీపీలో చేరిన పెద్దిరెడ్డి కుటుంబం రాయలసీమలో పట్టు బిగించింది. పెద్దిరెడ్డి సోదరుడు, కుమారుడు చట్టసభలకు హాజరయ్యారు. అటు జగన్ సైతం ఫుల్ పవర్స్ ఇచ్చి పెద్దిరెడ్డిని శక్తివంతుడిగా తీర్చిదిద్దారు. రాష్ట్ర విభజన తరువాత కిరణ్ కుమార్ రెడ్డి కొద్దిరోజులపాటు రాజకీయాలకు దూరమయ్యారు. బిజెపిలో చేరి ఇప్పుడు రాజంపేట అభ్యర్థిగా మారారు. అయితే రాజంపేట సీటును తీసుకోవడం వెనుక వ్యూహం ఏమిటన్నది తెలియాల్సి ఉంది. నాలుగు దశాబ్దాల రాజంపేట పార్లమెంట్ స్థానం చరిత్రను గమనిస్తే.. 13 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో తొమ్మిది సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. గత రెండు ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మిథున్ రెడ్డి గెలుపు పొందుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రం 1999లో మాత్రమే గెలిచింది. పొత్తులో భాగంగా అటువంటి సీటును కిరణ్ కుమార్ రెడ్డి తీసుకోవడం సాహసమనే చెప్పాలి. రాజంపేట పార్లమెంట్ స్థానం పరిధిలో పుంగనూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఈ ఏడింట వైసిపి స్వీప్ చేసింది. ఎంపీ స్థానంలో అయితే మిథున్ రెడ్డి 2.70 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అటువంటి నియోజకవర్గంలో కిరణ్ కుమార్ రెడ్డి ఏ ధైర్యంతో పోటీ చేస్తున్నారో తెలియడం లేదు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఈ నియోజకవర్గాలకు కిరణ్ పెద్ద ఎత్తున నిధులు సమకూర్చారు. పైగా వైసీపీలో ఉన్న కీలక నేతలంతా.. అప్పట్లో కిరణ్ కుమార్ రెడ్డి అనుచరులే. ప్రస్తుతం ఈ జిల్లాతో పాటు రాయలసీమను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాసిస్తున్నారు. అది మింగుడు పడని చాలామంది నాయకులు కిరణ్ కు సహకారం అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ కిరణ్ గెలిస్తే మాత్రం కేంద్రంలో మంత్రి పదవి ఖాయంగా తెలుస్తోంది. ఆ ఒప్పందంతోనే కిరణ్ రాజంపేట నుంచి పోటీ చేస్తున్నట్లు సమాచారం.

# జగన్ కోసం రంగంలోకి భారతి

కడప, ఏప్రిల్ 26 వైసీపీకి ఇప్పుడు జగన్ ఒక్కరే స్టార్ క్యాంపెయినర్. గత ఎన్నికల మాదిరిగా సినీ నటులు లేరు. కుటుంబ సభ్యులు అంతకంటే కనిపించడం లేదు. అందుకే జగన్ ఇప్పుడు ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఒక్కరే ప్రచార బాధ్యతలను చూస్తున్నారు. జగన్ కు అంతకుమించి అవకాశం కూడా కనిపించడం లేదని తెలుస్తోంది. ఈ ఎన్నికలు గతం కంటే భిన్నం. గత ఎన్నికలకు ముందు దాదాపు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు జగన్. కానీ ఈసారి అటువంటి యాత్రలకు అవకాశం లేదు. పోనీ తన తరుపున చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మ కూడా ఇప్పుడు లేరు. అందుకే ఈసారి జగన్ బలమైన నిర్ణయానికి వచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా జగన్ పర్యటనలు చేయాల్సి ఉండడంతో.. పులివెందుల బాధ్యతను సతీమణి వైయస్ భారతికి అప్పగించాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈరోజు పులివెందులలో జగన్ ప్రచారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కార్యక్రమానికి హాజరైన భారతి వారం రోజుల పాటు పులివెందులలో ఉండి ప్రచారం చేయనున్నారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య అంశాన్ని ప్రస్తావిస్తూ షర్మిల తో పాటు సునీత ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి సమయంలో పులివెందుల ప్రచార బాధ్యతలు తీసుకుంటున్న భారతి ఎలా రిప్లై ఇస్తారో చూడాలి. అయితే ఆమె పార్టీ శ్రేణులతో సమన్వయానికే పరిమితం అవుతారన్న టాక్ కూడా ఉంది.గత ఎన్నికల్లో భారతి ప్రచారం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా పారిశ్రామికవేత్తగా కూడా రాణిస్తున్నారు. సొంత మీడియా బాధ్యతలను ఆమె చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆమె తాడేపల్లి లోనే ఉంటూ జగన్ బాగోగులు చూసుకుంటున్నారు. పులివెందులలో ఇప్పటికే జగన్ తరుపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈరోజు జగన్ నామినేషన్ దాఖలు చేయడంతో పాటు సభలో పాల్గొనడం ద్వారా మలి విడత ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు అయింది. మరోవైపు జగన్ సతీమణి భారతి పులివెందులలో వారం రోజులు పాటు ఇంటింటా ప్రచారం చేయనున్నారు. కాగా పులివెందుల సభలో జగన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ వేలెత్తి చూపించే కార్యక్రమం చేస్తున్నారని జగన్ గుర్తు చేశారు. అది నిజమేనని.. మంచి చేయడం మన కల్చర్.. మంచి మనసు మన కల్చర్.. మాట తప్పకపోవడం మన కల్చర్.. బెదిరింపులకు లొంగక పోవడం మన కల్చర్ అంటూ జగన్ చెప్పుకొచ్చారు. పులివెందులను ఈ రాష్ట్రం పువ్వుల్లో పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఒక వైయస్సార్, ఒక జగన్ ను ఈ రాష్ట్ర ప్రజానీకం అభిమానించిన విషయాన్ని ప్రస్తావించారు.జగన్ తన సోదరి షర్మిలకు ఇచ్చి పడేశారు. ఆమె పేరు ప్రస్తావించకుండానే విమర్శనాస్త్రాలు సంధించారు. రాజశేఖర్ రెడ్డి మీద కుట్రలు, కుతంత్రాలు చేసిన.. ఆయన శత్రువులతో పసుపు చీర కట్టుకొని.. వారి ఇళ్లకు వెళ్లి.. వారికి మోకరిల్లి.. వారి కుట్రలో భాగమై.. వారి స్క్రిప్టులను చదివి వినిపిస్తున్న వీరా వైయస్సార్ అభిమానులు అంటూ షర్మిలపై తీవ్రస్థాయిలో జగన్ విరుచుకుపడ్డారు. పనిలో పనిగా బాబాయ్ వివేక హత్య కేసు గురించి కూడా ప్రస్తావించారు. వివేకాకు రెండో వివాహం, సంతానం ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎవరు ఫోన్ చేస్తే అవినాష్ వెళ్ళాడో గుర్తించాలన్నారు.

వైయస్సార్ ఎవరి మీద పోరాటం చేశారో.. వారితోనే తన చెల్లెళ్లు చేతులు కలిపారని.. అవినాష్ రెడ్డి చిన్నపిల్లాడు అని జగన్ వెనుకేసుకు రావడం విశేషం.జగన్కు మద్దతుగా గత ఎన్నికల్లో పులివెందులలో భారతీ ఇంటింటా ప్రచారం చేశారు. అప్పట్లో ప్రజలను ఆకట్టుకోవడంలో భారతి సక్సెస్ అయ్యారు. అందుకే ఈసారి రాష్ట్రవ్యాప్తంగా భారతితో పర్యటనలు చేయించాలని జగన్ భావించారు. కానీ ఇప్పుడు కడపలో సొంత కుటుంబ సభ్యులే తనకు వ్యతిరేకంగా మారడంతో.. భారతిని అక్కడే ప్రయోగిస్తే మేలన్న నిర్ణయానికి వచ్చారు. అందుకే వారం రోజులపాటు భారతి పులివెందులలో పార్టీ శ్రేణులతో ప్రచారం చేస్తారు. పార్టీని సమన్వయం చేసుకుంటారని పార్టీ వర్గాలు చేస్తున్నాయి. అయితే షర్మిల, సునీతలపై విరుచుకు పడతారా? కేవలం ఇంటింటా ప్రచారానికి పరిమితం అవుతారా? అన్నది చూడాలి

# వారసత్వ దుమారం....

వారసత్వ పన్ను విధానం.. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న దీనిని తాము అధికారంలోకి వస్తే భారత్‌లో అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకుడు, ఆ పార్టీ ఇండియన్ ఓవర్‌సీస్ చైర్మన్, సోనియాగాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. అధికార బీజేపీకి కాంగ్రెస్ పార్టీ కొత్త అస్త్రం ఇచ్చినట్లయింది. అయితే దీనిపై శామ్ పిట్రోడాతోపాటు పలువురు సీనియర్లు వివరణ ఇస్తున్నా.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది.అమెరికాలో వారసత్వ పన్ను చట్టం అమలులో ఉంది. దీని ప్రకారం.. ఆ దేశంలో ఎవరైనా 100 మిలియన్ డాలర్ల ఆస్తి సంపాదిస్తే.. అతడి మరణానంతరం ఆ ఆస్తిలో 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. 45 శాతం మాత్రమే అతడి వారసులకు చెందుతుంది. ఇది చాలా ఆసక్తికరమైన చట్టం. సంపాదించిన ఆస్తిలో సగానికిపైగా సమాజం కోసం వదులుకోవాలని ఈ చట్టం చెబుతుంది. సంపాదించిన వ్యక్తికే ఈ ఆస్తి మొత్తం చెందదు. అయితే ఇది అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలవుతోంది.ఈ చట్టం తనకు బాగా నచ్చిందని శ్యామ్ పిట్రోడా అన్నారు. ఏప్రిల్ 23న ఆయన ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు రెండో దశ ఓటింగ్‌కు ముందు ఆస్తి పంపిణీపై రాజకీయ గందరగోళం మధ్య, వారసత్వ పన్నుపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా చేసిన ప్రకటనపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఆయన ప్రకటనపై భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టగా, శామ్ పిట్రోడా ప్రకటనకు కాంగ్రెస్ దూరంగా ఉంది.అమెరికాలో, వారసత్వపు పన్ను చట్టం ఉంది. ఎవరైనా 100 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను కలిగి ఉంటే, అతను చనిపోయినప్పుడు అతని పిల్లలకు 45% మాత్రమే బదిలీ అవుతాయి. ప్రభుత్వం మిగిలిన 55% తీసుకుంటుంది. ఇది ఆసక్తికరమైన చట్టమని సామ్ పిట్రోడా పేర్కొన్నారు. మీరు సంపదను సృష్టించారు, మీ సంపదను ప్రజలకు వదిలివేయాలి, మొత్తం కాదు, సగం, ఇది సముచితమని భావిస్తున్నానని, దానిని పేదలకు పంచుతామని శామ్ పిట్రోడా చెప్పారు."భారతదేశంలో ఆ పరిస్థితి లేదని, ఒకరి సంపద రూ. 10 బిలియన్లు, అతను చనిపోతే, అతని పిల్లలకు రూ. 10 బిలియన్లు చెందుతుందని, ప్రజలకు ఏమీ లభించదు. కాబట్టి దీనిపై దేశవ్యాప్తంగా ప్రజలు చర్చించుకోవాల్సిన అవసరముందన్నారు శామ్ పిట్రోడా. సంపద పునర్విభజనపై కొత్త విధానాలు తీసుకురావల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. సంపద కేవలం ధనవంతుల ప్రయోజనాల కోసం మాత్రమే కాదన్నారు.తాను చేసిన ప్రకటనను సామ్ పిట్రోడా సోషల్ మీడియా వేదికగా సమర్థించకున్నారు.

తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రాశారు. "వాస్తవాలను మాత్రమే ప్రస్తావించానని, వాటి గురించి ప్రజలు చర్చించుకోవాల్సిన అంశాలని చెప్పాను. దీనికి కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ విధానానికి సంబంధం లేదు. 55% తీసేస్తామని ఎవరు చెప్పలేదన్నారు. భారతదేశంలో ఇలాంటివి జరగాలని ఎవరు చెప్పారు? బీజేపీ ఎందుకు భయపడుతున్నాయి? అంటూ శామ్ పిట్రోడా ప్రశ్నించారు.శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. శామ్ పిట్రోడా ప్రకటనపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్, "సామ్ పిట్రోడా సహా ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి గురువు, స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు శామ్ పిట్రోడా. భారతదేశ అభివృద్ధికి ఆయన అసంఖ్యాకమైన, శాశ్వతమైన కృషి చేశారు. అతను ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు. పిట్రోడా తాను బలంగా భావించే సమస్యలపై బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తాడు. ఖచ్చితంగా, ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి తన వ్యక్తిగత అభిప్రాయాలను చర్చించడానికి, వ్యక్తీకరించడానికి, చర్చించడానికి స్వేచ్ఛ ఉంది. పిట్రోడా అభిప్రాయాలు ఎల్లప్పుడూ భారత జాతీయ కాంగ్రెస్ స్థితిని ప్రతిబింబిస్తాయని దీని అర్థం కాదన్నారు జైరాం రమేష్. ప్రస్తుతం తన వ్యాఖ్యలను రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారం నుండి దృష్టిని మరల్చడానికి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రమాదకర ఉద్దేశాలు ఒకదాని తర్వాత ఒకటిగా తెరపైకి వస్తున్నాయన్నారు.

మధ్యతరగతి ప్రజలపై మరిన్ని పన్నులు విధించాలని రాజకుటుంబానికి చెందిన యువరాజు సలహాదారు కొంతకాలం క్రితం చెప్పారు. ఇప్పుడు ఈ వ్యక్తులు మరో అడుగు ముందుకేశారు.

ఇప్పుడు వారసత్వపు పన్ను విధిస్తామని, తల్లిదండ్రుల నుంచి వచ్చే వారసత్వంపై కూడా పన్ను విధిస్తామని కాంగ్రెస్ చెబుతోందని విమర్శించారు.గత పదేళ్లలో దేశంలో ఆర్థిక అంతరాలు భారీగా పెరిగాయని చెప్పారు. సందప పంపిణీ అంటే ఒకరి ఆస్తులు లాక్కొని మరొకరికి ఇవ్వడం కాదు. సంపద కేంద్రీకరణ జరుగకుండా పంచడం.

అంటే ఏకస్వామ్యాన్ని నిరోధించడం అని వివరించారు. మన దేశంలో కనీస వేతనాలు దక్కడం లేదని తెలిపారు. వారసత్వం పన్ను అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు..

# అంతు పట్టని కిరణ్ వ్యూహం...

తిరుపతి, ఏప్రిల్ 26 మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ధైర్యం ఏంటి? రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి ఆయన గట్టెక్కగలరా? ఆయన ఏరి కోరి అక్కడే బరిలో దిగారు ఎందుకు? తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేస్తున్నారా? లేకుంటే చిరకాల ప్రత్యర్థిని మట్టి కరిపించాలని చూస్తున్నారా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఉమ్మడి రాష్ట్రానికి మూడు సంవత్సరాల సీఎం గా పని చేసిన నేత.. ఇప్పుడు ఎంపీగా బరిలో దిగడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావాలనుకుంటున్నారా? లేకుంటే పెద్దిరెడ్డి ఆధిపత్యానికి గండి కొట్టాలని చూస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంది.చిత్తూరు జిల్లాలో నల్లారి అమర్నాథ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి రాజకీయంగా విభేదాలు ఉన్నాయి. ఈ రెండు కుటుంబాలు పీలేరు కేంద్రంగా చేసుకొని రాజకీయాలు నడిపాయి. ఈ రెండు కుటుంబాలు ఒకే పార్టీలో ఉన్నా.. వీరికి అస్సలు పడేది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో అనూహ్యంగా కిరణ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కింది. వైసీపీలో చేరిన పెద్దిరెడ్డి కుటుంబం రాయలసీమలో పట్టు బిగించింది. పెద్దిరెడ్డి సోదరుడు, కుమారుడు చట్టసభలకు హాజరయ్యారు. అటు జగన్ సైతం ఫుల్ పవర్స్ ఇచ్చి పెద్దిరెడ్డిని శక్తివంతుడిగా తీర్చిదిద్దారు.రాష్ట్ర విభజన తరువాత కిరణ్ కుమార్ రెడ్డి కొద్దిరోజులపాటు రాజకీయాలకు దూరమయ్యారు. బిజెపిలో చేరి ఇప్పుడు రాజంపేట అభ్యర్థిగా మారారు. అయితే రాజంపేట సీటును తీసుకోవడం వెనుక వ్యూహం ఏమిటన్నది తెలియాల్సి ఉంది. నాలుగు దశాబ్దాల రాజంపేట పార్లమెంట్ స్థానం చరిత్రను గమనిస్తే.. 13 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో తొమ్మిది సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. గత రెండు ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మిథున్ రెడ్డి గెలుపు పొందుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రం 1999లో మాత్రమే గెలిచింది. పొత్తులో భాగంగా అటువంటి సీటును కిరణ్ కుమార్ రెడ్డి తీసుకోవడం సాహసమనే చెప్పాలి.రాజంపేట పార్లమెంట్ స్థానం పరిధిలో పుంగనూరు, పీలేరు, మదనపల్లి,తంబళ్లపల్లి, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఈ ఏడింట వైసిపి స్వీప్ చేసింది. ఎంపీ స్థానంలో అయితే మిథున్ రెడ్డి 2.70 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అటువంటి నియోజకవర్గంలో కిరణ్ కుమార్ రెడ్డి ఏ ధైర్యంతో పోటీ చేస్తున్నారో తెలియడం లేదు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఈ నియోజకవర్గాలకు కిరణ్ పెద్ద ఎత్తున నిధులు సమకూర్చారు.

# జూన్ 2 తర్వాత ఏపీ నాన్ లోకల్

విజయవాడ, ఏప్రిల్ 26 ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో విద్యా సంస్థల్లో ఉమ్మడి ప్రవేశాల గడువు ముగియనుండటంతో తెలంగాణ విద్యా శాఖ అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పదేళ్ల పాటు రెండు రాష్ట్రాల విద్యా సంస్థల్లో ఉమ్మడి ప్రవేశాలకు వీలు కల్పించిన నిబంధన గడువు జూన్ 2తో ముగియనుంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తి కానుండటంతో విభజన చట్టంలోని నిబంధనల చెల్లుబాటు కూడా ముగియనుంది.౦ఖ ఏపీ స్థానికత కలిగిన విద్యార్థులకు తెలంగాణ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఈ ఏడాదే చివరి అవకాశం కానుంది. ఇకపై ఏపీ విద్యార్థులు నాన్ లోకల్ కోటాలోనే ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది.తెలంగాణలో వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం అయా యూనివర్శిటీలు, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఏటా కామన్ ఎంట్రన్స్ పరీక్షల్ని నిర్వహిస్తుంటాయి. ఈఏపీ సెట్(గతంలో ఎంసెట్), ఐసెట్, లాసెట్, ఎడ్ సెట్ వంటి పరీక్షలతో పాటు పీజీ ఎంట్రన్స్‌లను ఆయా వర్శిటీలు నిర్వహించేవి. ఈ విద్యా సంస్థల్లో తెలంగాణ విద్యార్థులతో పాటు గత పదేళ్లుగా ఏపీ విద్యార్థులకు కూడా ప్రవేశాలు దక్కాయి.రాష్ట్ర విభజన గడువు ముగియనుండటంతో ఈ ఏడాది జూన్2లోపు జరిగే ప్రవేశ పరీక్షలకు మాత్రమే రిజర్వేషన్లు వర్తింప చేయనున్నట్టు తెలంగాణ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం స్పష్టత ఇచ్చారు. ఏపీ విభజన చట్టం ప్రకారం విద్యా సంస్థల్లో ఉమ్మడి ప్రవేశాల నిబంధనకు గడువు 2024 జూన్2తో ముగిసిపోతుంది.ఇకపై తెలంగాణ విద్యా సంస్థల్లో ఉన్న సీట్లు మొత్తం తెలంగాణ స్థానికత కలిగిన వారికే అందుబాటులోకి వస్తాయి. ఏపీ విద్యార్థులు తెలంగాణ ప్రవేశ పరీక్షలు రాసినా నాన్ లోకల్ క్యాటగిరీలో మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ విద్యా సంస్థల్లో ఎలాంటి రిజర్వేషన్లు వర్తించవని విద్యాశాఖ కార్యదర్శి స్పష్టత ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు రిజర్వేషన్లు వర్తించవని గతంలోనే తెలంగాణ ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. ఆ తర్వాత ఏపీ కూడా అదే బాటలో కొత్త మెడికల్ కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తూ జీవో జారీ చేసింది.తెలంగాణ రాష్ట్రంతో ఏపీకి ఉన్న బంధం జూన్ 2 తర్వాత శాశ్వతంగా ముగియనుంది. ఇకపై దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరే ఏపీ స్థానికత కలిగిన వారు కూడా తెలంగాణలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. వారికి ప్రత్యేకంగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు, రిజర్వేషన్లు వర్తించవు.

## వాటి సంగతి

# హామీలపై ఫ్యాన్ లో ఉక్కపోత

విజయవాడ, ఏప్రిల్ 26, ధికార పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలపై ప్రజల్లో పెద్దగా ఆసక్తి ఉండదు. దానికి కారణం అప్పటికే వారు ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయకుండా విశ్వాసం కోల్పోయి ఉంటారు. రాజకీయ పార్టీలు వందల హామీలు ఇస్తూ ఉంటాయి. అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎవరు ఏమి అడిగినా అది సాధ్యమా కాదా అని ఆలోచించకుండా అధికారంలోకి రాగానే చేస్తామంటాయి. చాలా వరకూ మేనిఫెస్టోల్లో పెడతాయి. అందుకే తదుపరి ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి అనేక పార్టీలు కొత్త హామీల విషయంలో అంత చురుకుగా ఉండలేవు. ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ పరిస్థితి కూడా అంతే. నామినేషన్ల గడువు ముగిసినా ఇంకా మేనిఫెస్టో ప్రకటించలేదు. ఇప్పుడు మేనిపెస్టో ప్రకటిస్తే.. అమలులో ఉన్న మేనిఫెస్టోలో అమలు చేయని వాటి సంగతి చెప్పాలన్నడిమాండ్లు వస్తాయి. ప్రజాబాహుళ్యంలో జగన్ హామీలు ఇచ్చి.. మేనిపెస్టోలో పెట్టిన అనేక అంశాలు అమలు కాలేదు. వాటిపై ఇప్పుడు చర్చ జరగడం ఖాయంగా కనిపిస్తోంది. జగన్మోహన్ రెడ్డి తనకు మనిఫెస్టో అంటే బైబిల్, ఖురాన్, భగవద్గీత అని చెబుతారు. " కాపురాల్లో మద్యం చిచ్చు పెడుతోంది. మానవ సంబంధాలు ధ్వంసమై పోతున్నాయి. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత మూడుదశల్లో మద్యాన్ని నిషేధిస్తాం. మద్యాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తాం," అని మేనిఫెస్టోలో ఉంది. అంతకు ముందు జగన్ రెడ్డి మద్య నిషేధంపై చేసిన ప్రసంగాలు చూసిన ఎరికైనా.. చేసేస్తాడని అనుకునేవారు. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాక మద్య పాన నిషేధం అంచెలంచెలగా అంటూ ఏవో జీవో లు జారీ చేశారు. కానీ పాలసీ మార్చి.. దుకాణాలన్నీ చేతుల్లోకి తీసుకున్నారు. ఏటా ఇరవై శాతం దుకాణాలు తగ్గిస్తామన్నారు. మద్య నిషేధం చేసిన తర్వాతనే ఓట్లు అడుగుతామని సవాల్ చేశారు. సీఎం జగన్ అదే మాట అన్నారు. మహిళా నేతలతోనూ చెప్పించారు. కానీ ఇప్పుడు మద్య నిషేధం గురించి మాట్లాడటం లేదు. మళ్లీ ఎన్నికలకు వెళ్లే ముందు ఈ మద్యనిషేధం హామీని ఎగ్గొట్టడంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండున్నర లక్షలకుపైగా ఖాళీగా ఉన్నాయని తాను రాగానే ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. చంద్రబాబు హయాంలో మూడు డీఎస్సీలు వేస్తే కొద్ది పోస్టులే భర్తీ చేస్తున్నారని.. తాను రాగానే మెగా డీఎస్సీ అన్నారు. ఐదేళ్లలో ఒక్క సారి కూడా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయలేదు. ఉద్యోగాల భర్తీ ఊసే లేదు. టీచర్ల పోస్టుల భర్తీ విషయంలో అసలు ఎలాంటి ఆలోచన చేయలేదు. ఎన్నికలకు ముందు డీఎస్సీ వేశారు కానీ నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వడంతో కోర్టు కేసులతో ఆగిపోయింది. నిరుద్యోగుల పరీక్ష ఫీజు ప్రభుత్వం వద్ద ఉండిపోయింది. దీనికి నిరుద్యోగ యువతకు ఏం సమాధానం ఇస్తారు ? అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు " అని జగన్ ప్రకటించారు. మేనిపెస్టోలోనూ పెట్టారు. కానీ సీపీఎస్ రద్దుపై జగన్ రెడ్డికి అవగాహన లేక హామీ ఇచ్చారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇది జగన్మోహన్ రెడ్డి ఇమేజ్ ను దెబ్బతీసింది. ఇచ్చిన హామీలు అమల చేయకోపతే రాజీనామా చేసి పోవాలనే మంచి రాజకీయ సంస్కృతి రావాలని ఆయన రాజకీయ ప్రసంగాల్లో చెప్పేవారు. ఇప్పుడు అవగాహన లేక హామీలు ఇచ్చానని కారణం చెప్పడం అంటే.. ప్రజల్ని మోసం చేయడమే అవుతుంది. పైగా వచ్చే ప్రభుత్వాలు కూడా సీపీఎస్ రద్దు చేయకుండా ఆ కంట్రిబ్యూషన్ పై పెద్ద ఎత్తున అప్పులు తెచ్చుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అగ్రిగోల్డ్ బాధితులకూ రూ. 1150 కోట్లు ఇవ్వడం దగ్గర్నుంచి ఎస్సీ, ఎస్టీలు సహా అనేక పథకాలను స్వయంగా మేనిఫెస్టోలో ప్రకటించినా జగన్ఇవ్వలేదు. రైతులకు రూ. 12500 ఒకే సారి మే నెలలో ఇస్తామన్నారు. తర్వాత కేంద్రం ఇచ్చే రూ. ఆరు వేలు తీసేసి ఆరున్నర వేలు ఇస్తున్నారు. అయితే ఒక వేయి పెంచారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడున్నర వేలే ఇస్తుంది. జగన్ ప్రతిపక్ష నేతగా ఈ రైతు భరోసా కింద రూ. పన్నెండున్నర వేలు ప్రకటించినప్పుడు.. కేంద్రం పీఎం కిసాన్ పథకం ప్రవేశ పెట్టలేదు. అయినా రైతులకు ఇచ్చిన హామీని విస్మరించారు. ఏటా డిఎస్సీ మాటలేదు.. కోల్డ్ స్టోరేజ్, పంటలకు గిట్టుబాటు ధర, జర్నలిస్టులకు ఇల్లు, వృద్ధాశ్రమం, ఇస్లామిక్ బ్యాంకులు, కొత్త పరిశ్రమలు ఇవన్నీ అమలు చేయలేదని టీడీపీ అంటోంది.

వైఎస్ఆర్‌సీపీ నేతలు తాము ఇచ్చిన హామిల్ని 99 శాతం అమలు చేశామని గట్టిగా ప్రచారం చేస్తున్నారు. ఎందుకంటే.. మాట తప్పం.. మడమ తిప్పం అనే ట్యాగ్ లైన్ తో గత ఎన్నికల్లో ప్రజల్ని గట్టిగా నమ్మించారు. అనేకవర్గాల్లో భరోసా కల్పించారు. ముఖ్యంగా ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, యువకులకు జాబ్ క్యాలెండ్ అంశాలు బాగా ఆకర్షణీయంగా మారాయి. మహిళలకు మద్య నిషేధం హామీ ఓట్ల వర్షం కురిపించిందని చెబుతారు. అయితే ప్రధానమైన హామీల విషయంలో అనుకున్న విధంగా చేయకపోవడంతో.. విపక్షాలు ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. వైసీపీ కొత్త మేనిఫెస్టోను ప్రజలు నమ్మాలంటే.. ఇప్పటికే అమల్లో ఉన్న మేనిఫెస్టోలో .. అమలు చేయలేకపోయిన హామీలపై .. ప్రజలకు సంతృప్తి కరమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

# పాతబస్తీలో వినూత్న ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 26, ఆమె దెబ్బకు పాతబస్తీలో పూనకాలు లోడింగ్ అన్నట్లు మారిపోయింది రాజకీయం. మొన్న మతపరమైన కట్టడంపై బాణం ఎక్కుపెట్టారని ఆరోపణలు వచ్చాయి. తర్వాత పతంగి అంతం చూస్తానంటూ పంతం పట్టారు. గాలి పటం ఎగరేస్తున్నట్టు యాక్షన్ చేసి, దాన్ని కట్ చేసినట్లు చూపించి.. బీజేపీ కేడర్‌లో కాక రేపారు. మాటల కంటే చేతలతోనే మంటలు రేపుతున్నారు. తన హావభావాలతో.. ఓల్డ్ సిటీలో కైట్ ఫైట్‌ని పీక్స్‌కి తీసుకువెళ్లారు. తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం మామూలుగా లేదు. అందులోనూ రాజధాని నగరం హైదరాబాద్ లోని ఓల్డ్ సిటీలో ఎన్నికల ప్రచారం కాకరేపుతోంది. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థులుగా ఇంతవరకు ఎంతమంది పోటీ చేసినా, ప్రచారం చేసినా.. ఆమెకు వచ్చిన క్రేజ్ మాత్రం నెక్ట్స్ లెవెల్ అంటున్నారు పబ్లిక్. ఆమె నన్ అదర్ దేన్ మాధవీ లత. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగినప్పుడు జనానికి పెద్దగా పరిచయం లేని పేరు. రాజకీయాలకు పూర్తిగా కొత్త ముఖం. అయితే ఇప్పుడు ఆమె పేరు తెలియనివాళ్లు తెలుగు రాష్ట్రాల్లోనే లేరు. ఇక జాతీయ స్థాయిలో కూడా మాధవీలత పేరు మార్మోగిపోతోంది.హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మాధవీ లత ఏం చేయగలరు? అది మజ్లిస్ అడ్డా. ఒవైసీ గడ్డ అనుకున్నారు అంతా. అయితే ఇప్పుడు మాధవీలత ప్రచారం పాతబస్తీలో బీజేపీ కేడర్‌కు ఊపు తెస్తోంది. మజ్లిస్ ఎన్నికల గుర్తు పతంగి. దాన్ని చేతులతో ఎగరేసి కట్ చేసినట్లు చూపిస్తున్నారు మాధవీలత. నాకు మాటలు అక్కర్లేదు. చేతలు చాలు అంటూ మాధవీలత చేస్తున్న పొలిటికల్ యాక్షన్‌కు రియాక్షన్ కూడా అంతే తీవ్రంగా వస్తోంది. అయినా తగ్గేదే లా అన్నట్లు మాధవీలత దూసుకుపోతున్నారు. పాతబస్తీలో సరికొత్త రాజకీయ రంగు, రుచి, వాసన జనానికి చూపిస్తున్నారు. ప్రచారంతో పూనకాలు తెప్పిస్తున్న మాధవీలతపై కేసులు కూడా నమోదవుతున్నాయి. ఇక ఒవైసీ బ్రదర్స్ కూడా ఆమె మీద గరం గరం అవుతున్నారు. ఇదే తరుణంలో ఆయన కూడా కైట్ ను మరింత జోష్ గా ఆకాశంలో ఎగురవేస్తున్నట్లు చేతులతో హావభావాలను పలికించారు. ఇలా ఇరువురి మధ్య మాటల తూటాలు కాస్త సైగలతో దూసుకెళ్లిపోతోంది. దీనిని ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారు.

## యువ నేత కార్మికుడు ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల పట్టణం పద్మానగర్ కు చెందిన అడిచర్ల సాయి కుమార్(26) అనే వ్యక్తి ఇంటి ఆవరణలో రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నేత కార్మికులకు ఉపాధి లేకపోవడంతో మనస్తాపం చెంది సాయి ఉరివేసుకున్నాడు. సిరిసిల్ల పట్టణంలో సాయి వార్పిన్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొద్ది రోజులుగా వార్పిన్ పని లేకపోవడంతో ఉరి వేసుకున్నాడు.

## బాలానగర్ లో ఈటల ప్రచారం

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ లోనీ ఇంద్రానగర్, శ్రీ శ్రీ నగర్ కాలనీల్లో డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఈటల రాజేందర్. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అయనకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. ఈటెల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆవిరి నెరవేర్చడంలో విఫలమైందని, టిఆర్ఎస్ నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. కచ్చితంగా మల్కాజ్గిరిలో బిజెపి జెండా ఎగరవేస్తామని అన్నారు. స్థానికుల నుండి అపూర్వస్పందన లభించిందన్న ఈటల రాజేందర్, ఈసారి దేశంకోసం, మోదీకోసం బీజేపీకి ఓటువేస్తామని అంటున్నారని తెలిపారు.

# రక్షణకు భారీగా 91 వేల కోట్ల డాలర్లు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26, (న్యూస్ పల్స్) ప్రపంచంలో అన్ని దేశాలు ప్రస్తుతం రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకోసం సైన్యానికి, ఆయుధాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశాలు రక్షణకు ఎంత వ్యయం చేస్తున్నాయో స్టాక్ హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం(సిప్రి) తాజాగా నివేదిక విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం రక్షణ వ్యయంలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఈ దేశం రక్షణ కోసం 91 వేల కోట్ల డాలర్లు వెచ్చిస్తోంది. ఇక 2023 నివేదిక ప్రకారం భారత్ రూ.8,300 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తుంది. మన దేశంలో ప్రపంచంలో రక్షణ వ్యయంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. రెండు, మూడో స్థానాల్లో చైనా, రష్యా నిలిచాయి.ఇక రక్షణ కోసం ప్రపంచ దేశాలు గతేడాది 2,44,300 కోట్ల డాలర్లు వెచ్చించాయని సిప్రి తెలిపింది. 2022తో పోలిస్తే ఆ మొత్తం 6.8% అధికమని పేర్కొంది. 2009 తర్వాత రక్షణ వ్యయం ఒక ఏడాదిలో ఇంత ఎక్కువ పెరగడం ఇదే తొలిసారని వెల్లడించింది. వరుసగా తొమ్మిదో ఏడాది ఈ వ్యయంలో పెరుగుదల నమోదైందని తెలిపింది.ఇక సిప్రి నివేదిక ప్రకారం.. భారత రక్షణ వ్యయం 2022తో పోలిస్తే 2023లో 4.2% పెరిగింది. 2014తో పోలిస్తే అది 44% పెరిగింది. సిబ్బంది, నిర్వహణ వ్యయాల పెరుగుదలే భారత రక్షణ వ్యయం అధికం కావడానికి ప్రధాన కారణం. 2023 నాటి మొత్తం మిలిటరీ బడ్జెట్లో వాటిదే మూడో వంతు వాటా. చైనా, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో.. సాయుధ బలగాల సమర సన్నద్ధతను బలోపేతం చేసుకునేందుకు భారత్ ప్రాధాన్యమిస్తోంది. మిలిటరీ వ్యయంలో దాదాపు 22% బడ్జెట్‌ను రక్షణరంగ కొనుగోళ్లకు కేటాయిస్తోంది. అందులో 75% వాటా దేశీయ కొనుగోళ్లకే వెళ్తుంది.

సిప్రి నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..

? రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఆసియా, ఓషియానా, పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా గతేడాది ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం పెరిగింది.

? అమెరికా రక్షణ వ్యయం 2022తో పోలిస్తే నిరుడు 2.3% పెరిగింది. 2014తో పోలిస్తే ఆదేశ రక్షణ వ్యయంలో పెరుగుదల 9.0%గా ఉంది.

? సైనిక వ్యయం పరంగా ఉక్రెయిన్ గతేడాది ప్రపంచంలో 8వ స్థానంలో నిలిచింది. 2023లో ఈ రంగంపై ఆదేశం అత్యధికంగా ఖర్చు చేసింది. మొత్తం 6,490 కోట్ల డాలర్లు వెచ్చించింది. రష్యా రక్షణ వ్యయంలో ఇది 50 శాతం మాత్రమే.

# కోటి దాటేసిన హైదరాబాద్ ఓటర్లు

హైదరాబాద్, ఏప్రిల26 గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటర్ల సంఖ్య కోటి దాటింది. తెలంగాణ మొత్తం ఓటర్లలో ఇది 30 శాతంగా ఉంది. కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటింగ్ శాతం కనిష్ఠంగానే నమోదు అవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య కోటి దాటింది. వేగంగా విస్తరిస్తున్న నగరంతో పాటు ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2019 లోక్ సభ ఎన్నికల నుంచి ప్రస్తుతం జరగనున్న ఎన్నికల వరకు సుమారు 15 లక్షల మందికి పైగా కొత్త ఓటర్లు నమోదు అయినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం... ప్రస్తుతం గ్రేటర్ లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఓటర్ల సంఖ్య 1.05 కోట్లు దాటింది. మొత్తం తెలంగాణ ఓటర్లలో ఇది 30% ఉంటుందని అంచనా.ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే ఓటర్ల సంఖ్య ఉన్నప్పటికీ... గ్రేటర్ హైదరాబాద్ లో మాత్రం ఓటింగ్ శాతం మాత్రం సగం దాటి ముందుకు వెళ్లడం లేదు. ఈ క్రమంలోనే నగరంలోని ఓటర్లలో అవగాహన పెంచేందుకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ప్రధాన కూడళ్లు, బస్ స్టేషన్ ,రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, వీధి నాటకాలు, తదితర కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు కాలనీ సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్ సంఘాలు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వంటి ప్రధాన సంస్థలు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఎన్నికల గడువు సమీపిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీల ప్రచారం మాత్రం ఇంకా జోరు అందుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు నుంచే ప్రచారాలు మొదలు పెట్టినప్పటికీ......ఈసారి ఎన్నికల్లో మాత్రం అలా కనిపించడం లేదు.ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం... 2019 లోక్ సభ ఎన్నికల నాటికి గ్రేటర్ లో 90.47 లక్షల మంది ఓటర్లు ఉంటే గతేడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 99 లక్షలకు చేరింది. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 1.05 కోట్లకు చేరింది. అంటే ఈ లోక్ సభ ఎన్నికల్లో 15 లక్షల మంది కొత్తగా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్లో 45.7 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 31 లక్షలు, మేడ్చల్ జిల్లాలో 21.78 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.ఈ మొత్తం ఓటర్లలో 54.2 లక్షల మంది పురుషులు ఉండగా...... 51.23 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 7.4 లక్షల మంది ఓటర్లు ఉండగా... చార్మినార్ పరిధిలో అత్యల్పంగా 2.28 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. లోక్ సభ ఎన్నికలు జరగనున్న హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి ,నియోజకవర్గాల్లో ఈ ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టనున్నారో మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది. కోటికి పైగా ఓటర్లు ఉన్న గ్రేటర్ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో ఏ పార్టీ ముందంజలో ఉంది? నగర ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారు అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్)ప్రభంజనం కనిపించినా.. హైదరాబాద్ ఓటర్లు మాత్రం బిఆర్ఎస్ కే పట్టం కట్టారు.గ్రేటర్ ఓటర్ల తీరు....పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగానే మారింది. సాధారణంగానే మధ్యతరగతి, ఆపై వర్గాలు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంటున్నారు. వాసి కంటే రాశి ఎక్కువ అన్నట్టు...ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటింగ్ లో పాల్గొనేవారు తక్కువ. మరోవైపు ప్రతిసారి ఎన్నికల సందర్భంగా లక్షలాది మంది నగరవాసులు సొంతుల్లకు వెళతారు. ఈసారి కూడా అదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. చాలామందికి హైదరాబాద్ తో పాటు సొంత ఊళ్లలో కూడా ఓటు హక్కు ఉన్నాయి. ఊరిలో ఓటు వేయడం ద్వారా తమ ఉనికిని చాటుకునేందుకు ఎక్కువ మంది నగర వాసులు సొంతూళ్లకు వెళతారు. ఈసారి మే 13న జరిగిన లోక్ సభ ఎన్నికలకు సైతం నగరవాసులు....ఏపీలో సొంతుళ్లకూ పెద్ద సంఖ్యలో తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో హైదరాబాద్ లో ఈసారి మునుపటి కన్నా తక్కువగా నమోదు అయ్యే అవకాశం లేకపోలేదని పలు సంస్థలు చెబుతున్నాయి.

# దుమారం రేపుతున్న నయవంచన పోస్టర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 26 హైదరాబాద్ లోని అనేక బహిరంగ ప్రదేశాల్లో బీజేపీకి వ్యతిరేకంగా బ్యానర్లు వెలిశాయి. వీటిని సామాన్యులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బీజేపీకి వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ చార్జ్ షీట్ రూపంలో వీటిని విడుదల చేసింది. గాంధీభవన్ రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నేతలు ఈ పోస్టర్లను విడుదల చేశారు. ఈ ప్రజా చార్జిషీట్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు మాట్లాడారు. కొద్దిమంది తన స్నేహితులు, క్రోనీ క్యాపిటల్స్ కు దేశ సంపదను కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని భట్టి అన్నారు. జనాభాను కులాలు మతాలుగా విభజించి మతకల్లోలాలు సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని.. ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో ఒక రాష్ట్రంపై మరొక రాష్ట్రం దాడి చేసి సంపదను దోచుకునేదని.. ప్రస్తుతం ఈ దేశంలో మోదీ హయాంలో అదే ధోరణి కొనసాగుతోందని భట్టి ఆరోపించారు.గత పదేళ్లుగా ఈ దేశ ప్రజలను మోదీ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేస్తుందో చూశాం. రాబోయే ఎన్నికల్లో గెలుపొందేందుకు మోసపూరిత హామీలు ఇస్తోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోదీ గతంలో హామీ ఇచ్చారు. కానీ గత పదేళ్లలో ఈ హామీని అమలు చేయలేదు. ప్రపంచ వ్యాప్తంగా పేరుకుపోయిన భారతీయుల నల్లధనాన్ని వెలికి తీసి దేశంలోని పేదవాళ్ల అకౌంట్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ దేశంలో ఏ ఒక్క పేదవాని అకౌంట్లో 15 లక్షలు జమ కాలేదు. పెద్ద నోట్ల రద్దుతో నకిలీ కరెన్సీని అరికడతామని చెప్పారు. పదేళ్లయినా ఈ హామీకి సంబంధించిన సమాచారం కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు.ప్రధాని మోదీ తన కొద్దిమంది క్రోనీ క్యాపిటల్స్ స్నేహితుల కోసం విదేశీ సంపదను ఎలా దోచిపెడుతున్నాడో యువ నేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించి వివరంగా ఈ దేశ ప్రజలకు చాటారు. దేశ సంపదను కొద్దిమందికి కట్టబెట్టాలని చూసే మోదీ ప్రభుత్వం ఓవైపు.. కుల గణన చేసి అధిక శాతం ఉన్న జనాభాకు ఈ దేశ సంపదను పెంచాలని రాహుల్ గాంధీ మరోవైపు ఈ ఎన్నికల్లో పోరాటం చేస్తున్నారు" అని భట్టి తెలిపారు.రాజ్యాంగం, లౌకికవాదం, ఈ దేశ సంపదను కాపాడేందుకు రాహుల్ గాంధీ నిత్యం ప్రజల్లో తిరుగుతున్నారని భట్టి తెలిపారు. లౌకికవాదం ప్రజాస్వామ్యం ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు మీడియా ముందుకు రావాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. చార్జ్ షీట్ లో పేర్కొన్న ప్రతి విషయాన్ని ప్రతి పౌరునికి ఇంటికి చేరే విధంగా కాంగ్రెస్ సైన్యం కృషి చేయాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

# పట్టభద్రుల స్థానంనుంచితీన్మార్‌మల్లన్నకు చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 26 నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ స్థానం ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. మే 2వ తేదీన నోటిఫికేషన్, మే 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 13న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న పోలింగ్, జూన్ 5వ తేదీన కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. జనగామా నియోజకవర్గం నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే ఎన్నికల సంఘం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జర్నలిస్టు తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. యూత్, గ్రాడ్యుయేట్లలో మంచి ఫాలోయింగ్ ఉన్నందున తీన్మార్మల్లన్నకు చాన్స్ వచ్చింది. తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ .. తెలంగాణ రాజకీయల్లో పరిచయం లేని వ్యక్తి. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ కు సపోర్టుగా ఉన్నారు. ఆయన పేరును కరీంనగర్ లోక్ సభకు కూడా పరిశీలించారు. అసెంబ్లీ టిక్కెట్ కోసం కూడా ప్రయత్నించారు. అయితే ఇప్పుడు ఆయనకు పాత అవకాశమే కొత్తగా వచ్చింది. అదే ఎమ్మెల్సీ. ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామా చేయడంతో వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీకి కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించారు.నిజానికి ఈ స్థానానికి 2021లో ఎన్నికలు జరిగినప్పుడు మల్లన్న ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. తెలంగాణ ఉద్యమ నేత కోదండరాంను కూడా దాటేసి రెండో స్థానంలో నిలిచారు. 2021లో జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యా సంస్థల అధినేత. ఆయన తన నెట్ వర్క్‌ను ఉపయోగించుకుని పట్టభద్రుల ఓట్లను పెద్ద ఎత్తున ఎన్‌రోల్ చేయించారు. పకడ్బందీగా పోల్ చేయించుకోగలిగారు. అయినా రెండో స్థానంలో నిలిచారు నవీన్ కుమార్.రాజకీయంగా ఎదగాలనే ఆకాంక్ష ఉన్న ఆయన తరచూ ఎన్నికల్లో పోటీ చేస్తూ ఉంటారు. అంతకు ముందు హుజూర్ నగర్ ఉపఎన్నికల్లో కూడా పోటీ చేశారు. అయితే కనీస ప్రభావం కూడా చూపించలేదు. ఇ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి.. రెండో స్థానంలో ఉన్నారు. ఉద్యమ నేతగా అందరి ప్రశంసలు పొందిన కోదండరాం కూడా ఆ ఎన్నికల్లో పోటీ చేశారు.

కానీ మల్లన్న తర్వాత స్థానంలోనే ఉండిపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్నందున గెలుపొందుతామన్న నమ్మకంతో ఉన్నారు. బీఆర్ఎస్ , బీజేపీ తమ అభ్యర్థుల్ని ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే మహబూబ్ నగర్ స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. కోడ్ కారణంగా కౌంటింగ్ వాయిదా పడింది.

# మానేరు బ్రిడ్జి కూల్చివేతపై యాక్షన్ షురూ
## కాంట్రాక్టర్ దగ్గర నుంచి పైసల వసూల్

కరీంనగర్, ఏప్రిల్ 26 పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు వద్ద పెనుగాలులకు కుప్పకూలిన మానేర్ బ్రిడ్జి పై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్టర్ ను ఇప్పటికే బ్లాక్ లిస్టులో పెట్టిన ప్రభుత్వం, కూలిన బిడ్జికి అయ్యే ఖర్చును కాంట్రాక్టర్ నుంచే వసూలు చేయాలని నిర్ణయించింది. పిల్లర్లు(పియర్స్) కూడా నాణ్యత లోపంతో ఉన్నట్లు తేలితే క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యింది.మొన్న వీచిన పెనుగాలులకు పెద్దపల్లి–జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలుపుతు ఓడేడు–గరిమిళ్ళపల్లి గ్రామాల మధ్య మానేర్ పై 49 కోట్ల వ్యయంతో 2016లో చేపట్టిన బ్రిడ్జి కుప్పకూలింది. బ్రిడ్జి కి సంబంధించిన మూడు గడ్డర్ లు కూలిపోవడంతో ఆర్ అండ్ బి సీఈ మోహన్ నాయక్ పరిశీలించారు. పేను గాలులకు కూలిన గడ్డర్ లను తనిఖీ చేశారు. గడర్స్ ల నిర్మాణానికి వాడిన సామాగ్రిని, రాడ్ల నాణ్యతను, పిల్లర్లను పరిశీలించి పడిపోయిన గడర్లను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం.. నాణ్యత లోపం వల్ల శ్రీ సాయి కన్స్టక్షన్ కాంట్రాక్టర్ ను గత జనవరిలో తొలగించామని స్పష్టం చేశారు. 2016లో 49 కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి ఇప్పటి వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. అనుకున్న సమయానికి పనులను పూర్తి చేయలేకపోవడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే పిర్యాదులతో కాంట్రాక్టర్ ను గత జనవరిలో తొలగించడంతో పాటు కోటి 70 లక్షలు జప్తు చేశామని చెప్పారు. రెండు సంవత్సరాలుగా గడర్స్ లను కట్టె చెక్కల మీద చాలారోజులుగా పెట్టడంతో ఒకదానిపై ఒకటి వాలి గాలికి కింద పడ్డాయని తెలిపారు. చేసిన పనులకు 20 కోట్ల వరకు బిల్లు పేమెంట్ చేశామని ఇంకా 60 లక్షల రూపాయలను సంబంధిత కాంట్రాక్టర్ కు ఇవ్వాల్సి ఉందన్నారు. జరిగిన నష్టం మొత్తం కాంట్రాక్టర్ నుంచి వసూలు చేస్తామని చెప్పారు. పిల్లర్ల నిర్మాణంలో సైతం నాణ్యత లేదంటున్నారని దాన్ని తనిఖీ చేసి నాణ్యత లోపం ఉంటే కాంట్రాక్టర్ తోనే ఆపనులకు అయ్యే ఖర్చు మొత్తం వసూలు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు చేపడుతామన్నారు.కూలిపోయిన బ్రిడ్జిని పునఃర్నిర్మించేందుకు త్వరలోనే టెండర్ పిలుస్తామని సిఈ మోహన్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ అనుమతికోసం ఫైల్ పంపించామని చెప్పారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల అనంతరం బ్రిడ్జి నిర్మాణపనులు చేపడుతామన్నారు. నిర్మాణ అంచనా వ్యయం 70 కోట్లకు చేరనుంది. బ్రిడ్జి డ్యామేజ్ తో మేలుకొన్న అధికారయంత్రాంగం ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే 8 ఏళ్ళుగా బ్రిడ్జి నిర్మాణం పనులు మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగడంతో స్థానికులు అసహనంతో ఉన్నారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసేల చర్యలు చేపడితే రెండు జిల్లాల మధ్య రాకపోకలకు ఇబ్బంది ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## హైదరాబాద్ కు తరలిన బీఆర్ఎస్ నేతలు

సిద్దిపేట సీఎం రేవంత్ రెడ్డి కి మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామా సవాల్ విసిరిన నేపథ్యంలో సిద్దిపేట నుండి భారీగా వెళ్లిన నేతలు, పార్టీ శ్రేణులు అభిమానులు తరలి వెళ్లారు. హైదరాబాద్ గన్ పార్క్ వద్దకు సిద్దిపేట నుండి దాదాపు 100 వాహనాల్లో బయలు దేరారు.

వందలాది మంది కార్యకర్తలు ఎవరికీ వారు స్వచ్ఛందంగా హైదరాబాద్ కు వెళ్లారు.

# కాంగ్రెస్ కాదు... రేవంత్ టార్గెట్

హైదరాబాద్, ఏప్రిల్ 26 తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ముక్కోణపు పోరాటంలా సాగుతున్నాయి. పైకి ఇలా కనిపిస్తున్నా జరుగుతున్న రాజకీయాన్ని చూస్తే మాత్రం.. రేవంత్ వర్సెస్ బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా పోరాటం జరుగుతోంది. అటు భారతీయ జనతా పార్టీ, ఇటు బీఆర్ఎస్ పార్టీ కూడా పూర్తిగా కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేయడం లేదు. రేవంత్ రెడ్డినే టార్గెట్ చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి సీఎంగా ఉండరని ప్రభుత్వం కూలిపోతుందని హెచ్చరికలు కూడా చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి కూడా తనపై బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్ర పన్నుతున్నాయని పాలమూరు బిడ్డ సీఎం పదవిలో ఉండకుండా చేసేందుకు కలిసిపోయారని అంటున్నారు రేవంత్ రెడ్డి ఆ రెండు పార్టీలు చేస్తున్న రాజకీయాన్ని అడ్వాంటేజ్ గా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కన్నా రేవంత్ రెడ్డే ప్రమాదకరంగా బీజేపీ, బీఆర్ఎస్ భావిస్తున్నాయా ? హామీలు అమలు చేయకపోతే రేవంత్ రాజీనామా చేస్తారా అని హరీష్ రావు సవాల్ చేశారు. రెడీ అని రేవంత్ రెడ్డి అన్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఉంటుందో ఉండదో చెప్పలేనని కేసీఆర్ అంటున్నారు. తనతో పాతిక మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని అంటున్నారు. కానీ తాము ప్రభుత్వాన్ని పడగొడతామని ఆయన చెప్పడం లేదు. బీజేపీ పడగొడుతుందని జోస్యం చెబుతున్నారు. అగ్రనేతలే కాదు.. కేటీయార్, హరీష్ రావు, బీజేపీలో జీ కిషన్ రెడ్డి మొదలుకుని బండి సంజయ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఏలేటి మహేశ్వరరెడ్డి, రఘునందనరావుకు ప్రతిరోజు రేవంత్ ను టార్గెట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం కంటే రేవంత్ ను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని ఓడించాలనుకుంటున్నారు. రేవంత్ రెడ్డిని రెండు ప్రదాన పార్టీలు టార్గెట్ చేస్తున్నాయంటే.. ఆయన బలం పెరిగిందనే అర్థం. నిజానికి కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయాలి. ఆ పార్టీపై వ్యతిరేకత పెంచాలి. కానీ రేవంత్ రెడ్డిపై వ్యతిరేకత పెంచితే చాలని విజయం వస్తుందని..ఓటర్లు మారిపోతారని బీఆర్ఎస్, బీజేపీ అనుకుంటున్నాయి. ఆయన ముఖ్యమంత్రి కాబట్టి ఆయనను టార్గెట్ చేస్తున్నారని అనుకోవడానికి లేదు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విస్తృతంగా శ్రమిస్తున్నారు .ఓ వైపు పీసీసీ చీఫ్ గా మరో వైపు సీఎంగా రెండు బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. కింది నుంచి ఎదిగిన రేవంత్ రెడ్డికి ఆ సామర్థ్యం ఉంది. కష్టపడి అనేకమంది ప్రత్యర్థులను ఎదుర్కొని చాకచక్యంతో సందర్భానికి తగ్గ నిర్ణయాలు తీసుకుని ఉన్నత స్థానానికి ఎదిగారు రేవంత్రెడ్డి. గ్రూపులకు నిలయమైన కాంగ్రెస్ లో చేరిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి అయ్యారు. చెప్పదలచుకున్నది సూటిగా సుత్తిలేకుండా చెప్పటం, విషయ పరిజ్ఞానం ఉండటం, జనాలకు ఆకట్టుకునే వాగ్ధాటి ఉండటం రేవంత్ స్టైల్. అందుకే ఆయన ప్రజల్లో తిరుగులేని నేతగా ఎదుగుతున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పై ప్రజల్లో ఆదరణ ఉన్నా .. ఏకతాటిపైకి నడిపించే నాయకుడు లేకపోవడం వల్లనే రెండు సార్లు ఓడిపోయిందన్న అభిప్రాయం ఉంది. మూడో సారి ఎన్నికలు జరిగేనాటికి ఆ లోటును రేవంత్ రెడ్డి తీర్చేశారు. తనకు పీసీసీ చీఫ్ పోస్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత వచ్చినా ఆయన సమన్వయంతో సరి చేసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి వచ్చినప్పుడు కూడా ఆయన అంతే అందర్నీ కలుపుకుని వెళ్లారు. ఇప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నేతలు కూడా ఆయనే పదేళ్లుగా సీఎంగా ఉంటారని చెబుతున్నారు. రేవంత్ రెడ్డి ఇక్కడే చాణక్యం చూపిస్తూ ఉంటారు. నల్లగొండ పర్యటనకు వెళ్లి.. కోమటిరెడ్డికి కూడా ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందని చెబుతూ ఉంటారు. ఇలా నొప్పింపక ..తానొవ్వక అన్న పద్దతిలో రేవంత్ రెడ్డి పార్టీలో పట్టు పెంచుకుంటూ ప్రజల్లో పలుకుబడి పెంచుకుంటూ ఇతర పార్టీలకు ప్రధాన ప్రత్యర్థిగా మారారు. రేవంత్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని ఒకరు, లోక్ సభ ఎన్నిక లవుతూనే రేవంత్ పతనం మొదలవుతుందని మరొకరు, ఒక ఏడాది కంటే రేవంత్ ప్రభుత్వం కొనసాగదని ఇంకొకరు రేవంత్ పతనం కాంక్షిస్తున్నారు.రేవంత్అంతకు మించి కొనసాగితే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందని వీళ్లంతా భయపడుతున్నారన్న కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. బీజేపీ నేతలు కిషన్, బండి, రఘునందన్ ఇలా ప్రతిఒక్కరు ప్రతిరోజు రేవంత్ జపమే చేస్తున్నారు. తమ ఆరోపణలు, విమర్శలన్నింటినీ రేవంత్ ప్రధానంగానే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని, పార్టీని రేవంత్ చీల్చేస్తాడని, రేవంత్ తెలంగాణా షిండే అయిపోతాడని కాంగ్రెస్ లో ఆయనపై నమ్మకం తగ్గించే వ్యూహం అమలు చేస్తున్నారు. వీరు ఎన్ని చేసినా రేవంత్ తనదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పది కిపైగా పార్లమెంట్ స్థానాల్లో గెలిపిస్తే రేవంత్ ఇమేజ్ మరింత పెరుగుతుంది. అప్పుడు మరింత ఎక్కువగా రేవంత్ వర్సెస్ ఇతర పార్టీలు అన్నట్లుగానే రాజకీయం మారుతుంది. రేవంత్ నీడలోనే కాంగ్రెస్ ఉండిపోతుంది.

## నల్గొండ బీఆర్ఎస్‌లో పొలిటికల్ ఫైట్–
## గాదరి కిషోర్‌పై గుత్తా వర్గీయల ఎటాక్

నల్గొండ, ఏప్రిల్ 26 లోక్‌సభ ఎన్నికల వేళ నల్గొండ జిల్లా రాజకీయాలు చాలా వేగంగా మారుతున్నాయి. గుత్తా సుఖేందర్ రెడ్డి ఫ్యామిలీ, బీఆర్ఎస్ మధ్య ఏర్పడిన గ్యాప్ మరింత పెరుగుతోంది. ఆయన పార్టీ మారడం ఖాయమని భావించిన బీఆర్ఎఎస్ విమర్శల దాడి పెంచింది. వాస్తవాలు చెప్పిన తన నేతపై అనవసరంగా దాడి చేస్తున్నారని గుత్తాసుఖేందర్ రెడ్డి వర్గం అదే స్థాయిలో కౌంటర్ అటాక్ మొదలైంది. పార్టీ మారుతున్నట్టు ఎక్కడా చెప్పకపోయినా గుత్తా సుఖేందర్ రెడ్డి... ప్రస్తుతం తాను ఉన్న పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీలో ఉన్న లోపాలు ఎత్తి చూపారు. తను పార్టీ లోకి ఎలాంటి హామీ ఇచ్చి తీసుకు వచ్చారో కూడా వివరించారు. ఓటమికి కారణాలపై కూడా తన విశ్లేషణ తెలిపారు. తన వారసుడి విషయంలో ఏం జరిగిందో పేర్కొన్నారు. గుత్తాసుఖేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో కలకలం రేపాయి. పార్టీని వీడి వెళ్లేందుకు సిద్ధమైన గుత్తా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ విరుచుకుపడ్డారు. గాదరి చేసిన వ్యాఖ్యలపై గుత్తా సుఖేందర్ రెడ్డి వర్గీలు అదే స్థాయిలో రియాక్ట్ అవుతున్నారు. జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఇరిగి పెద్దులు మాట్లాడుతూ "40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన గుత్తా సుఖేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి గాదరి కిషోర్‌కు లేదు. ఒక ఉపాధ్యాయుని కొడుకై ఉండి కనీసం వయసులో తన తండ్రి కన్నా పెద్దవాడిని గౌరవించే సంస్కారం లేని వ్యక్తి కిశోర్. ఉస్మానియా యూనివర్సిటిలో వేల మంది చేసిన ఉద్యమాలను తన ఖాతాలో వేసుకొని స్నేహితులను ముంచారు. ఉద్యమకారుడి కోటాలో ఓఒం టికెట్ తెచ్చుకొని తుంగతుర్తి ప్రాంతానికి చేసింది ఏమి లేదు.ఇసుక దందానీ వృత్తిగా మార్చుకొని వందల కోట్లు సంపాదించారు. తెలంగాణ ఉద్యమం టైంలో చందాలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నారు. అని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ పతనానికి ప్రధాన కారుకుడు కిషోర్ అని గుత్తా వర్గీయుల నుంచి వస్తున్న ప్రధాన విమర్శ. దొంగ నోట్ల కేసులు, ఇసుకదందాలు, భూ కబ్జాలు, బ్లాక్ మెయిల్ చేసి పార్టీ పరిస్థితిని దిగజార్చాలని ఆరోపించారు. స్థాయి మరిచి చిన్నా, పెద్దా తేడా లేకుండా మాట్లాడితే ప్రజలు తరిమి కొడతారని వార్నింగ్ ఇచ్చారు. మరోసారి గుత్తా సుఖేందర్ లాంటి వ్యక్తిపై మాట్లాడితే నాలుక కోస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికల టైంలో బీఆర్ఎస్‌లో నేతల మధ్య మాటల యుద్ధం కొత్త చర్చకు దారి తీసింది

## భువనగిరి కమలంలో కుమ్ములాటలు ముంచుతాయా

నల్గొండ, ఏప్రిల్ 26 రాష్ట్రంలోని 17 లోక్ సభా నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న ఆ పార్టీ , తమ అభ్యర్థులు కచ్చితంగా గెలుస్తారన్నఅంచనాలో ఉన్న స్థానాలను ఏ కేటగిరీగా, కష్టపడితే గెలుస్తామన్న ధీమా ఉన్న స్థానాలను బి కేటగిరీగా, గట్టిపోటీ ఇచ్చి గౌరవ ప్రదమైన స్థాయిలో ఓటింగ్ శాతం నమోదు చేస్తామన్న నియోజక వర్గాలను సి కేటగిరీగా విభజించుకుని ఆ మేర వ్యూహాలు రచించుకుందని చెబుతున్నారు.అలాంటి వాటిలో బి కేటగిరిలో అంటే, కొద్దిగా కష్టపడితే గెలిచే అవకాశం ఉన్న సీట్లలో భువనగిరి ఒకటి. ఇక్కడి నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇపుడు అభ్యర్థికి, స్థానిక నేతల మధ్య పొసగకపోవడం సమస్యగా మారింది.భువనగిరి బీజేపీలో సీనియర్ నాయకుల మధ్య గ్రూప్ గొడవలు జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ సీనియర్లను పక్కన పెట్టి, కేవలం తన సామాజిక వర్గానికే ప్రాధాన్యం ఇస్తూ.. కుల రాజకీయాలు చేస్తున్నారన్నది పార్టీ నాయలకు ఆరోపణ.జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ రావు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన గూడూరు నారాయణరెడ్డి వంటి సీనియర్ నేతలతో ఎంపీ అభ్యర్థి బూరకు పొసగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మరో ఇరవై రోజుల్లోపే పోలింగ్ జరగనున్న తరుణంలో పార్టీ నాయకుల మధ్య జరుగుతున్న గ్రూప్ వార్ తో పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. ప్రచారంలో తమను పట్టించుకోక పోవడం, తమను పక్కన పెట్టి, ఏక పక్షంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు పార్టీ నాయకుల నుంచి వస్తున్నాయి.పార్టీ నాయకులు కొందరు మరో అడుగు ముందుకేసి పార్టీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ బీఆర్ఎస్ కు కోవర్ట్ గా పనిచేస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. వాస్తవానికి డాక్టర్ బూర 2014 లో బీఆర్ఎస్ నుంచి ఇదే నియోజకవర్గంలో ఎంపీగా విజయం సాధించారు.అదే బీఆర్ఎస్ నుంచి 2019 లో 5వేల ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి 2021 లో జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఆయన బీఆర్ఎస్ ను వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ టికెట్ తెచ్చుకుని పోటీలో ఉన్నారు.రాజకీయ భవిష్యత్ కోసమే బీఆర్ఎస్ ను వీడిన బూర నర్సయ్య గౌడ్ ఎందుకు తన ఓటమిని తానే చేజేతులా కొనితెచ్చుకుని వద్దనుకుని వదిలేసి వచ్చిన పార్టీకి కోవర్ట్ గా పనిచేస్తారని బూర వర్గం ప్రశ్నిస్తోంది. ఈ ఆరోపణలు చేస్తున్న గూడూరు నారాయణ రెడ్డి వంటి నాయకులు కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన వారు. గూడూరు నారాయణ రెడ్డి టీపీసీసీకి రాష్ట్ర కోశాధికారి పదవిలో కూడా కొనసాగారు.కాంగ్రెస్ తో తనకున్న పరిచయాలు, సంబంధాలతో తమ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం లోపాయికారిగా పనిచేస్తున్నారని , అందుకే బీజేపీ శ్రేణుల్లో అభద్రతను, అయోమయాన్ని కలిగించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని బూర నర్సయ్య గౌడ్ వర్గం ప్రతి విమర్శలు చేస్తోంది. మొత్తంగా భువనగిరి నియోజకవర్గంలోని బీజేపీ సీనియర్ నాయకుల మధ్య జరుగుతున్న ఈ దాగుడుమూతలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిస్తుందన్న అభిప్రాయం పార్టీలోని తటస్థ వర్గం నుంచి వ్యక్తమవుతోంది.

## లోకసభ తర్వాత స్థానిక సమరం

## జూన్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు

హైదరాబాద్, ఏప్రిల్ 26 లోక్‌సభ ఎన్నికల అనంతరం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ బాక్సులతో నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈమేరకు బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన సీళ్లు, చిరునామా ట్యాగ్‌లను మే 15లోగా ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఎస్‌ఈసీ ఆదేశించింది.తెలంగాణలో సర్పంచుల పదవీకాలం గత ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది.

మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పదవీకాలం జూలై 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎస్‌ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు స్పీడప్ చేసింది.ఇక, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను కూడా రాష్ట్ర ఎన్నిల సంఘం ఇప్పటికే సేకరించింది. తాజాగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో మొదటి నుంచి పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ బాక్సులతోనే నిర్వహిస్తోంది. ఈసారి కూడా అదే రీతిలో జరిపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ బ్యాలెట్ బాక్సులకు కాగితపు సీళ్లు, చిరునామా ట్యాగ్‌లు అంటించాల్సి ఉంది. దీనికోసం వాటి ముద్రణ చేపట్టాలని నిర్ణయించింది. పేపర్ సీళ్లతోపాటు పోలింగ్ కేంద్రం, గ్రామం, మండలం, జిల్లాలను సూచించే ట్యాగ్‌లను ఆంగ్ల, తెలుగు భాషల్లో ముద్రించాలని నిర్ణయించింది. వీటిని హైదరాబాద్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సూచించింది.లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జూన్ నాలుగో తేదీతో ముగుస్తుంది. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వీలుంది. తేదీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో ఇప్పటికే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కసరత్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే జూన్‌లో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రెండు మూడు నెలల వ్యవధిలో అభిప్రాయ సేకరణ చేసి నివేదిక సమర్పించే అవకాశం ఉంది. దీనిని ప్రభుత్వం ఆమోదించి రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంటుంది

## మోడీపై ఈసీ చర్యలు తీసుకోవాలి

గాంధీ భవన్ ఎలక్షన్ కమిషన్ వైఖరి పై సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ అసంతృప్తి వ్యక్తం చేసారు. మోడీ మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు పై దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేశారు. ఈసీ పట్టించుకోలేదు. మోడీ వ్యాఖ్యలకు మోడీ కి నోటీసులు ఇవ్వకుండా బీజేపీ అధ్యక్షుడికి ఈసీ నోటీసులు ఇచ్చింది. మోడీని రక్షించేందుకు ఈసీ ప్రయత్నం చేస్తోంది. విధులు సరిగా నిర్వహించలేదని అధికారులపై ఈసీ చర్యలు తీసుకుంది. మోడీ పై ఎందుకు చర్యలు తీసుకోలేదు. మోడీ పై చర్యలు తీసుకోకుంటే,అధికారులపై కూడా చర్యలు తీసుకోవద్దు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ చూస్తుందని అన్నారు. బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తా మని చెప్తున్నారు.

## బలప్రదర్శనలుగా మారిన నామినేషన్లు

అనంతపురం, ఏప్రిల్ 26 న్నికల నియమావళిలో నామినేషన్ల ఘట్టం చాలా కీలకమైనది అభ్యర్థులు తమ బలాన్ని నిరూపించుకునేందుకు నామినేషన్ల ఘట్టాన్ని వేదికగా చేసుకున్నారు. వేలాదిగా జన సమీకరణను చేసుకునేందుకు లక్షలు వెచ్చించి భారీ ర్యాలీలు నిర్వహిస్తూ నామినేషన్ దాఖలు చేశారు. ఈ జన సమీకరణలతో అభ్యర్థుల గెలుపు ఓటముల గురించి అంచనాకు వస్తారని అభిప్రాయం రాజకీయ విశ్లేషకులు నుంచి వ్యక్తం అవుతుంది. ప్రతి నియోజకవర్గంలో కూడా ఈ సీన్‌లు కనిపించాయి.సాధారణ ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీ పార్లమెంటు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు సంబంధించిన రిటర్నింగ్ అధికారుల వద్ద తమ నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ముఖ్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, కాంగ్రెస్ నేతల నామినేషన్ల ప్రక్రియలో పోటీ పడి మరి నామినేషన్లు దాఖలు చేశారు.

జన సమీకరణ మొదలుకొని భారీ వాహనాలతో ర్యాలీలు.. తమ అభిమాన నేతలకు గజమాలలు ఇలా అడుగడుగునా హంగూ ఆర్భాటాలు కనిపించాయి. నామినేషన్‌కు తరలివచ్చిన కార్యకర్తలు, జనం కోసం అభ్యర్థులు భారీగానే ఖర్చు పెట్టారు. ఈ నామినేషన్ దాఖలు చేయడానికి ఒక్కో అభ్యర్థి 10 నుంచి 20 లక్షల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ ఎన్నికలు తెలుగుదేశం, వైఎస్ఆర్సిపికి ప్రతిష్టాత్మకంగా మారాయి. మధ్యలో కాంగ్రెస్ సైతం భరిలో ఉన్నామంటూ సంకేతాలు పంపిస్తోంది.ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేతలు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. దీని కోసం జన సమీకరణ చేపట్టారు.

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ భారీ ఎత్తున నగరంలో ర్యాలీ నిర్వహించి వారి నామినేషన్లను దాఖలు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో మొదటగా సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.. మరుసటి రోజు మాజీ మంత్రి పరిటాల సునీత పోటీగా ఇద్దరు నేతలు పెద్ద ఎత్తున జన సమీకరణతో బల ప్రదర్శన నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎంపీ తల్లారి రంగయ్య వైయస్సార్సిపి నుంచి అసెంబ్లీ బరిలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా అమిల్నేని సురేంద్రబాబు బరిలో దిగుతున్నారు.

వీరు కూడా నియోజకవర్గంలో తమ బలాన్ని నియోజకవర్గ ప్రజలకు తెలియజేయడానికి భారీ ఎత్తున జన సమీకరణ చేసుకొని వారి నామినేషన్లు దాఖలు చేశారు.తాడిపత్రి నియోజకవర్గంలో కూడా ఇదే పంతాలో నామినేషన్ల పర్వం కొనసాగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దారెడ్డి.. కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నేత జెసి ప్రభాకర్ రెడ్డి తనయుడు జెసి అస్మిత్ రెడ్డి భారీ ర్యాలీతో బయలుదేరి వారి నామినేషన్లను దాఖలు చేశారు. హిందూపురంలో సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి కురువ దీపికా రెడ్డి సైతం బల నిరూపణతోనేనామినేషన్లు దాఖలు చేశారు. పెనుగొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి నేత ఉషశ్రీ చరణ్ కూటమి అభ్యర్థిగా సవితమ్మ భారీ జన సమీకరణ పోగేసి పెద్ద ఎత్తున పెనుగొండ నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహించి మరి నామినేషన్ దాఖలు చేశారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున సామాన్యుడు వీర లక్కప్ప సైతం ఆ పార్టీ శ్రేణులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు టిడిపి రెబల్ అభ్యర్థి డాక్టర్ సునీల్ సైతం 5000 మందితో భారీ ర్యాలీ నిర్వహించి రెబల్ అభ్యర్థిగా తన నామినేషన్ను దాఖలు చేశారు. కూటమి అభ్యర్థిగా ఎమ్మెస్ రాజు కూడా నామినేషన్ను దాఖలు చేశారు. గుంతకల్లు నియోజకవర్గంలో నువ్వా నేనా అన్నట్లు ఇరు పార్టీల నేతలు సైతం ఒకరిని చూసి ఒకరు తమ బల ప్రదర్శనను నిరూపించుకున్నారు. మొదటగా వైఎస్ఆర్సిపి నుంచి టిడిపిలోకి వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం భారీ ఎత్తున కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి తన నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అంతకుమించి అన్నట్లు భారీ జన సమీకరణతో వచ్చి తన నామినేషన్ దాఖలు చేశారు. ధర్మవరం నియోజకవర్గంలోనూ కూటమి అభ్యర్థి బిజెపి నేత సత్యకుమార్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి తమ ప్రజా బలాన్ని చూపిస్తూ నామినేషన్లను దాఖలు చేశారు.ఇలా నియోజకవర్గాల్లో తమ బల ప్రదర్శన నిరూపించుకునేందుకు నామినేషన్ ఘట్టాన్ని ఆయా పార్టీ నేతలు వేదికగా చేసుకొని నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం బహిరంగ సభలు నిర్వహించి ప్రత్యర్థి పార్టీలపై మాటల తూటాలు పేలుస్తూ తమ ప్రచారాల్ని ముందుకు కొనసాగిస్తున్న పరిస్థితి చూస్తున్నాం.

## రాముడి ఫోటోతో ఓట్లు అడుగుతున్నారు



హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. తరువాత మండల కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో మంత్రి పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి గా మే 13 న జరిగే ఎన్నికల్లో వెలిచల రాజేందర్ ని గెలిపించండి. మీ ఆశీర్వాదం తో హుస్నాబాద్ ఎమ్మెల్యే అయ్యాను. మీకు ఏ కష్టం వచ్చినా మీకు అండగా ఉన్న.. నేను పోటీ చేసినప్పుడు ఈ నియోజకవర్గంలో 7 మండలాలు ఉంటే చిగురు మామిడి మండలంలో నాకు అత్యధిక మెజారిటీ ఇచ్చింది .ఇప్పుడు కూడా ఈ మండలం అలాంటి మెజారిటీ అందించాలి..కాంగ్రెస్ వచ్చిన తరువాత ఏం చేసిందన్న దానిపై ధైర్యంగా బిఆర్ఎస్, బీజేపీ నేతలు వస్తె చెప్పండి .2004-14 మధ్య మా ప్రభుత్వం అన్నీ హామీలు అమలు చెశాం. మళ్ళీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసి లో ఉచిత ప్రయాణం అందిస్తున్నాం.500 కి గ్యాస్ అందిస్తున్నాం.200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం.నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ 10 లక్షలు చేశాం. కొత్తగా రేషన్ కార్డులు ఇస్తున్నాం. ఆగస్టు 15 లోపు రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తాం . ఛాలెంజ్ చేసే వాళ్ళు రాజీనామా పత్రాలతో సిద్ధంగా ఉండండి .



వచ్చే వర్ష కాలంలో వరి కి 500 బోనస్ ఇస్తాం. పెన్షన్ ను 4000 లు పెంచుతాం . అసెంబ్లీ లో లెక్కలు చూస్తే గల్లా గురుగి ఖాళీ అయింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 60 వేల కోట్ల అప్పు ఉంటే..ఇప్పుడు 7 లక్షల కోట్ల అప్పు చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్న... పథకాలు అమలు చేస్తున్నాం. అక్కా చెల్లెలకు ఎన్ని ఇబ్బందులు వచ్చిన ఆర్టీసి లో ఉచిత ప్రయాణం కంటిన్యూ చేస్తాం. మీరు డబుల్ బెడ్రూం కట్టిన ఊర్లలో మేము ఓట్లు అడగం. మేము 2004-14 మధ్య ఇందిరమ్మ ఇల్లు కట్టిన ఊర్లలో మీరు ఓట్లు అడగద్దు . కాంగ్రెస్ అధికారంలోకి వస్తె సంపద అంతా ముస్లింలకు పంచుతామని అబద్ధాలు ఆడుతున్నారు. 11 లక్షల కోట్లు అదానీ , అంబానీ లాంటి కార్పొరేట్లుకు రుణాల రూపంలో పంచి పెట్టారు . అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పేదలకు పంచి పెడతాం. రాముడి కళ్యాణం దేశమంతా అయింది. పెళ్లి తరువాత అక్షింతలు ఇస్తారు ...మరి పెళ్లి కాకముందే అక్షింతలు వచ్చాయా అని గుండు అడుగుతున్నాడు. అయోధ్య లో రాముడి విగ్రహం పెట్టకముందే అక్షింతలు వస్తున్నాయి. రాముడి ఫోటో పెట్టీ ఓట్లు అడుగుతున్నారు. గుళ్ళో దేవుడు ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి . బీజేపీ బిచ్చగాళ్ల ఫోటో లు పెట్టీ ఓట్లు అడుగుతున్నారని అన్నారు.

నరేంద్ర మోడీ ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలి. నల్ల చట్టాలు తెచ్చి రైతులను చంపితిరి .మీ ఎమ్మెల్యేను కరీంనగర్ లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి మరింత బలవంతుడికి చేయండి. మామ కొండూరు మెజారిటీ వస్తదా..హుస్నాబాద్ మెజారిటీ వస్తదా... సవాలు చేస్తున్నా. నాకు హుస్నాబాద్ లో మెజారిటీ ఇచ్చి నా గౌరవాన్ని కాపాడండి. మీరు ఎక్కడికి వెళ్లిన హుస్నాబాద్ అంటే మీ గౌరవం పెంచేలా చేస్తా అని చెప్పా. ప్రతి ఇంటా వెళ్లి చెప్పండి..కాంగ్రెస్ కి ఓటేయండి . మీకు చెప్పిన పనులు చేశా . నాకు 4 వేల పైన ఇచ్చిన ఈ మండలంలో ఇంకా మెజారిటీ తేవాలని కోరుతున్న రైతు రుణమాఫీ ,ఇందిరమ్మ ఇళ్లు ,రేషన్ కార్డులు,4000 పెన్షన్ లాంటివి భవిష్యత్ లో అన్ని చేస్తామని అన్నారు.

## అమరవీరుల హంతకుడు హరీష్ రావు

హైదరాబాద్ గన్ పార్క్ వద్ద ఎమ్మెల్సీ.. బల్మూర్ వెంకట్ మీడియాతో మాట్లాడారు. అమరవీరుల చావుకి కారణమైన హంతకుడు హరీష్ రావు. ఉద్యమ సమయంలో నిరుద్యోగులను,యువతను పొట్టనపెట్టుకున్న వ్యక్తి హరీష్ రావు. అలాంటి వ్యక్తి అమరవీరుల స్థూపం వద్దకు రావడం తో ఈ ప్రాంతం మైల పడింది. అందుకే పసుపు నీళ్లతో శుద్ధి చేయడం జరిగింది. 10 ఏళ్లుగా హరీష్ రావు కి బీఆర్ఎస్ నాయకులకు ఏనాడు అమరవీరుల గుర్తుకు రాలేదు. హరీష్ రావు టిఆర్ఎస్ లో ఒక జీతగాడు మాత్రమే. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసి తీరుతారు. హరీష్ రావు స్పీకర్ ఫార్మాట్లో కాకుండా రాజీనామా లేఖను రాజకీయం చేశారు. హరీష్ రావు రాజీనామా లేక వృధా కానివ్వను. ఆగస్టు 15 తర్వాత కచ్చితంగా రాజీనామాను ఆమోదింపజేసే బాధ్యత నేను తీసుకుంటానని అన్నారు.

శాసనసభ వ్యవహారాల మంత్రిగా పని చేసిన నువ్వు రాజీనామా ఎలా చేయాలో కూడా తెలీదా. ×కేవలం రాజకీయం కోసం వచ్చి డ్రామాలు అడుతున్నావు. ఆగస్ట్ 15 వ తేదీ లోగా 2లక్షల రుణమాఫీ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు బీఆర్ఎస్ రద్దు చేస్తారో లేదో కేసీఆర్ ని చెప్పామనండి. హరీష్ రావు, ఆగస్ట్ 15 తర్వాత మీ రాజీనామా ఆమోదం చెందేలా ఎమ్మెల్సీ గా నేను బాధ్యత తీసుకుంటాను. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే దొంగల వచ్చి వెళ్ళడం కాదు. పదేళ్లలో మీరు ఏం చేశారో చెప్పండి రండి ఎమ్మెల్సీ గా నేను మీకు సవాల్ విసురుతున్నానని అన్నారు.

## వీవీ ప్యాట్లు లెక్కించడం కుదరదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 ఈవీఎమ్, వీవీప్యాట్‌లపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. వీటిపై దాఖలైన అన్ని పిటిషన్‌లను తిరస్కరించింది. వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను ఇఎంలతో 100% సరిపోల్చాలంటూ వేసిన పిటిషన్‌లను కొట్టివేసింది. పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్విహించాలన్న పిటిషన్‌నీ తిరస్కరించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం ఇద్దరూ వేరువేరుగా ఈ పిటిషన్‌లపై తీర్పునిచ్చారు. తోపాటు మరో ఇద్దరు వేసిన పిటిషన్‌లను బుట్టదాఖలు చేసింది. ఇదే సమయంలో ఎన్నికల సంఘానికి కీలక సూచనలు చేసింది. ఇఎంలో పార్టీ గుర్తుల్ని లోడ్ చేసిన తరవాత సింబల్ లోడింగ్ యూనిట్‌ని సీల్ చేయాలని వెల్లడించింది. వాటిని కంటెయినర్లలో భద్రపరచాలని తెలిపింది. అభ్యర్థులు లేదా వాళ్ల ప్రతినిధులు ఆ సీల్‌పై సంతకం పెట్టాలని సూచించింది. ఈ సింబల్ లోడింగ్ యూనిట్స్ ఉన్న కంటెయినర్స్‌ని స్టోర్‌రూమ్‌లో ఈవీఎమ్‌లతో పాటు భద్రపరచాలని వెల్లడించింది. ఫలితాలు విడుదలైన తరవాత కనీసం 45 రోజుల పాటు ఉంచాలని తెలిపింది. సాధారణంగా ఎన్నికల ఫలితాలు విడుదలైన తరవాత ఈవీఎమ్‌లలోని మెమరీ సెమీకంట్రోలర్స్‌ని కాల్చేస్తారు. వీటిని మరోసారి ఇంజనీర్ల బృందం ప్రత్యేకంగా వెరిఫై చేయాలని సూచించింది. ఈవీఎమ్‌లు తయారు చేసిన కంపెనీలకు చెందిన ఇంజనీర్లే ఈ పని చేయాలని స్పష్టం చేసింది. ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ ప్రక్రియ చేపట్టొచ్చని స్పష్టం చేసింది. ఫలితాలు విడుదలైన వారం రోజుల్లోగా ఇలా రిక్వెస్ట్ పెట్టుకునే వెసులుబాటు కల్పించాలని సూచించింది."ఓ వ్యవస్థను గుడ్డిగా విమర్శించడం వల్ల అనవసరపు అనుమానాలు పెంచినట్టు అవుతుంది. విమర్శలు కూడా అర్థవంతంగా ఉండాలి. ప్రజాస్వామ్యం అంటేనే నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేసేలా వ్యవహరించకూడదు. వ్యవస్థపై నమ్మకం ఉంచి ప్రజాస్వామ్యాన్ని మనమే కలిసికట్టుగా బలోపేతం చేయాలి"

## తెలంగాణ కోసమే నేను పుట్టా

నల్గొండ, ఏప్రిల్ 26 తనను దేవుడు తెలంగాణ కోసమే పుట్టించారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజల గుండె చీలిస్తే కనిపించేది కేసీఆర్ అని.. కేసీఆర్ గుండె చీలిస్తే కనిపించేది తెలంగాణ ప్రజలు అని వ్యాఖ్యానించారు. కేసీఆర్.. అర్వపల్లి, తిరుమలగిరి, జనగాం మీదుగా భువనగిరి చేరుకున్నారు. మార్గమధ్యలో పలు చోట్ల కార్యకర్తలు ప్రజలకు అభివాదం చేశారు.. మొత్తం మూడు పార్టీలు పోటీలో ఉన్నాయి. పిచ్చిగా ఉన్మాదంతో కాకుండా ఏపార్టీకి ఓటు వేయాలో ఏ పార్టీ మనకోసం పనిచేస్తదో ఆలోచించి ఓటేయాలి. బీజేపీ మేకిన్ ఇండియా అంటూ పెద్ద పెద్ద నినాదాలు చేస్తూ ఒక్కటి అమలు చేస్తలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళల మీద దాడులు జరుగుతున్నాయి. డాలరు విలువ 83 రూపాయలకు పెరిగింది. ఒకపార్టీ దేవుని పేరు చెప్పి ఓట్లు అడుగుతంది.. ఇంకో పార్టీ దేవుని మీద ఒట్లు.. ఇదీ నడుస్తాంది. మనం అద్భుతంగా యాదాద్రిని నిర్మించుకున్నం కానీ ఎన్నడూ ఓట్లకోసం వాడుకోలే. భువనగిరిలో బీజేపీ కాంగ్రెస్ మిలకత్ అయినయి. అక్షింతలు తీర్థాలు మన పిలగాన్ల కడుపునింపుతదా? తలకాయ తెగిపడ్డా కరెంటు మోటార్లకు మీటర్లు పెట్టనని చెప్పిన మోడీకి. కేంద్రం ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇయ్యలే. తెలంగాణకు అన్యాయం చేసింది బీజేపీ. ఇప్పుడు యువత భవిష్యత్తు మీదే ఆలోచించాలి. మన శత్రువే కాంగ్రెస్ పార్టీ. నాడు ఎవ్వడు లేకున్నా తెలంగాణ కోసం కొట్లాడి తెలంగాణ తెచ్చుకుని పదేండ్లు నడిపినాం. తల్లికొడివలే అందరినీ కాపాడుకున్నాం. మొదటి సంవత్సరంలోనే చెడిపోయిన కరెంటును బాగుచేసుకున్నాం. రైతులకు రైతుబంధు ఇచ్చుకున్నాం. బసవపురం రిజర్వాయర్ కట్టుకున్నం. కాంగ్రెస్ పెద్దలు ఐదెకరాలకు రైతుబంధు ఇస్తామంటున్నారు. మరి ఆరో ఏకరం వాడు ఎటుపోవాలి? పొలాలను ఎండబెట్టింర్రు. బోర్లు ఎండినాయి పూడికలు తీసే క్రేన్లు మల్లోచ్చినాయి. ధాన్యం కొంటలేరు. రాత్రిపూట మోటర్ పెట్టి పాము కాట్లకు సచ్చే దుర్మార్గపు పాలన కాంగ్రెస్ ది. కేసీఆర్ పొంగనే కట్క బంజేసినట్టే నీళ్లు ఆగినాయి కరెంటు ఆగింది.

# సినిమా



## భర్త ఎవరో చెప్పేసిన ఇలియానా?



మొదటి సినిమాను సూపర్ హిట్ కావడంతో ఆ తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంటూ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్గా మారిపోయింది ఇలియానా. ఇక ఈ అమ్మడి కొంటె చూపులకు కుర్ర కారు డమాల్ అంటూ ఇక ఈమెతో ప్రేమలో పడిపోయారు. ఇక పగటి కలల్లో మునిగిపోయారు అని చెప్పాలి. ఇలా దాదాపు ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలు అందరితో సినిమాలు చేసిన ఇలియానా ఆ తర్వాత ఒక్కసారిగా ఇండస్ట్రీకి దూరమైంది. బాలీవుడ్లో అవకాశాల కోసం ట్రై చేసిన అక్కడ అదృష్టం కలిసి రాలేదు. అయితే మధ్యలో ఫిట్నెస్ పై దృష్టి పెట్టకపోవడంతో బాగా లావు అయింది. దీంతో అవకాశాలు కూడా తగ్గాయ్.ఇక రవితేజతో అమర్ అక్బర్ ఆంటోనీ అనే సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చిన ఇలియానాకు కలిసి రాలేదు. అయితే గత కొంతకాలం నుంచి ఈ ముద్దుగుమ్మ సినిమాలతో కాకుండా ఓ పర్సనల్ విషయంతో వార్తలు తెగ హాట్ టాపిక్ గా మారిపోతుంది. అప్పటికే బ్రేకప్ అయ్యి డిప్రెషన్ లో మునిగిపోయిన ఇలియానా.. ఆ తర్వాత తాను ప్రెగ్నెంట్ అని చెప్పి అందరికీ షాక్ ఇచ్చింది. అయితే భర్త ఎవరో చెప్పకుండానే గత ఏడాది ఆగస్టులో ఈ హీరోయిన్ బిడ్డకు జన్మనివ్వడం చర్చనీయాంశంగా మారిపోయింది అన్న విషయం తెలిసిందే. అయితే యూఎస్ వ్యాపారవేత మైకేల్ డోలన్ ను ఇలియానా పెళ్లాడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఎట్టకేలకు తన పెళ్లిపై స్పందించింది ఇలియానా. భర్తతో తన వైవాహిక జీవితం ఎంతో సాఫీగా సాగిపోతుందని.. డోలన్ తనకు ఎంతో సపోర్టుగా నిలిచాడని.. కష్ట కాలంలో తనకు తోడుగా ఉన్నాడు అంటూ ఇలియానా చెప్పుకొచ్చింది.

## హిట్టు కోసం మన తెలుగు డైరెక్టర్ పై భారం?




బాలీవుడ్ స్టార్ హీరోషాహిద్ కపూర్ తో సినిమా చెయ్యడానికి వంశీ పైడిపల్లి ట్రై చేస్తున్నారని సమాచారం తెలుస్తుంది. ఇటీవల హీరోని కలిసి ఓ కథ నేరేట్ చేశారని, అది ఆయనకు నచ్చడంతో సినిమా చేద్దామని చెప్పారని టాక్.అయితే షాహిద్ కపూర్, వంశీ పైడిపల్లిని స్టార్ ప్రొడ్యూసర్ 'దిల్' రాజు కలిపారట.ఆయనతో దర్శకుడు దిల్ రాజుకి మంచి రిలేషన్షిప్ ఉంది. 'మున్నా' మూవీతో వంశీ పైడిపల్లిని దర్శకుడిగా ఇంట్రడ్యూస్ చేసింది దిల్ రాజే. ఆ తర్వాత 'బృందావనం', 'ఎవడు', 'మహర్షి', 'వారిసు' సినిమాలు వాళ్ల వీరి కలయికలో వచ్చాయి. వంశీ పైడిపల్లి తీసిన ఒక్క 'ఊపిరి'కి తప్ప మిగతా అన్ని సినిమాల నిర్మాణంలో దిల్ రాజు ఉన్నారు. ఇక షాహిద్ కపూర్ హీరోగా హిందీలో 'జెర్సీ'ని రీమేక్ చేశారు. ఇద్దరితో పరిచయం ఉండటంతో మీటింగ్ ని ఎరేంజ్ చేసి ప్రాజెక్ట్ సెట్ చేశాడు.ఇక షాహిద్ కపూర్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు, శిరీష్ ప్రొడ్యూస్ చెయ్యనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. తెలుగు డైరెక్టర్లతో చేసిన సినిమాలతో హిందీలో షాహిద్ కపూర్ భారీ బ్లాక్ బస్టర్ అందుకోవడం లేదంటే పెర్ఫార్మన్స్ విషయంలో పేరు తెచ్చుకోవడం జరిగింది. విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి' మూవీని హిందీలో ఆయన రీమేక్ చేశారు. ఇక ఆ సినిమాకు భారీ కలెక్షన్స్ వచ్చాయి. హిందీలో 'జెర్సీ' సినిమా అయితే అంతగా కమర్షియల్ సక్సెస్ కాలేదు. థియేటర్స్ దగ్గర కలెక్షన్స్ రాబట్టడంలో ఈ సినిమా ఫెయిల్ అయ్యింది.

## హీరోని కొట్టడానికి భయమేసింది



మృనాల్ ఠాగూర్.. ఈ అమ్మడు గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. ఈ మధ్యకాలంలో అయితే ఇండస్ట్రీలో కాస్త గట్టిగానే ఈ హీరోయిన్ పేరు వినిపిస్తుంది. సీతారామం అనే సినిమాతో సెన్సేషనల్ విజయాన్ని దక్కించుకున్న మృనాల్ ఠాగూర్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్గా ఎదిగింది అన్న విషయం తెలిసిందే. ఇక టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో ఎంతో మంది దర్శకులకు ఈ ముద్దుగుమ్మ మొదటి ఆప్షన్ గా మారిపోయింది. ఇక ప్రస్తుతం వరుసగా సినిమా అవకాశాలు అందుకుంటూ బిజీ హీరోయిన్గా కొనసాగుతుంది మృనాల్ ఠాగూర్. మొన్నటికి మొన్న అటు న్యాచురల్ స్టార్నాని సరసన హాయ్ నాన్న అనే సినిమాలో నటించిన మృనాల్ ఠాగూర్ మంచి విజయాలు సొంతం చేసుకుంది. అదే సమయంలో ఇక ఇటీవల విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టార్ అనే మూవీలో నటించి.. తన అంతం అభినయంతో ఆకట్టుకుంది. ఇక ఈ మూవీ కూడా మంచి విజయాన్ని సాధించింది అన్న విషయం తెలిసిందే. అయితే కేవలం సౌత్ ఇండస్ట్రీలోనే కాదు అటు బాలీవుడ్ లో కూడా వరుసగా అవకాశాలు అందుకుంటుంది ఈ హీరోయిన్. అయితే నాని హీరోగా నటించిన జెర్సీమూవీహిందీ రీమేక్ లో షాహిద్ కపూర్ సరసన నటించి సూపర్ హిట్ ను ఖాతాలో వేసుకుంది మృనాల్ ఠాగూర్. ఈ క్రమంలోనే ఇటీవలే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక ఆసక్తికర విషయం అభిమానతో పంచుకుంది. షూటింగ్లో భాగంగా తన అభిమాన హీరోషాహిద్ కపూర్ ను కొట్టాలంటే తనకు ఎంతగానో భయమేసింది అంటూ మృనాల్ ఠాగూర్ చెప్పుకొచ్చింది. జెర్సీ సినిమాలో షాహిద్ కపూర్ తో కలిసి నటించా. నేను ఆయనకు వీరాభిమానిని. తొలిరోజు షూట్లో ఆయననే చూస్తూ ఉండిపోయాను.

## చిక్కుల్లో మిల్కీ బ్యూటీ..!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్తమన్నా గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. దాదాపుగా 20 ఏళ్లకు పైగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా కొనసాగుతోంది.టాలీవుడ్ తో పాటు బాలీవుడ్ కి కూడా ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్గా దూసుకుపోతోంది. అయితే తాజాగా తమన్నా చిక్కుల్లో పడింది అన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే తమన్న కి మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ఐపీఎల్ 2023 మ్యాచ్లను నిబంధనలకు విరుద్ధంగా ఫైర్ ప్లే యాప్ లో ప్రత్యక్ష ప్రసారం చేసినందుకు తమన్నాను ఈనెల 29న విచారణకు రావాల్సిందిగా నోటీసులు పంపించినట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తమన్న చేసిన ఈ పనికి కోట్లాది రూపాయల్లో నష్టం జరిగింది అని ఫిర్యాదు చేశారు. ఐపీఎల్ డిజిటల్ ప్రసార హక్కులను వయాకామ్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. వయాకామ్ ఫిర్యాదుపై మహారాష్ట్ర సైబర్ సెల్ ఫెయిర్ప్లే యాప్పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ విషయంపై మరింత దర్యాప్తు చేయడానికి భాటియాను విచారించడానికి సమన్లు పంపింది. తమన్నా భాటియా ఫెయిర్ప్లేను ప్రమోట్ చేసిందని, అందుకే ఆమెను సాక్షిగా విచారణకు పిలిచారని వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇదే కేసులో సీనియర్ నటుడు సంజయ్ దత్కి కూడా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23న విచారణకు హాజరు కావాల్సి ఉన్నా.. గైర్హాజరయ్యారు. ఆ రోజు తాను ముంబైలో లేదని పేర్కొన్నారు.

## లక్కీ ఛాన్స్ కొట్టేసిన శ్రీలీలా?



శ్రీలీలా.. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా కొనసాగుతోంది. పెళ్లి సందడి అనే చిన్న సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ ఇక మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.అంతేకాదు తనలో ఉన్న టాలెంట్ ఏంటో అందరికీ అర్థమయ్యేలా చేసింది. తన అందం అబినయంతో ఆకట్టుకోవడమే కాదు ఇక డాన్సులతో అందరిని ఫిదా చేసేసింది ఈ ముద్దుగుమ్మ. తన కొంటె చూపులతో కుర్ర కారు మతి పోగొట్టేసింది. అయితే పెళ్లి సందడి సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంటూ బిజీ హీరోయిన్గా మారిపోయింది శ్రీ లీల. ఇప్పటికే టాలీవుడ్ లో ఉన్న ఎంతోమంది స్టార్ హీరోలతో జోడి కట్టిన ఈ ముద్దుగుమ్మ.. బ్లాక్ బస్టర్ హిట్లను ఖాతాలో వేసుకుంది అని చెప్పాలి. అయితే శ్రీ లీల నటిస్తున్న మరికొన్ని సినిమాలు కూడా ప్రేక్షకులు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే ఈ హాట్ బ్యూటీ కి సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయింది. దళపతివిజయ్ హీరోగా నటిస్తున్న సినిమాలో శ్రీ లీలా ఛాన్స్ కొట్టేస్తుందట. అదేంటి ఈ సినిమాలో ఆల్రెడీ వేరే హీరోయిన్ సెలెక్ట్ చేశారు కదా అంటారా.. అయితే హీరోయిన్ పాత్ర కోసం కాదు ఏకంగా ఒక స్పెషల్ సాంగ్ కోసం ఛాన్స్ దక్కించుకుందట శ్రీలీల. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరోదళపతివిజయ్ గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం అనే సినిమాలో నటిస్తున్నాడు అన్న విషయం తెలిసిందే. ఇక ఈ మూవీలో స్టార్ హీరోయిన్శ్రీ లీల స్పెషల్ అప్పీరియన్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఒక ఐటమ్ సాంగ్ లో దళపతివిజయ్ తో కలిసి కాలు కదపబోతుందట ఈ ముద్దుగుమ్మ. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇకపోతే వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుంది అన్న విషయం తెలిసిందే.

## వరలక్ష్మి శరత్ కుమార్ షాకింగ్ కామెంట్స్



నటి వరలక్ష్మి శరత్ కుమార్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. అయితే తాజాగా ఇప్పుడు వరలక్ష్మి శరత్ కుమార్ ఫిమేల్ లీడ్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా శబరి. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమా తెలుగులోనే కాకుండా తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో కూడా విడుదల కాబోతోంది. ఈ క్రమంలోనే వరలక్ష్మీ శరత్ కుమార్ నటిస్తున్న ఈ సినిమా విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే తాజాగా వరలక్ష్మి శరత్ కుమార్ ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. పలు సంచలన విషయాలను వెల్లడించింది. దీంతో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇందులో భాగంగానే వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఈ సినిమాకి సంబంధించిన కథను విని కచ్చితంగా ఈ సినిమా చేస్తాను అని ఒప్పుకున్నాను.. కానీ షూటింగ్ స్టార్ట్ చేయడం మాత్రం కొంచెం ఆలస్యమైంది.. ఇకపోతే ఈ సినిమా ఒక సైకలాజికల్ ఇందులో నేను తల్లి పాత్ర పోషించాను భర్తతో సమస్యల కారణంగా అతని నుండి వేరుగా ఉంటూ కుమార్తెను ఒంటరిగా పెంచే ఒక తల్లి పాత్ర నాది అంటూ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది వరలక్ష్మి శరత్ కుమార్. సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ చేసే అవకాశం లభించింది. లౌడ్ మూమెంట్స్ ఉండవు. ఓ సమస్య నుంచి కూతురిని కాపాడుకోవడానికి తల్లి పడే తపన అందరికీ నచ్చుతుంది. మదర్ అండ్ డాటర్ కనెక్షన్ హైలైట్ అవుతుంది. స్క్రీన్ప్లే డ్రివెన్ సినిమా ఇది. ప్రేక్షకులకు కొత్త థ్రిల్ను ఇస్తుంది. నేచురల్ ఫైట్ సీక్వెన్సులు ఉంటాయి. కొత్త దర్శక నిర్మాతలతో సినిమా చేయడం కొందరు రిస్క్ అంటున్నారు. కానీ నేను లైఫే రిస్క్ అంటాను. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు.



# క్రీడలు



## మరోసారి సంజూకి నిరాశ తప్పదా?



జూన్ నెలలో ప్రపంచ కప్ టోర్ని ప్రారంభం కాబోతుంది. వెస్టిండీస్ యుఎస్ వేదికలక ఏఐసిసి టోర్నీ జరగబోతుంది అన్న విషయం తెలిసిందే. అయితే ఈ టి20 ప్రపంచ కప్ లో విజేతగా నిలవడమే లక్ష్యంగా అన్ని దేశాల క్రికెట్ బోర్డులు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయ్.అయితే గత కొంతకాలం నుంచి వరల్డ్ కప్ గెలవడంలో ప్రతిసారి నిరాశ పరుస్తున్న టీమిండియా జట్టు ఇక ఈసారి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వరల్డ్ కప్ గెలవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే అత్యుత్తమ జట్టుతో బరిలోకి దిగడానికి సిద్ధమవుతుంది అని చెప్పాలి.అయితే ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్లో బాగా రాణించిన ప్లేయర్లకి అటు వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది అని ఎంతో మంది మాజీ ఆటగాళ్లు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఐపీఎల్ లో ఎంతో మంది ప్లేయర్లు అద్భుతంగా రానిస్తున్న నేపథ్యంలో.. పోటీ కూడా తీవ్రస్థాయిలోనే ఉంది. దీంతో ఎవరికి చోటు దక్కుతుంది అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది అని చెప్పాలి. అయితే గత కొంతకాలం నుంచి బాగా రాణిస్తున్న వరల్డ్ కప్ సమయానికి సంజును పక్కన పెడుతూ వస్తున్నారు సెలెక్టర్లు. అయితే ఈసారి అతను కెప్టెన్ గా ఆటగాడిగా కూడా సక్సెస్ అవుతున్నాడు. దీంతో అతనికి వరల్డ్ కప్ లో చోటు దక్కడం ఖాయం అని అందరూ అనుకుంటున్నారు. కానీ టీమ్ ఇండియా క్రికెటర్ సంజూకు మరోసారి మొండి చెయ్యి ఎదురయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది.ా20 వరల్డ్ కప్ లో పాల్గొనబోయే భారత జట్టులో వికెట్ కీపర్గా కేఎల్ రాహుల్ను తీసుకునేందుకు సెలెక్టర్లు మొగ్గు చూపినట్లు సమాచారం.

## క్రికెట్ అనలిస్ట్ షాకింగ్ కామెంట్స్?



ప్రస్తుతం ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులు అందరూ కూడా మరో నెల రోజుల్లో ప్రారంభం కాబోయేా20 వరల్డ్ కప్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అన్న విషయం తెలిసిందే. ఎందుకంటే జూన్ నెలలో ప్రారంభం కాబోయే వరల్డ్ కప్ లో ఈసారి విశ్వవిజేతగా నిలవబోయే టీం ఏది అన్నది ఆసక్తికరంగా మారిపోయింది. అయితే అన్ని దేశాల క్రికెట్ ప్రేక్షకులు కూడా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. కాగా వరల్డ్ క్రికెట్లో పటిష్టమైన జట్లలో ఒకటిగా కొనసాగుతున్న టీమిండియాకు గత కొంతకాలం నుంచి వరల్డ్ కప్ టైటిల్ గెలవడం అనేది కేవలం కలగానే మారిపోయింది అన్న విషయం తెలిసిందే. కొన్ని ప్రపంచకప్ టోర్నిలలో సెమీఫైనల్ ఫైనల్ వరకు చేరుకున్నప్పటికీ చివరి అడుగులో తడబడుతూ చివరికి టైటిల్ను చేజార్చుకుంటుంది. గత ఏడాది ఇండియా వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ టోర్నీలో కూడా ఇదే జరిగింది. అయితే జూన్ నెలలో ప్రారంభం కాబోయే టి20 వరల్డ్ కప్ లో మాత్రం తప్పక విజయం సాధించి విశ్వవిజేతగా నిలవాలని అనుకుంటుంది భారత జట్టు. ఇక అత్యుత్తమ టీం తో బరిలోకి దిగేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటుంది. కాగా వరల్డ్ కప్ జట్టుకి కెప్టెన్గా రోహిత్ శర్మ వ్యవహరించబోతున్నాడు అన్న విషయం తెలిసిందే. రోహిత్ సారథ్యంలో ఈసారి టీమిండియా వరల్డ్ కప్ గెలవడం ఖాయమని అందరూ అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి సమయంలో క్రికెట్ ఆనలిస్ట్ జోయ్ బట్టచార్య మాత్రం షాకింగ్ కామెంట్స్ చేశారు. టి20 వరల్డ్ కప్ కి కెప్టెన్ గా రోహిత్ శర్మ అవసరం లేదు అంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు ఆయన. రోహిత్ మంచి క్రికెటర్. కానీ ఇప్పుడు ఫామ్ లో లేదు.

## కోహ్లీ ఓ అరుదైన రికార్డు?



ప్రపంచ క్రికెట్లో ఎంతోమంది స్టార్ ప్లేయర్లు ఉన్నారు. అయితే అందరిలో రికార్డుల రారాజు ఎవరు అంటే మాత్రం ఒకే ఒక పేరు వినిపిస్తూ ఉంటుంది. అదే టీమ్ ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ గురించి.అందరిలాగానే అతను కూడా ఒక సాదాసీదా క్రికెటర్ గా అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. కానీ తన ఆట తీరుతో అతి తక్కువ సమయంలో తాను ఒక లెజెండ్ అన్న విషయాన్ని నిరూపించుకున్నాడు. ఇక ఇప్పుడు నేటి జనరేషన్ కి తనను మించిన లెజెండ్ మరొకరు లేరు అన్న విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా చేశాడు. ఇప్పటివరకు ఎంతోమంది దిగ్గజ ఆటగాళ్లు కెరియర్ కాలం మొత్తంలో సాధించిన రికార్డులను కోహ్లీ అతి తక్కువ సమయంలోనే బద్దలు కొట్టాడు. ఇక రికార్డుల విషయంలో నేటితరం క్రికెటర్లకు ఎవరికి అందనంత దూరంలో కొనసాగుతూ ఉన్నాడు అని చెప్పాలి. అయితే ఎన్ని రికార్డులు సాధించినప్పటికీ ఇంకా కోహ్లీలో ఇంకా ఏదో సాధించాలి అనే కసి మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ కూడా జట్టులోకి కొత్తగా వచ్చిన ఆటగాడిలాగా ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన చేసి ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు కోహ్లీ. ఇక రికార్డుల వేట కొనసాగిస్తూనే ఉన్నాడు. అయితే ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఇప్పటికే ఎన్నో రికార్డులు కొట్టిన కోహ్లీ సన్రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో మరో రికార్డు అందుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో 10 సీజన్స్ లో 400కు పైగా పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ నిలిచాడు. ఐపీఎల్ 2024 ముందు వరకు 9 ఐపీఎల్ సీజన్స్ లో కోహ్లీ 400 పరుగులు చేయగా.. ఇక ఇటీవల సన్రైజర్స్ తో మ్యాచ్లో ఈ ఏడాది సీజన్ లో కూడా 400 పరుగుల మార్కులు అందుకున్నాడు. దీంతో అరుదైన రికార్డు సృష్టించాడు.

## నేను ఆ మాట అనలేదు..



2024 ఐపీఎల్ సీజన్లో డిఫెండింగ్ ఛాంపియన్గా బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ పరవాలేదు అనిపిస్తుంది అన్న విషయం తెలిసిందే. ఈ సీజన్ ప్రారంభానికి ముందు మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో ఇక కొత్త కెప్టెన్ ఋతురాజు సారధ్యంలో ఆ జట్టు బరిలోకి దిగుతుంది.అయితే ధోని పూర్తిగా రిటైర్మెంట్ ప్రకటించకుండా జట్టులో కీలక ఆటగాడుగా కొనసాగుతూ ఉండడంతో ఇక ధోని ఆధ్వర్యంలో ఋతురాజ్ తన కెప్టెన్సీ తో ఆకట్టుకుంటున్నాడు అని చెప్పాలి. కాగా ఇప్పటివరకు 8 మ్యాచ్ లు ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నాలుగు విజయాలు సాధించి.. పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో కొనసాగుతూ ఉంది. అయితే ధోని కూడా అభిమానులు కోరుకున్నట్లుగానే ఈ సీజన్లో అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకుంటున్నాడు అన్న విషయం తెలిసిందే. ఇకపోతే ఇటీవలే లక్నోతో జరిగిన మ్యాచ్లో చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయింది. దీంతో అటు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీ పై విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో ఇదే విషయంపై ఒక చర్చ కూడా జరిగింది. గెలిస్తేనేమో ధోని వల్లే గెలిచింది అంటారు. ఓడిపోతే రుతురాజు ను నిందిస్తారా అంటూ నెటిజెన్స్ చర్చించటం కూడా మొదలుపెట్టారు. అయితే లక్నో చేతిలో సీఎస్కే ఓటమికి కెప్టెన్ రుతురాజు వైఫల్యమే కారణమని అంబటి రాయుడు కూడా కామెంట్ చేశాడు అంటూ కొన్ని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై అటు రాయుడు స్పందించాడు. ఆరోజు నేను కామెంటరీ చేయలేదు. నా తోటలో మామిడి పండ్లు కోస్తున్న. ఏదైనా రాసేటప్పుడు ముందు వెనక ఆలోచించండి. బాధ్యతగా వ్యవహరించండి. ఇలాంటివి వ్యాప్తి చేయకండి అంటూ కామెంట్ చేశాడు అంబటి రాయుడు.

## సన్రైజర్స్ అరదైన రికార్డ్?



సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు పై ఒకప్పుడు ఎవరికి పెద్దగా అంచనాలు ఉండేవి కాదు. ఇక టైటిల్ ఫేవరెట్ గా బరిలోకి దిగిన సన్రైజర్స్ బాగా రాణిస్తుంది అని నమ్మకం కూడా చాలా మందిలో ఉండేది కాదు.ఎందుకంటే కేవలం బౌలింగ్ విభాగంలో మాత్రమే పటిష్టంగా కనిపించే సన్రైజర్స్.. బ్యాటింగ్లో మాత్రం తేలిపోతూ ఉండేది. కానీ 2024 ఐపీఎల్ సీజన్లో మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఏకంగా మహామహా జట్లను సైతం వణికించే విధంగా సన్రైజర్స్ పటిష్టంగా మారిపోయింది. ఒకరకంగా బ్యాటింగ్ ఊచకోత అంటే ఎలా ఉంటుందో ఈ సీజన్లో సన్రైజర్స్ బ్యాటర్లు చూపిస్తున్నారు. ఏకంగా ప్రత్యర్థి బౌలర్లు ఎందుకు బౌలర్లం అయ్యామా అని బాధపడే విధంగా విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. ఏకంగా వీర విహారం చేస్తూ ఎన్నో రికార్డులను బద్దలు కొట్టేస్తూ ఉన్నారు. సన్రైజర్స్ ఆటగాళ్ల ఆట తీరు ముందు ఇక టి20 ఫార్మాట్లో ఉన్న అన్ని రికార్డులు దాసోహం అవుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక ఇప్పటికే ఐపీఎల్ హిస్టరీలో అత్యధిక పరుగుల రికార్డును హైదరాబాద్ జట్టు రెండు సార్లు బద్దలు కొట్టింది అన్న విషయం తెలిసిందే. ఇక ప్రతి మ్యాచ్ లోను ఇలాంటి ఆట తీరును కొనసాగిస్తుంది. అయితే ఇటీవల రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్ లో కాస్త తడబడిన హైదరాబాద్ జట్టు ఓటమి చూసింది. అయితే సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓడిపోయినప్పటికీ అటు అరుదైన రికార్డు మాత్రం ఖాతాలో వేసుకుంది. ఈ సీజన్లో ఏకంగా ఇప్పటివరకు 100 సిక్సర్లు బాదేసింది సన్రైజర్స్. ఇలా ఒక ఐపిఎల్ సీజన్లో ఇలా 100 సిక్సర్లు బాధటం ఆ జట్టుకు ఇదే తొలిసారి కావడం గమనార్హం. అంతకు ముందు 2022లో 97 సిక్సర్లు, 2016లో 89 సిక్సర్లు, 2018లో 88 సిక్సర్లు బాదింది సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు.

## ఇంకా ఆ ఖర్మ పట్టలేదు..



విదేశీ టీ20 లీగ్ల్లో ఆడేంత కర్మ భారత ఆటగాళ్లకు పట్టలేదని మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. భారత ఆటగాళ్లకు కావాల్సిన డబ్బు స్వదేశీ టోర్నీలతోనే వస్తుందని తెలిపాడు. ఆస్ట్రేలియా మాజీ ప్లేయర్ ఆడమ్ గిల్క్రిస్ట్తో ఓ పోడ్కాస్ట్ ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడిన సెహ్వాగ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భవిష్యత్తులో భారత ఆటగాళ్లు ఐపీఎల్ కాకుండా ఇతర టీ20 లీగ్ల్లో ఆడే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు సెహ్వాగ్ తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. 'భారత ఆటగాళ్లకు వీదేశీ క్రికెట్ లీగ్స్ ఆడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మేం చాలా సంపన్నులం. పేద దేశాలకు వెళ్లి ఆడాల్సిన కర్మ మాకు పట్టలేదు(నవ్వుతూ). భారత జట్టులో చోటు కోల్పోయినప్పుడు నాకు బిగ్ బాష్ లీగ్లో ఆడమని ఓ ఫ్రాంచైజీ నుంచి ఆఫర్ వచ్చింది. నేను ఎన్ని డబ్బులు ఇస్తారని అడిగాను. అందుకు వారి ఇచ్చిన సమాధానం విని ఆశ్చర్యపోయాను. వారు నాకు రూ. 84 లక్షలు ఇస్తామని చెప్పారు. వెంటనే నేను నవ్వుకొని అంతకంటే ఎక్కువ డబ్బులను నా హాలిడే ట్రిప్స్లో ఖర్చు చేస్తానని చెప్పాను. గత రాత్రి పార్టీ బిల్లు కూడా రూ. 84 లక్షలు ధాటిందని సమాధానం ఇచ్చాను. నేను కాదు భారత క్రికెటర్లందరిది ఇదే పరిస్థితి.'అని సెహ్వాగ్ తెలిపాడు. ఐపీఎల్ ద్వారానే భారత ఆటగాళ్లు కోట్ల రూపాయాలు ఆర్జిస్తున్నారు. ఇక బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లకు కోట్లలో వార్షిక వేతనం అందడంతో పాటు మ్యాచ్ ఫీజుల ద్వారా కూడా చాలా డబ్బు దక్కుతుంది. ఇవే కాకుండా ప్రముఖ కంపెనీల ఒప్పందాల ద్వారా భారత ఆటగాళ్లకు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. కొందరు ఆటగాళ్లు అయితే చాలా కంపెనీల్లో పెట్టు బడులు పెట్టారు. భారత క్రికెట్లో భాగమైన ఆటగాళ్లు వీదేశీ టీ20 లీగ్స్ ఆడేందుకు బీసీసీఐ అనుమతించదు. ఒకవేళ ఎవరైనా ఆటగాళ్లు విదేశీ లీగ్స్ ఆడాలనుకుంటే భారత క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించాలి. దేశవాళీ, అంతర్జాతీయ, ఐపీఎల్ టోర్నీలతో భారత ఆటగాళ్లు తీరిక లేని క్రికెట్ ఆడుతున్నారు.

# మెదక్ జిల్లాలోపార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి.

# మెదక్ పార్లమెంట్ పరిధిలో 54 మంది అభ్యర్థుల నామినేషన్ దాఖలు




మెదక్ ప్రాజబలం న్యూస్ :- స్యూటీని ద్వారా 53 అభ్యర్థుల నామినేషన్ ఆమోదించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్"

(01) ఇండిపెండెంట్ అభ్యర్థి కళ్ళు నరసింహులు గౌడ్ సంగారెడ్డి నామినేషన్ తిరస్కరణ

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం పూర్తయింది.

ఎన్నికల సాధారణ పరిశీలకులుగా సమీర్ మాధవ్ కుర్కోటి, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టగా.. పలు పార్టీల అభ్యర్థులు హాజరయ్యారు.

మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ కు54 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 53 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని(01) నామినేషన్ తిరస్కరించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ తెలిపారు.

. మెదక్ జిల్లా కలెక్టరేట్ లోని ఆర్. ఓ.కార్యాలయం లో శుక్రవారం కొనసాగుతున్న స్రూటినీ ప్రక్రియ...

స్రూటినీ లో అవలంబించనున్న విధానాలను నామినేషన్ వేసిన అభ్యర్థులకు తెలియజేసిన రిటర్నింగ్ అధికారి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అభ్యర్థులకు సూచించిన ఆర్. ఓ..

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కళ్ళు నరసింహులు గౌడ్ ఎన్నికల నియమావళి ప్రకారం కొత్త ఓటర్ల లిస్టు, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్, ప్రపోజల్స్ సరైన పత్రాలు సమర్పించని సందర్భంలో స్రూట్ నీలో భాగంగా నామినేషన్ను తిరస్కరించడం జరిగిందని వివరించారు. 53 మంది నామినేషన్లను ఆమోదించడం జరిగిందని చెప్పారు.

రేపు కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ఉంది కాబట్టి నామినేషన్ ఉపసంహరణకు చేసుకునేవారు. ఈరోజు 5 గంటల తర్వాత నుండి ఉపసంహరణ ఫామ్ సబ్మిట్ చేయవచ్చని, తదుపరి 29.04.202 సోమవారం సబ్మిట్ చేయాలని చెప్పారు.

అభ్యర్థి వ్యయానికి సంబంధించి సంబంధించిన పుస్తకాలు అభ్యర్థులకు అందజేయడం జరిగిందని నామినేషన్ వేసిన అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించినప్పుడు ముందస్తు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. అభ్యర్థుల ఖర్చులు ఆ అకౌంట్ ద్వారానే నమోదు చేయడం జరుగుతుందన్నారు

ఎలక్షన్ ఏజెంట్ రాండిమైజేషన్ ప్రక్రియలో హాజరుకావాలని అసెంబ్లీ కాన్స్టెన్సీ పరిధిలో పోలింగ్ స్టేషన్స్ అలాట్మెంట్ చేయడం జరిగిందని ఈవీఎం రిలేటెడ్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంటుందని హోమ్ ఓటింగ్ ప్రక్రియలో 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు 40% పైబడిన వికలాంగులకు ఫారం 12 డి అందజేయడం జరిగిందని ఏ రోజు ఎక్కడ హోమ్ వోటింగ్ జరుగుతుందనే పూర్తి వివరాలు లిస్ట్ అందజేయడం జరుగుతుందని బూత్ లెవెల్ ఏజెంట్ హాజరై ఓటింగ్ ప్రక్రియను పరిశీలించవచ్చని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఆర్డీవో నరసాపూర్, ఆర్డీవో మెదక్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పోస్టల్ ఓటింగ్ సెంటర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు .

ఈ ఓటింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందనే విషయాన్ని పరిశీలించవచ్చని అన్నారు ప్రతిరోజు నివేదికల మీద పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సంతకాలు చేయవలసి ఉంటుందనిఅన్నారు.

క్రిమినల్ కేసులు వివరాలు కి వస్తే ముగ్గురు అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఉన్నాయని రఘునందన్ రావు (బిజెపి) నీలం మధు( కాంగ్రెస్) వెంకటరామిరెడ్డి (బి ఆర్.ఎస్) మూడుసార్లు న్యూస్ పేపర్లో వారికి ఇచ్చిన %జ1,జ2,జ%3 ప్రొఫార్మాలు ప్రచురణ చేయాల్సి ఉంటుందని దానికి సంబంధించిన తేదీలు కూడా

వారికి నామినేషన్ పేపర్లు సబ్మిట్ చేసినప్పుడే చెప్పడం జరిగిందని అన్నారు ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించి నప్పుడు తప్పనిసరిగా ఏఆర్ఓ నర్సాపూర్, ఏఆర్ఓ మెదక్ 48 గంటల ముందు అనుమతి కొరకు సువిధ పోర్టల్ లో దరఖాస్తు చేయవలసి ఉంటుందని 24 గంటలు లోపు అనుమతి మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు అనుమతి లేకుండా ఎన్నికల నియమాలు ఉల్లంఘించి ఎటువంటి నిర్ణయాలు తీసుకున్న సంబంధిత అభ్యర్థిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు.

అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకులుగా సమీర్ మాధవ్ కుర్కోటి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు

మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించడానికి రిటర్నింగ్ అధికారి తీసుకుంటున్న చర్యలు ,చెక్పోస్టుల ద్వారా తనిఖీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల నమోదు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని ఇదే వరవడి కొనసాగించి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే విధంగా చూడాలన్నారు

ఈ కార్యక్రమంలో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.



## మ్యానిఫెస్టోకు అంతా సిద్ధం చేసినవైసీపీ

విజయవాడ, ఏప్రిల్ 26 ఏపీలో సీఎం జగన్ మేనిఫెస్టోపై ఫోకస్ పెట్టారు. పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రచారంలో జోరుమీద ఉన్నాయి. అయితే జగన్ ఇప్పటికే మేమంతా సిద్ధం అంటూ దాదాపు 21 రోజుల పాటు దాదాపు 60కి పైగా నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముగించారు. మరో జైత్రయాత్రకు సిద్ధమవుతున్న తరుణంలో మేనిఫెస్టోపై ఫోకస్ పెట్టారు. ఏప్రిల్ 27, శనివారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈరోజు పార్టీ ముఖ్యనేతలతో కలిసి సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వాటిపై సీనియర్ నాయకుల అభిప్రాయాలను సేకరించి తుదిమెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం. ఇలా సమావేశం అనంతరం రూపుదిద్దుకున్న హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి లక్ష్యాలను మేనిఫెస్టోగా తయారు చేసి ప్రజలకు తెలియజేయనున్నారు. గతంలో కంటే మెరుగైన విధంగా మేనిఫెస్టో రూపొందిస్తున్నట్లు సమాచారం. 2019-2024 మధ్య పొందిన లబ్ధిని మరింత పెంచేలా కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అలాగే గతంలో లాగానే మహిళలకు, యువతకు, రైతులకు ఇలా అన్ని వర్గాల వారికి గతంలో కంటే మరింత ఎక్కువ మేలు జరిగేలా రూపొందించనున్నట్లు సమాచారం. బడుగు బలహీన వర్గాలకు మరింత సంక్షేమం అందించడమే లక్ష్యంలా కనిపిస్తోంది. అయితే మొన్నటి ప్రచారంలో కూడా తాను అమలు చేయలేని హామీలను మేనిఫెస్టోలో ఉంచనని స్పష్టం చేశారు సీఎం జగన్. తమ పరిధికిలోపడి చేయదగినవి, ప్రజా ప్రయోజనం కలిగే వాటిని మాత్రమే మేనిఫెస్టోలో ఉంచనున్నట్లు తెలిపారు. జగన్ చెప్పాడంటే చేస్తాడంటే అనే నినాదాన్ని కూడా గతంలో జరిగిన బహిరంగ సభల్లో చెప్పారు. మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా భావిస్తున్నట్లు కూడా వివరించారు. ఏది ఏమైనా గత కొన్ని రోజులుగా మేనిఫెస్టో కోసం ఎదురు చూస్తున్న వారికి గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇప్పటికే టీడీపీ సూపర్ 6 పేరుతో అధికారంలోకి వస్తే చేసే సంక్షేమ పథకాలను గురించి ప్రజా గళం సభలో వివరించారు. అయితే వైసీపీ మేనిఫెస్టో ఇందుకు భిన్నంగా ఉంటుందా.. లేక గతంలో లాగానే ఉంటుందా అన్న ఉత్కంఠకు రేపటితో తెరపడనుంది.

## రైల్వే జోన్ బీజేపీ, వైసీపీ నేతల మాటల మంటలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 26 ల్వే జోన్ ను ఏర్పాటు చేయడాని" కేంద్రం సిద్ధంగా ఉన్నా అవసరమైన స్థలం ఇవ్వలేదన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపణలను బొత్స సత్యనారాయణ ఖండించారు. రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అడ్డంకులు అన్నీ తొలగించి రైల్వే జోన్ కోసం భూములు అప్పగించామన్నారు. మంత్రి పదవుల్లో ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలని బొత్స పీయూష్ గోయల్కు సూచించారు. మాట్లాడే ప్రతీ మాటకు నిబద్ధత ఉండాలన్నారు. పియుష్ గోయల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఇకపై మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని పీయూష్ గోయల్ కు సలహా ఇచ్చారు. 2014లో కూటమిలో బీజేపీ కూడా ఉందని అప్పుడు రైల్వే జోన్ ఎందుకు ఇవ్వలేదని బొత్స ప్రశ్నించారు.

2014-19 మధ్య కేంద్రంలో ఉంది సింగిల్ ఇంజిన్ ప్రభుత్వమా అని ప్రశ్నించారు. మధ్యలో ఒక ఇంజిన్ పని చేసిందా మరో ఇంజిన్ రిపేర్ అయ్యిందా అని సెటైర్లు వేశారు. పియూష్ గోయల్ ఏది పడితే అది మాట్లాడుతున్నారని అది కరెక్ట్ కాదన్నారు. విద్యాశాఖపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలన్నారు. నిజం లేదు గనుకే తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు అని బొత్స అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క అధ్యాపకుడు అయినా విద్యాశాఖ మంత్రిగా ఉన్న నాపై వేలు ఎత్తి చూపించ లేదని విద్యాశాఖ లో అవినీతి జరిగిందని చెప్పగలరా అని సవాల్ చేశారు. కేంద్రంలో మాపై ఆధారపడే పార్టీ రావాలని కోరుకుంటున్నామన్నారు. అలా వస్తే రాష్ట్రానికి రావాల్సిన ఇంకా కొన్ని ప్రయోజనాలు కోసం మాట్లాడవచ్చన్నారు. ప్రస్తుతం మనం అడిగితే పనులు అయ్యే పరిస్థితి కేంద్రంలో లేదన్నారు. కేంద్రం అన్నీ రాజకీయ కోణంలో ఆలోచిస్తుంది. అందుకే మనపై ఆధారపడే ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైఎస్సార్సీపీ పని చేస్తుందని.. మేలు జరిగే ప్రతీ అంశానికి మద్దతు ఇస్తామన్నారు. ఏది చేసినా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఏపీ అభివృద్ధికి ఎన్నో సహజ వనరులు ఉన్నాయని, ఈ ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పట్టించుకోలేదని పీయూష్ గోయల్ విమర్శించారు. కార్మికులు, రైతులు, యువతను అసలు పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ స్వార్థ ప్రయోజనాలే చూసుకున్నారని, శాండ్ , ల్యాండ్ , లిక్కర్ మాఫియాలతో కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన వేల కోట్ల నిధులు జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని, అనేక ప్రాజెక్టులలో అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్ ఇస్తామని విభజన చట్టంలో పెట్టారని, కానీ రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూములు జగన్ ప్రభుత్వం కేటాయించలేకపోయిందని ఎద్దేవా చేశారు. పంచాయతీలకు కేటాయించిన నిధులు దుర్వినియోగం చేశారన్నారు. గ్రామాల అభివృద్ధి లేకుండా జగన్ సొంత అవసరాలకు డబ్బులు వినియోగించారని, ఏపీని అన్ని విధాలా నాశనం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డని తీవ్రస్థాయిలో విమర్శించారు.

## చేవెళ్ల మ్యానిఫెస్టో రిలీజ్

హైదరాబాద్, ఏప్రిల్ 26చేవెళ్ల లోక్?సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా.. ఆయన చేవెళ్ల ప్రాంతానికి ప్రత్యేకంగా ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించి శుక్రవారం విడుదల చేశారు. తనను గెలిపించడం ద్వారా.. నియోజకవర్గ ప్రజలకు రాబోయే ఐదేళ్లలో చేయనున్న పనులను సంకల్ప పత్రం పేరిట ప్రజల ముందుకు తీసుకొచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలం అజీజ్ నగర్?లోని బీజేపీ కార్యాలయంలో ఆయన ఈ సంకల్ప పత్రాన్ని మీడియాకు వివరించారు. చేవెళ్లను దేశంలో అత్యుత్తమ పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం కోసం ఈ సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రకటించారు. అత్యంత వైవిధ్యత కలిగిన చేవెళ్ల నియోజకవర్గంలో 29 లక్షల మంది విభిన్న కులాలు, మతాలు, భాషా బేధాలు కలిగిన వారు ఉన్నారని ఆయన చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా తన సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు.ఎంపీగా ఈ ప్రాంతానికి విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కేంద్ర నిధులతో విద్య, వైద్యం కల్పించడంతోపాటు ప్రైవేట్ స్కూలు, ఆసుపత్రిలో విషయంలో నియంత్రణ చర్యలు చేపడతానన్నారు. గోవా తరహాలో కమ్యూనిటీ స్కూల్స్ తీసుకొచ్చి అధిక ఫీజుల భారం లేకుండా చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. చేవెళ్ల ప్రాంత యువతను వేధిస్తున్న అతి ప్రధాన సమస్య నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తానన్నారు. భారీ పెట్టుబడులు తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల్లో శిక్షణను ఇప్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తానన్నారు. తమ గ్రామంలోనే ఉంటూ ఉపాధి పొందే అవకాశాన్ని ఇక్కడ యువకులకు అందిస్తానన్నారు. తాండూరు కందిపప్పుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ తీసుకురావడంలో తానే ముఖ్య పాత్ర పోషించానని ఆయన చెప్పారు. స్థానికంగా పండే పంటలకు అధిక ధరలు దక్కేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన సంకల్ప పత్రంలో పేర్కొన్నారు. చేవెళ్లను నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మిల్లెట్స్ హబ్ గా తీర్చి దిద్దుతానని ఆయన చెప్పారు.

## ప్రాణహాని ఉంది

విశాఖపట్టణం, ఏప్రిల్ 26 సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తన ప్రాణానికి ప్రమాదం ఉందని విశాఖ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం వీవీ లక్ష్మీనారాయణ జై భారత్ నేషనల్ పార్టీ పెట్టి విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో గాలి జనార్ధన్ రెడ్డిపై అనుమానం వ్యక్తం చేశారు. గాలి జనార్ధన్ రెడ్డిని గతంలో అరెస్ట్ చేసినందుకు తనను అంతమొందించేందుకు విశాఖపట్నంలో కుట్ర జరుగుతుందని తన దృష్టికి వచ్చిందని జేడీ లక్ష్మీనారాయణ తన ఫిర్యాదు పత్రంలో తెలిపారు. మైనింగ్ కేసుతో పాటు బెయిల్ కోసం జడ్జికి లంచం ఇచ్చిన కేసులోనూ జనార్ధన్ రెడ్డిని వీవీ లక్ష్మీనారాయణ విధుల్లో ఉన్నప్పుడు అరెస్టు చేశారు. ఇప్పుడు గాలి జనార్ధన్ రెడ్డి అలాంటి కుట్ర చేస్తున్నట్లుగా వీవీ లక్ష్మీనారాయణకు స్పష్టమైన సమాచారం వచ్చి ఉంటుందని అందుకే ఫిర్యాదు చేశారని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేసిన వీవీ లక్ష్మీనారాయణ ఈ సారి సొంత పార్టీ పెట్టుకున్నారు. జై భారత్ నేషనల్ పార్టీ పెట్టుకుని ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. ఈ సారి పార్లమెంట్ కు కాక అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. విశాఖ ఉత్తరం నుంచి నామినేషన్ వేసి ప్రచారం చేసుకుంటున్నరు. ఈ క్రమంలో తనపై దాడి జరుగుతుందని ఆయన అనుమానిస్తున్నారు. సంబంధించిన ఆధారాలను కూడా ఆయన పోలీసులకు అందజేశారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న వీవీ లక్ష్మీనారాయణ .. ప్రస్తుత ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి కి చెందిన సీబీఐ కేసుల్లో దర్యాప్తు అధికారి. ఆయనే అప్పట్లో జగన్ ను అరెస్టు కూడా చేశారు. ఆ కేసుల్లో చార్జిషీట్లు కూడా సీబీఐ జాయింట్ డైరక్టర్ గా ఉన్న లక్ష్మీనారాయణ నేతృత్వంలోనే దాఖలు చేశారు. ఆ తర్వాత ఆయన తన సొంత కేడర్ మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడ డీజీ క్యాడర్ లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయాల్లో ఓ సారి ఓడిపోయిన తర్వాత రైతుల కోసం స్వచ్ఛంద సంస్థను పెట్టారు. రాజకీయంగానూ తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు.

## వైభవంగా చెన్నకేశవుల స్వామి రథోత్సవం

### రథోత్సవములో పాల్గొన్న తెలుగుదేశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

### పెద్ద సంఖ్యలో భక్తులు

బద్వేలు నియోజకవర్గ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో గత కొన్ని దశాబ్దాలుగా అంగరంగ వైభవంగా చెన్నకేశవుల స్వామి వారి గుడి తిరుణాల సందర్భంగా ఇంటి దేవుడైన చెన్నకేశవుల స్వామి వారిని దర్శించుకుని పల్లకి మోస్తూ, రథం ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న బద్వేలు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి భారీ స్థాయిలో భక్తులు పాల్గొన్నారు ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు అందరంగ వైభవంగా జరుగుతాయి జాతీయ రహదారి పక్కనే స్వామివారి ఆలయం ఉంది ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది బద్వేలు పట్టణానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది

## మూగబోయిన బిఎస్ఎన్ఎల్

దుంబ్రిగూడ మండలంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సౌకర్యం గత నాలుగు రోజుల నుంచి మూగ బోవడంతో మండలంలోని బిఎస్ఎన్ఎల్ ఫోన్ వినియోగదారులు, ఇంటర్నెట్ వినియోగదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. బిఎస్ఎన్ఎల్ ఫోన్ వినియోగదారులతో పాటు వివిధ పనుల నిమిత్తం సెంటర్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కోసం బ్రాడ్ బాండ్ సౌకర్యాన్ని కల్పించుకొని ఉన్న వారికి పనులు జరగడం లేదు. దీంతో సకాలంలో ప్రభుత్వ కార్యాలయంలో పనులు జరగకపోవడంతో ప్రభుత్వ అధికారులు సిబ్బంది ఇబ్బంది పడకు తప్పడం తప్పని పరిస్థితిలో తమ సొంత డబ్బులను పెట్టుబడి చేసి జియో, ఎయిర్టెల్ వంటి నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుని పనులు చేసుకుంటున్నారు. వ్యాపార అవసరాల కోసం ఇంటర్నెట్ కేంద్రాల్లో ముందుగా బిఎస్ఎన్ఎల్ బ్రాస్బెండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకొని ఉన్నారు. అయితే గత నాలుగు రోజుల నుంచి సిగ్నల్స్ సౌకర్యం లేక వ్యాపారాలు జరగకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఇంటర్నెట్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ముదిరాజుల భవిష్యత్తు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల్లోనే క్షేమం.

**అభ్యర్థి వెంకటరామ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.**
**గ్రామాల్లో బిఆర్ఎస్ కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేద్దాం .**
**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు , లీగల్ సెల్ కార్యదర్శి కొట్టాల యాదగిరి ముదిరాజ్.**



మెదక్ తూప్రాన్ 26 ప్రాజబలం న్యూస్ :–మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల్లోనే ముదిరాజుల భవిష్యత్తు పదిలంగా ఉంటుందని, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి మద్దతుగా గ్రామాల్లో ముదిరాజులు ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేద్దామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు , హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా ముదిరాజులు వెంకటరామిరెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముదిరాజుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. బిజెపి , కాంగ్రెస్ అభ్యర్థుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని , విడిపోతే నష్టపోతామని , గోస పడతామని స్పష్టం చేశారు. చెరువులు , కుంటలు , ప్రాజెక్టులలో చేపలు పట్టే హక్కులు కల్పించడంతోపాటు ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కోకాపేటలో విలువైన 5 ఎకరాల భూమి , రూ 5 కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్ కు దక్కిందని అన్నారు . గతంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుగా వినియోగించుకొని అనంతరం పట్టించుకోకపోగా , అందుకు భిన్నంగా కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో అట్టడుగున నిలిచిన ముదిరాజుల అభ్యున్నతికి పెద్దపీట వేసి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని గోస పడకుండా కెసిఆర్ కు, బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి అండగా నిలిచే మంచి నిర్ణయం తీసుకుందామని సూచించారు. అయితే గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో 6 లక్షల మత్స్యకార్మిక సభ్యత్వాలు ఇవ్వగా , సబ్సిడీపై టూ వీలర్స్ , త్రీ వీలర్స్ , ఫోర్ వీలర్స్ అంది%శీ%చి సమాజంలో ముదిరాజులు గౌరవప్రదంగా బ్రతికేందుకు చొరవ చూపినట్లు చెప్పారు. కులాల పేరిట చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ అభ్యర్థికి తగిన బుద్ధి చెప్పే విధంగా ముదిరాజులు ఐక్యంగా ఉంటూ అన్ని రకాలుగా ఆదుకున్న కేసీఆర్ కు అండగా ఉందామని, తద్వారా సంపూర్ణ న్యాయం దక్కుతుందని వివరించారు . ఈ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగ కొనయిపల్లి పి బి గ్రామం లో శ్రీ కొట్టాల యాదగిరి సర్పంచ్ కంకణాల పాండుముదిరాజ్, మరియు గ్రామ కమిటీ అధ్యక్షులు నర్ర విఠల్ యూత్ అధ్యక్షులు నాగరాజు ముదిరాజ్, మరియు మల్కాపూర్ జిన్నా రాజు ముదిరాజ్ , నర్సంపల్లి చింతల శేఖర్ ముదిరాజ్, నాయకులు తదీతరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ లోని సీతారామ, ఉమామహేశ్వరుల కళ్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధంబీ రామకోటి రామరాజు.



మెదక్ గజ్వేల్ ప్రాజబలం న్యూస్ :–గజ్వేల్ లో జరిగే సీతారామ ఉమామహేశ్వరుల కళ్యాణం కోసం వేలాది భక్తులచే ఒడ్లను ఓలిపించి గోటి తలంబ్రాలుగా సిద్ధం చేపిస్తుంది శ్రీరామకోటి భక్త సమాజం. శుక్రవారం నాడు శేషసాయి మోక్షమందిరంలో గోటి తలంబ్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ భద్రాచల దేవస్థానంలో జరిగిన సీతారాముల కళ్యాణానికి 150కిలోల గోటి తలంబ్రాలను అందించిన చరిత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రామకోటి సంస్థకు దక్కిందన్నారు. అదే సంకల్పంతో గజ్వేల్ లో జరిగే సీతారాములకు కూడా గోటి తలంబ్రాలు అందిచాలని భక్తుల కోరిక మేరకు శ్రీకారం చుట్టామన్నారు.
ఈ కార్యక్రమంలో ఉప్పల మెట్టయ్య, యెల్లు రాంరెడ్డి, శేషసాయి భక్తబృదం వారు పాల్గొన్నారు.

# సర్వమానవ శాంతి దూత యేసుక్రీస్తు

## సీఎస్ఐ చర్చ్ ఫాధర్ డేవిడ్ పాల్
## ఘనంగా క్రీస్తు పునరుద్దాన మహోత్సవ జాతర



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 : సర్వమానవాళికి శాంతి సందేశాన్ని బోదించిన శాంతి దూత యేసుక్రీస్తు అని సీఎస్ఐ చర్చి ఫాదర్ డేవిడ్ పాల్ పేర్కొన్నారు.దేశంలోనే రెండవ పెద్ద చర్చ్ గా పిలువబడుతున్న మోదెలలో గల సిఎస్ఐ చర్చ్ ఏసు పునరుద్దాన మహోత్సవ జాతరను చర్చ్ ఫాదర్ లు కలిసి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో సంబరాలు ఆకాశన్నంటెలా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోరిన కోరికలు తీర్చి దేవునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ మాట్లాడుతూ...ఏప్రిల్ 25, 26 రెండు రోజులు జాతర కొనసాగుతుందన్నారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల తో పాటు రాష్ట్రాల నుండి కూడా వస్తారన్నారు. మొక్కుబడి చెల్లించేందుకు ఏ ప్రాంతంలో ఉన్న జాతరకు వస్తారన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు,చర్చి మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 26 (ప్రజాబలం) ఖమ్మం శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల ఏర్పాటు పనులను ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. సంజయ్ జి. కోల్టే, పోలీస్ పరిశీలకులు చరణ్ జిత్ సింగ్ లు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఖమ్మం లోకసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లు కళాశాలలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసే గదులను పరిశీలించి, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ, పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఇవిఎం ల కదలికలపై సూచనలు ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్, బ్యారికేడ్లు, పార్కింగ్, మీడియా సెంటర్ అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కు చేపట్టిన చర్యలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ లలో ఇవిఎం ల భద్రతకు ర్యాక్ లను పరిశీలించి, ఆయా సెగ్మెంట్ల ఇవిఎం లు పట్టేంత



సంఖ్యలో ఏర్పాటుచేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒక్కో సెగ్నెంట కు ఒక్కో కలర్ కోడ్ పెట్టి, ఆ అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించిన ఫ్లెక్సీలు, ఇవిఎం రవాణా సిబ్బంది టీ షర్టులు అదే కలర్ లో ఉండి, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జనరేటర్ సదుపాయం ఉండాలని, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. లెక్కింపు ప్రక్రియ, భద్రతా చర్యల గురించి సూచనలు చేశారు. ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి పరిశీలకులకు వివరించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, శిక్షణ ఐపీఎస్ పి. మౌనిక, జిల్లా రెవిన్యూ అధికారిణి రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, ఎస్ఇ ఆర్ అండ్ బి శ్యామ్ ప్రసాద్, ఎస్ఇ ట్రాన్స్కో సురేందర్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల అధికారిణి శ్రీలత, అధికారులు, తదితరులు ఉన్నారు.

# సమస్యలకు పరిష్కారం కనుగొనడమే ఒన్నోవేషన్

## జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 : ప్రకృతిలోనే అనేక ఆవిష్కరణను ఉంటాయని,మనం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం ఇన్నోవేషన్ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు.శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ వేసే శిబిరానికి జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం 15 రోజుల పాటు నిర్వహించడం జరిగిందని. విద్యార్థులు విద్యార్థులు దశలో ఉండే ఆవిష్కరణ పై ముక్కు తెచ్చుకోవాలని తెలిపారు. ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుని వరకు మానవులు ఎదుర్కొన్న సమస్యలను ఆవిష్కరణ ద్వారా పరిష్కరించడం జరిగిందని, అంశం చిన్నదైనా,పెద్దదైనా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు.వేసవి శిబిరం నుండి వెళ్లేటప్పుడు పుస్తకాలలో నేర్చుకున్న సిద్ధాంత పరమైన విషయాలను ఇక్కడ నేర్చుకునే ప్రయోగాత్మక విషయాలను కలిపి అనుభవించుకొని విషయ అవగాహన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ఉపయోగపడే కృత్యాలు చేయడం ద్వారా వాటిని నిజ జీవితంలో ఉపయోగపడే ఆవిష్కరణంగా ఎదగాలని,శిబిరం నిర్వహణ కు అవసరమైన మనలను అందించడం జరుగుతుందని తెలిపారు.జిల్లా సైన్స్ కేంద్రం ద్వారా విద్యార్థులకు విజయాన్ని అందించేందుకు కృషి చేస్తుందని, భవిష్యత్తు లో జిల్లా సైన్స్ కేంద్రానికి అనుసంధంగా జిల్లా సైన్స్ మ్యూజియం,పార్క్ వంటివి ఏర్పాటుకు ప్రయత్నాలు చేసి ఇంకా సైన్స్ విద్యార్థులకు మరింత చెరువ చూసేందుకు చర్యలు తీసుకోమంటావని తెలిపారు.వేసవి కాలంలో తగు జాగ్రత్తలు వహిస్తూ విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రయోగాత్మకంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అన్నారు. పనిని ఇష్టంగా చేయడం ఆదిమానవునికి లక్షణం అయితే స్మార్ట్ వర్క్ చేయడం నాగరిక మానవుని చిహ్నమని ఉన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా రోబోటిక్స్ ఆటోమేషన్ లపై విశాల్, బీబిక్స, సీనియర్ రోబోటిక్స్ మెంటర్ గ్రహణ కల్పించడం జరిగిందని,2 రోజులు రోబోటిక్ పై శిక్షణ లపై అందించడం జరుగుతుందని చెప్పారు.అనంతరం గురుత్వాకర్షణ శక్తి పై కృత్యదారంగా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో రిపోర్ట్స్ పర్సన్ జాకీర్ హుస్సేన్ కె తిరుపతి.రాజేశం ఉపాధ్యాయులు కుమార్, హరిప్రసాద్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అక్రమ లేవట్లపై ముఖ్యమంత్రి కి ఫిర్యాదు.

హుజురాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 26 కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. అక్రమ లేఅవుట్ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై, వీరికి సహకరిస్తున్న సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలంటూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సమ్మిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలతోపాటు, పలు గ్రామాల్లో రైతుల వద్ద తక్కువ ధరలకు భూములు కొన్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఔట్ వేస్తూ ప్లాట్లను విక్రయిస్తున్నారని చెప్పారు. బోర్నపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 324 లో వ్యవసాయ భూముల్లో నాలా పర్మిషన్ లో తక్కువ భూమి చూపి ఎక్కువ ప్లాట్లు విక్రయిస్తున్నారని, వీరికి రెవెన్యూ అధికారులు సహకరించడంతో పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని హుజురాబాద్–కరీంనగర్ హైవే రోడ్డు పక్కన గల సర్వే నంబర్ 2417,2418/1/2/3/4,2415,2416,2417 ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు వదిలిపెట్టడం లేదని, దళితులకు ప్రభుత్వ ఇచ్చిన భూములను దళితుల వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారికి ఉన్న అండదండలతో దళితులను బెదిరించి ఆ భూముల్లో అక్రమ లే–అవుట్లు చేసి విక్రయాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 887, 629,865,431,368,389,92,93 సర్వే నంబర్లు ప్రభుత్వ భూములను, శిఖం భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ లేఅవుట్లు చేసి ప్లాట్లుగా విభజించి కోట్లు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరిస్తున్న అధికారులతో పాటు అక్రమ లే–ఔట్లకు రిజిస్ట్రేషన్లు చేసిన హుజురాబాద్ సబ్ రిజిస్ట్రార్ పై సమగ్ర విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# హరీష్ రావు గారి మాటలు జుట మాటలు.

## తెరాస హయం లో మెదక్ జిల్లా కు ఒరోగింది ఏమి లేదు. హఫీజ్ మొల్సబ్ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్



తెరాస హయం లో మెదక్ కు ఒరిగింది ఏమి లేదు, కేవలం మాయమాటలు తప్ప, తెలంగాణ లో 32జిల్లా లలో కలెక్టర్, %ంజూ% ఆఫీస్ లు కట్టారు, దానిలో భాగంగా ఇక్కడ కట్టారు, మెదక్ నియోజకవర్గం లొ అభవృద్ధి మరిచారు.

మెదక్ పట్టణం లొ ప్రధాన రహదారి వేయుటకు 9సంవత్సరాలు పట్టింది.

ఇందిరా గాంధీ హయం లోనే మెదక్ జిల్లాకు ordinance factory, భేల్, icrisat తో పాటు చాలా పరిశ్రమలు ఏర్పాటు చేయబడ్డాయి,

కానీ తెరాస 9సంవత్సరాల కాలంలో జిల్లా అభవృద్ధి జరగ లేదు.

ఇచ్చిన 6 గ్యారంటీ లొ 4గ్యారంటీ లను అమలు చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ,

మహిళలకు బస్సు లలో ఉచిత ప్రయాణం,10లక్షలు ఆరోగ్య శ్రీ పథకం 200యూనిట్ ల వరకు ఉచిత కరెంటు,500లకే గ్యాస్ అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ,

రైతులకు 2లక్షలు రుణ మాఫీ కూడా 15ఆగష్టు లోపు చేయడానికి నిర్ణయం తీసికున్న కాంగ్రెస్ పార్టీ,

ఇచ్చిన హామీలు తుచ్చా తప్పకుండ అమలు చేయనున్నారు,

రాజిపార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కు ప్రజలు పట్టం కట్ట నున్న రాని హఫీజ్ మొల్సబ్ ధీమా వ్యక్తం చేస

# నామినేషన్ ఘట్టం ముగిసింది. ఇక యుద్ధమే!



ప్రజాబలం శేరిలింగంపల్లి ఈ చేవెళ్ళ గడ్డపై చేతి పార్టీ ప్రభంజనమే!! : శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వి. జగదీష్ గౌడ్. రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ.డాక్టర్.జి.రంజిత్ రెడ్డి దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే .రామ్మోహన్ రెడ్డి , తెలంగాణ టిఎంఆర్ఈఐఎస్ అధ్యక్షులు ఫాయిమ్ తో కలిసి పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్.

# ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తాం

## వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలిపించండి ప్రచారంలో జోరుపెంచిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని,పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకుడు ఎం డీ అమీర్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలువార్డుల్లో అయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ...పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలిపించాలని,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని పట్టణంలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ,చేతి గుర్తుకు ఓటేయ్యాలని ప్రచారం చెయ్యాలని కార్యకర్తలను ఆదేశించారు.అనంతరం ఓటు ఎలా వేయాలో ప్రజలకు,ఓటర్లకు అవగాహన కల్పించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గడ్డం వంశీ కృష్ణ ను గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని,చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గడ్డం వంశీ కృష్ణ ను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు నయీమ్,అంజూమ్,జమీర్, మస్రత రఫీక్, వీఖర్,సాదిక్, నజీర్,షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# నేనా... ప్రజాశాంతి పార్టీనా

వరంగల్, ఏప్రిల్ 26 మాజీ మంత్రి, సినీనటుడు బాబూమోహన్ వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేశారు. మధ్యాహ్నం వరంగల్ రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు చేరుకున్న ఆయన నడుము నొప్పితో ఇబ్బంది పడగా.. స్టాఫ్ వీల్‌ఛైర్ ఏర్పాటు చేసి లోనికి పంపారు. రిటర్నింగ్ ఆఫీసర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు బాబుమోహన్. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కేఏ పాల్ ప్రజాశాంతి పార్టీ నుంచి నామినేషన్ వేస్తారనే ప్రచారం జరిగిందని మీడియా మిత్రులు ప్రశ్నించగా.. . బీజేపీ నుంచి బయటకు వచ్చాక.. కేఏ పాల్ కాఫీకి రమ్మంటే వెళ్లానని, అక్కడ పాల్ తనకు కండువా కప్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఇచ్చారని వెల్లడించారు. తాను ఎలాంటి పార్టీ సభ్యత్వం తీసుకోలేదని, అదే రోజు ఆ పార్టీకి గుడ్ బై చెప్పానట్లు వివరించారు. వరంగల్‌లో కొందరు ఫాలోవర్స్ కోరిక మేరకు ఇండిపెండెంట్

# చట్ట వ్యతిరేకమైన నేరాలపై ఉక్కుపాదం పీడి యాక్ట్ అమలకు జాబితా సిద్ధం

## చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడేవారు వారి నేర ప్రవృత్తి మార్చుకోవాలి పోలీస్ కమీషనర్ ఐపిఎస్ (ఐజీ)ఎం.శ్రీనివాస్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతూ నేరాల నియంత్రణకై పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది అని ముఖ్యంగా రామగుండం కమిషనర్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా,నకిలీ విత్తనాల అక్రమ రవాణా,పేకాట,కోడి పందాలు ఆడేవారిపై,గుడుంబా తయారీ, అక్రమ రవాణా,ఇల్లీగల్ ఫైనాన్స్,అనుమతి లేని చిట్ ఫండ్స్, భూకబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, అనుమతి లేని లే అవుట్ వెంచర్స్ నిర్మాణం,ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు కఠినంగా వ్యవహరిస్తూ ఎంతటి వారైనా ఉపేక్షించకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని,చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు పాల్పడుతూ ప్రజలకు నష్టం జరిగే పనులు చేసే వారికి చట్ట పరిధిలో శిక్ష తప్పదని రామగుండం పోలీస్ కమీషనర్ ఐపిఎస్ (ఐజీ) ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలిపారు.పిడి యాక్ట్ అమలకు రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే కొంతమంది వ్యక్తుల జాబితా సిద్ధం చేశాం అని సిపి తెలిపారు.ఫిబ్రవరి 14 నుండి ఈరోజు వరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ లో నమోదైన కేసుల వివరాలు

గంజాయి కేసులు

16 కేసులు 42 మందిపై నమోదు చేయడం జరిగింది. 13.228 కిలోల గంజాయి,14 గంజాయి మొక్కలు స్వాధీనం. వాటి విలువ 4,65,700/- రూపాయలు.పిడిఎస్ రైస్ కేసులు

48 కేసులు 70 మందిపై నమోదు చేయడం జరిగింది. 96,905 కిలోల పిడిఎస్ రైస్(969.05 క్వింటాల్ ) స్వాధీనం. వాటి విలువ 17,94,090/- రూపాయలు.

ఫైనాన్స్ కేసులు

23 కేసులు 24 మందిపై నమోదు చేయడం జరిగింది.

ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర్ స్కీం (పి ఎమ్ కె కె) కేంద్ర ప్రభుత్వ పథకం నకు సంబందించి ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వారా అవకతవకలకు పాల్పడిన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటడ్ సంస్థ నిర్వాహకులు అరెస్ట్.

ఐడి లిక్కర్ కేసులు

105 కేసులు 105 మందిపై నమోదు చేయడం జరిగింది. 513 లీటర్లు స్వాధీనం. వాటి విలువ 2,01,720/- రూపాయలు.

ఐఎమ్ఎఫ్ఎల్ లిక్కర్ కేసులు

178 కేసులు 181 మందిపై నమోదు చేయడం జరిగింది. 1449 లీటర్లు స్వాధీనం. వాటి విలువ 8,34,649/- రూపాయలు.

పేకాట కేసులు

27 కేసులు184 మందిపై నమోదు చేయడం జరిగింది.22,15,260/- రూపాయలు సిజ్ చేయడం జరిగింది.

ఇసుక అక్రమ రవాణా కేసులు

40 కేసులు 87 మందిపై నమోదు చేయడం జరిగింది. 438400/- రూపాయలు విలువ గల ఇసుక ,ట్రాక్టర్స్ -50,డిసిఎం వ్యాన్ -01 ,జెసిబీ లు-03 సిజ్ చేయడం జరిగింది.

మంథని ముత్తారం ఖమ్మం పల్లి గ్రామ శివారులో 60 ట్రాక్టర్ ల అక్రమంగా నిలవ ఉంచిన ఇసుక డంపు సిజ్ చేయడం జరిగింది.

నకిలీ విత్తనాల కేసులు

01 కేసు (01) ఒక్కరిపై నమోదు చేయడం జరిగింది. 5000/- రూపాయలు విత్తనాలు సిజ్ చేయడం జరిగింది.

డిజిల్ దొంగతనం కేసు

02 కేసులు 07 మందిపై నమోదు చేయడం జరిగింది. 526945/- రూపాయల విలువగల 5325 లీటర్ల డిజిల్ సిజ్ చేయడం జరిగింది.

కోడి పందెం కేసులు

01 కేసు 11 మందిపై నమోదు చేయడం జరిగింది.02 పందెం కోళ్ళు ,04 బైక్స్,05 సెల్ ఫోన్స్ ,2980/- నగదు సిజ్ చేయడం జరిగింది

# పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను భారీ మెజార్టీ తో గెలిపించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం కుమార్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తాండూర్ మండలం కేంద్రంలోని అచలాపూర్,రేచిని గ్రామపంచాయతీ లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ప్రచారంలో పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ,మాజీ మంత్రివర్యులు వేణుగోపాల్ చారి,మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి మాట్లాడుతూ... కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు 30 లక్షల ఉద్యోగలు భర్తీ.ఉపాధి హామీ కూలీలకు రోజుకు ?400 రూపాయలకు పెంపు.కాక వెంకట స్వామి మనవడు,వివేక్ కుమారుడు,గడ్డం వంశీ కృష్ణ పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గా మీ ముందుకు వస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి వారికి భారీ మెజారిటీతో ఆశీర్వదించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే 6 గ్యారంటీలను అమలు చేస్తామని అ రోజు ప్రచారంలో చెప్పడం జరిగింది.చెప్పిన విధంగా అమలు చేస్తున్నాం.ప్రజలందరి ఆశీర్వాదంలో కాంగ్రెస్ పార్టీ,మీ ఎమ్మెల్యేగా గెలుపొందిన 100 రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో 6 గ్యారంటీలలో భాగంగా 5 గ్యారంటీలను అమలు చేయడం జరిగింది.ఎన్నికలు కోడ్ తరువాత మరో గ్యారంటీ అయినా ? 2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేయడం జరుగుతుంది.సోనియా గాంధీ పార్లమెంట్ ఎన్నికల సందర్బంగా 5 న్యాయ గ్యారంటీలను ప్రవేశపెట్టడం జరిగింది.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పంటకు కనీస మద్దతు ధర,ఉపాధి హామీ కూలీలకు రోజుకు ? 400 పెంపు,ప్రతి పేద కుటుంబ మహిళకు ఏటా 1 లక్ష రూపాయలు,ఆరోగ్య బీమా 25 లక్షలు,యువతకు 30 లక్షల ఉద్యోగలు కలిపించడం జరుగుతుందన్నారు.



కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 5 న్యాయ గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. బీజేపీ,బి.ఆర్.ఎస్ ప్రభుత్వాలు 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేసారో చెప్పాలని.బీఆర్ఎస్ ప్రభుత్వంలో వడ్లు కటింగ్ చేసి రైతులను మోసం చేసిన ఘనత %దీ=ా% ప్రభుత్వనీది అని విమర్శించారు.పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయనా గడ్డం వంశీ కృష్ణ కి మీ అమూల్యమైన ఓటు వేసి పెద్దపల్లి నియోజకవర్గంలో భారీ మెజారిటీ ఇవ్వాలని ప్రజలను కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com